www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



వలస సమస్యకు మతం రంగు!

బ్రిటన్‌లో హింసాకాండకు ఇదే కారణం

ముగ్గురు బాలికల హత్యపై వదంతులు

పలు నగరాల్లో విధ్వంసం, దాడులు 12

అక్రమంగా వస్తున్న వారిపై ప్రజల్లో అసంతృప్తి


మతం పేరిట రెచ్చగొడుతున్న రైటిస్ట్ సంస్థలు

అంతర్యుద్ధం తప్పదు: మస్క్.. ఖండించిన ప్రధాని స్టార్మర్

బుధవారం | 7-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 113 | విజయవాడ సిటీ**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 10.06 తదుపరి చవితి; నక్షత్రం పుబ్బ రా. 8.30 తదుపరి ఉత్తర; వర్జ్యం: తె. 4.37 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.46; అమృతఘడియలు: మ. 1.21-3.08; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.41

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




క్యూబా రెజ్లర్ యుస్నీలీస్ లోపెజ్‌ను మట్టికరిపించిన వినేశ్ ఫొగాట్

వినేశ్.. వాహ్

పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరిన భారత రెజ్లర్.. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా రికార్డు

నేడు అమెరికా యువతితో స్వర్ణం కోసం పోరు.. జావెలిన్ త్రోలో తుది సమరానికి నీరజ్ చోప్రా

పారిస్ ఒలింపిక్స్ మొదలై 11 రోజులు.. భారత్‌కు దక్కింది 3 కాంస్యాలే..! మరో పతకం కోసం అభిమానుల ఆశ.. ఈవెంట్లు అయిపోతుండడంతో నిరాశ.. ఇలాంటి సమయంలో వినేశ్ ఫొగట్ అద్భుతం చేసింది..! మహిళల రెజ్లింగ్ 50 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో దుమ్మురేపింది.. సెమీ ఫైనల్లో క్యూబా రెజ్లర్ యుస్నీలీస్ లోపెజ్‌ను మట్టికరిపించింది..! ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా రికార్డులకెక్కింది. ప్రీ క్వార్టర్స్, క్వార్టర్స్, సెమీఫైనల్స్.. ఇలా ఒకేరోజు 3 బౌట్లలో తలపడి.. అలసట అనేదే లేకుండా ఫలితాన్ని రాబట్టింది..! బుధవారం రాత్రి జరిగే ఫైనల్లో అమెరికా రెజ్లర్ సారా హిల్‌డెబ్రాంట్‌తో వినేశ్ తలపడనుంది. ఇందులో నెగ్గితే స్వర్ణంతో చరిత్ర సృష్టించనుంది. ఓడినా రజతంతో సంతృప్తిగా వెనక్కురానుంది. మరోవైపు అంచనాలను నిజం చేస్తూ.. వరుసగా రెండో ఒలింపిక్ స్వర్ణానికి గురిపెడుతూ.. జావెలిన్ త్రోలో ఫైనల్‌కు చేరాడు నీరజ్ చోప్రా. గురువారం రాత్రి ఫైనల్ జరగనుంది. హాకీలో భారత జట్టు తీవ్రంగా పోరాడినా.. 2-3 తేడాతో జర్మనీ చేతిలో ఓడిపోయింది. కాంస్యం కోసం స్పెయిన్‌తో తలపడనుంది. 9



నీరజ్ చోప్రా

విద్యార్థుల పంతం నెగ్గింది



బంగ్లా ప్రభుత్వాధినేతగా నోబెల్ గ్రహీత యూనస్



అర్ధరాత్రి అధ్యక్ష కార్యాలయం ప్రకటన

బంగభవన్‌లో అధ్యక్షుడు షహబుద్దీన్‌తో 6 గంటల పాటు విద్యార్థుల సుదీర్ఘ చర్చలు

మధ్యలో త్రివిధ దళాధిపతుల రంగ ప్రవేశం

అధ్యక్ష భవనం చుట్టూ మిలిటరీ మోహరింపు

ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా ఉత్కంఠ

మాజీ ప్రధాని ఖలీదా జియా విడుదల

హింసతో ఆందోళనకారుల బీభత్సం

దేశవ్యాప్తంగా హత్యలు.. లూటీలు

పోలీస్‌స్టేషన్లకూ దుండగుల నిప్పు

గందరగోళంలో ప్రభుత్వోద్యోగులు

కల్లోలం వెనుక విదేశీ హస్తం!

అమెరికా కుట్ర? ఖలీదా కుమారుడు పాక్‌తో కలిసి పన్నిన వ్యూహం?



సంక్షోభం వెనుక 26 ఏళ్ల యువకుడు

విద్యార్థి సంఘాల నేత నహీద్

రిజర్వేషన్ల ఉద్యమాన్ని పెను తుఫానుగా మార్చడంలో కీలక పాత్ర

ఢాకా, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ వీడింది..! నోబెల్ అవార్డు గ్రహీత మహమ్మద్ యూనస్‌ను తాత్కాలిక ప్రభుత్వాధినేతగా దేశాధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ ప్రకటించారు. తన అధికార నివాసం బంగభవన్‌లో విద్యార్థి సంఘాల నేతలు, త్రివిధ దళాధిపతులతో సుదీర్ఘంగా జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అధ్యక్షుడి

మిగతా 2వ పేజీలో...

బంగ్లాలో 19 వేల మంది భారతీయులు

చాలామంది తిరిగొచ్చేశారు

హసీనా షాక్‌లో ఉన్నారు

తర్వాత మాట్లాడతాం

అఖిలపక్ష భేటీలో విదేశాంగ మంత్రి జై శంకర్

హసీనాకు ఆశ్రయానికి బ్రిటన్ నిరాకరణ

నిబంధనలు అనుమతించవని వెల్లడి.. వీసా రద్దు చేసిన అమెరికా 2



జలవనరుల శాఖ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

పోలవరానికి దారేది?

దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, కుంగిన గైడ్‌బండ్, కాఫర్ డ్యామ్‌ల సీపేజీ.. ఈ పనులు ఎవరితో పూర్తి చేయించాలి?

ప్రస్తుత సంస్థకేనా.. మరొకరికి అప్పగించాలా?

ప్రభుత్వం ముందు జలవనరుల శాఖ ప్రతిపాదనలు

డయాఫ్రమ్ వాల్‌పై కేంద్ర జల సంఘం నిర్ణయం తెలుసుకోండి.. ఢిల్లీకి వెళ్లి పరిస్థితి వివరించండి

మంత్రి నిమ్మల, ప్రత్యేక సీఎస్‌కు సీఎం ఆదేశం

నవంబరు నుంచి పోలవరం పనులకు నిర్దేశం

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును గాడిన పెట్టేదెలా? మిగిలిన పనులను ప్రస్తుత కాంట్రాక్టు సంస్థతోనే చేయించాలా? లేక... కొత్త ఏజెన్సీని పిలవాలా? మరీ ముఖ్యంగా... కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను ఎవరికి అప్పగించాలి? దీనిపై కేంద్రం నుంచి స్పష్టత తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. మంగళవారం జల వనరుల శాఖపై

మిగతా 11వ పేజీలో...

విచ్చుకుంటున్న కొత్త రెక్కలు!

కుప్పం, దగదర్తి, సాగర్, మూలపేటల్లో విమానాశ్రయాలు

కక్షపూరితంగా నాడు ఆపేసిన ప్రాజెక్టుల్ని పట్టాలెక్కించాలి

ఆగిపోయిన పోర్టులు, ఫిషింగ్ హార్బర్లనూ పూర్తిచేయాలి

పెట్టుబడులు-మౌలిక సదుపాయాల శాఖపై సీఎం సమీక్ష

ఫైబర్‌నెట్‌లో రుణం 1500 కోట్లు పక్కదారి: అధికారులు

కనెక్షన్ల చార్జీల సొమ్మునూ దోచేశారా?.. సీఎం విస్మయం

ఏపీలో యూట్యూబ్ అకాడమీ

సంస్థ గ్లోబల్ సీఈవో, గూగుల్ ఏపీఏసీ హెడ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ చర్చలు 11

సీఐడీకి మదనపల్లె 'ఫైల్స్'

డీజీపీ ఉత్తర్వులు.. అసలు సూత్రధారుల పట్టివేతకే లోతుపాతులు తవ్వి తీయనున్న ప్రభుత్వం 12

ఇదేం పేచీ?

'జడ్ ప్లస్' ఇచ్చినా చాలదా జగన్?





సీఎంగా ఉన్నప్పుడూ అదే స్థాయి

దానినే కొనసాగించిన కూటమి సర్కారు

సాంకేతికంగా ఆయన ఎమ్మెల్యే మాత్రమే

నిబంధనలకు మించి 58 మందితో భద్రత

అది చాలదంటూ కోర్టుకెక్కిన జగన్

భద్రతకు ముప్పంటూ బుకాయింపు

కోడికత్తి, గులకరాయి దాడి బూచి

రెండింటిపైనా ప్రజల్లో అనుమానాలు

పదవిలో ఉండగా భారీ హంగామా

ఎస్ఎస్‌జీ పేరుతో ప్రత్యేక దళం.. విదేశాల్లో కుటుంబ సభ్యులకూ భద్రత

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రతి దానికీ 'పేచీ' పెట్టడం! 'అదే కావాలి' అని మారాం చేయడం! కోర్టులకు ఎక్కడం! ఇదీ... విపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీరు! పదకొండు సీట్లకే పరిమితమైనప్పటికీ... ప్రధాన ప్రతిపక్ష నేత హోదా కావాలని, లేదంటే శాసనసభకు రానని ఆయన ఇప్పటికే బెదిరింపులకు దిగారు. దానికోసం హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఇప్పుడేమో... తాను కోరినంత భద్రత కల్పించాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. జగన్‌కు అత్యున్నతస్థాయిలో జడ్‌ప్లస్ కేటగిరీ భద్రత కల్పించినా... ఇలా పేచీ పెట్టడమేమిటని పోలీసు అధికారులే

మిగతా 12వ పేజీలో...

మాజీ సీఎంకు 980 మందితో భద్రత అవసరమా?

ఇది ఒక ఊరిలో ఓటర్ల సంఖ్యంత: హోంమంత్రి అనిత

కోర్టు తలుపులు తడతాం!

కక్షలు తీర్చుకోవడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు: జగన్

మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలు సీఎంకు తెలియడం లేదు 12

శాంతిభద్రతలు అదుపు తప్పాయి.. రాష్ట్రపతి పాలన ఎందుకు పెట్టకూడదు?

గవర్నర్ చూసీ చూడనట్లు ఉండొద్దు.. రాష్ట్ర పరిస్థితులు దేశం దృష్టికి: జగన్

ఆడంబరాల్లేని అధ్యక్షా..



ఆయన సభలో అడుగు పెడితే సీఎం కూడా లేచి నిలబడాల్సిందే! 'అధ్యక్షా...' అని పిలవాల్సిందే! ఆయనే... అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు! ఆయన హంగూ ఆర్భాటాలను పక్కనపెట్టి సతీసమేతంగా రైలెక్కారు. మంగళవారం కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో సాధారణ ప్రయాణికుడిలా... గోదావరి ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. అయ్యన్న చుట్టూ పార్టీ నేతలు, అనుచరులు ఎవరూ కనిపించలేదు. భద్రతా సిబ్బంది ముందుగానే రోడ్డుమార్గంలో విజయవాడ వెళ్లినట్టు తెలిసింది.

– తుని రూరల్

కన్నీటి కలబోత.. చేనేత

నేతన్నల వెతలు పట్టించుకోని గత వైసీపీ సర్కారు

4.5 లక్షల మందిలో 81 వేల మందికే 'నేతన్న నేస్తం'

ఆప్కోను ప్రక్షాళన చేస్తామన్న హామీకి జగన్ నీళ్లు 3

విద్యార్థుల యూనిఫాం పొరుగు రాష్ట్రాల్లో కొనుగోలు

కమీషన్ల కోసం తాడేపల్లి పెద్దల సిఫారసుతో కోట్ల మీటర్ల వస్త్రానికి వైసీపీ సర్కారు ఆర్డర్లు


నగరి నుంచి నాసిరకం వస్త్రం సరఫరా

16 కోట్ల బిల్లు మంజూరులో మాజీ మంత్రి రోజా పాత్ర

సీఎం చంద్రబాబు చేయూత కోసం నేతన్నల నిరీక్షణ

నేడు చేనేత దినోత్సవం

విద్యార్థుల పంతం నెగ్గింది!


మహమ్మద్ యూనస్


మంగళవారం పోలీసులు విధుల్లోకి రాకపోవడంతో ఢాకాలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న ఓ విద్యార్థి

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి జోనాల్ అబేదిన్ ఓ ప్రకటన చేశారు. వివిధ పక్షాలు, రాజకీయ పార్టీలతో చర్చించాక.. తాత్కాలిక ప్రభుత్వంలో మిగిలిన సభ్యుల పేర్లను ఖరారు చేస్తామని పేర్కొన్నారు. దీంతో.. విద్యార్థి సంఘాలు తమ పంతం నెగ్గించుకున్నట్లైంది. మరోవైపు దేశవ్యాప్తంగా ఆందోళనకారులు ఉధృతంగా హింసకు పాల్పడ్డట్లు వెల్లడైంది. చాలా చోట్ల హత్యలు, లూటీలు జరిగాయి. పోలీస్‌స్టేషన్లకు కూడా ఆందోళనకారులు నిప్పుపెట్టారు. హిందువుల, అవామీ లీగ్ నేతలే లక్ష్యంగా దాడులు జరిగాయి. జైళ్లను బద్ధలు చేయడంతో.. ఖైదీలు పరారయ్యారు.

సైన్యం ప్రవేశంతో ఉత్కంఠ..!

మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుపై మంగళవారం ఉదయం నుంచి సందిగ్ధత నెలకొంది. "ప్రజలు ఎన్నుకోని వారికి ఒక్క నిమిషం కూడా అధికారం ఇవ్వొద్దు. అలా చేస్తే.. బంగ్లాదేశ్ మరో పాకిస్థాన్ అవుతుంది".. అని హసీనా కుమారుడు నజీబ్ వజీద్ జాయ్ ముందే హెచ్చరించారు. విద్యార్థి సంఘాల సమన్వయ కర్త నహీద్ ఇస్లాం కూడా మధ్యంతర పౌర ప్రభుత్వానికే ఆమోదం తెలుపుతామని భీష్మించారు. ఆర్మీ పాలనను అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో సర్కారు ఉండాలని పేర్కొన్నారు. యూనస్ కూడా.. ఎంతో త్యాగం చేసిన విద్యార్థుల కోసం తాను ప్రభుత్వాన్ని నడిపేందుకు సిద్ధమేనని ప్రకటన చేశారు. అయితే.. ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమా మాత్రం సైనిక పాలన వైపే మొగ్గుచూపుతున్నట్లు వార్తలొచ్చాయి. ఈ పరిణామాల మధ్య బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి విద్యార్థి సంఘాల నాయకులు, త్రివిధ దళాల అధిపతులతో తన అధికారిక నివాసం 'బంగభవన్'లో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ చర్చలు జరుగుతుండగానే రాత్రి 7.40 సమయంలో త్రివిధ దళాధిపతులు, ఆర్మీ చీఫ్ కూడా బంగభవన్ చేరుకొని చర్చల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత అర్ధరాత్రి వరకు గంటగంటకూ బంగభవన్ వెలుపల ఆర్మీ మోహరింపు పెరుగుతూ వచ్చింది. దీంతో ఉత్కంఠ నెలకొంది. చివరకు అర్ధరాత్రి 12 గంటల సమయంలో.. తాత్కాలిక ప్రభుత్వానికి అధినేతగా యూనస్ ఉంటారంటూ అధ్యక్ష కార్యాలయం నుంచి ప్రకటన వెలువడడంతో ఉత్కంఠ వీడింది.

ఖలీదా విడుదల

బీఎన్‌పీ చైర్‌పర్సన్ ఖలీదా జియా నిర్బంధం నుంచి విడుదలయ్యారు. సోమవారం రాత్రే ఆమె విడుదలకు అధ్యక్షుడు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆమె 2018 ఫిబ్రవరి 8 నుంచి రెండేళ్ల పాటు జైలులో ఉన్నారు. ఆమెకు అవినీతి కేసుల్లో 13 ఏళ్ల జైలు శిక్ష పడగా.. 2020 మార్చి 25న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా ఆమె విడుదలయ్యారు. ఆ తర్వాత హోంఅరెస్టులో ఉన్నారు. మాజీ సైనికాధికారి, బ్రిగేడియర్ జనరల్ అబ్దుల్లా-ఉల్-అమన్ అజ్మీ, సుప్రీంకోర్టు న్యాయవాది అహ్మద్-బిన్-ఖాసీం(అర్మాన్) జైలు నుంచి విడుదలయ్యారు. అబ్దుల్లా-ఉల్-అమన్‌కు 1971 నేరాలకు వ్యతిరేకంగా మరణ శిక్ష పడింది. దాంతో ఎనిమిదేళ్ల క్రితం ఆయనను విధుల నుంచి తొలగించారు.

హత్యలు.. లూటీలు

షేక్ హసీనా రాజీనామా తర్వాత.. దోపిడీలు చేసే గుంపులు ఆందోళనకారుల్లో కలిసిపోయి.. రాత్రి 7.30 సమయం నుంచి అర్ధరాత్రంతా దేశవ్యాప్తంగా హత్యలు, లూటీలు చేశాయి. సినీనటుడు శాంటోఖాన్ మొదలు.. అవామీ లీగ్ పార్టీకి చెందిన జిల్లా, తాలూకా నేతల దాకా పలువురు హత్యకు గురయ్యారు. వారి ఇళ్లకు నిప్పు పెట్టారు. పోలీస్‌స్టేషన్లలోనూ లూటీ చేసి, కంప్యూటర్లు, ఏసీలు, తుపాకీలను దోచుకున్నారు. చివరకు పోలీసు వాహనాల విడిభాగాలను కూడా వదిలిపెట్టలేదని బంగ్లాదేశీ పత్రికలు కథనాలను ప్రచురించాయి. ఢాకాలోని సావర్‌లో జరిగిన హింసలో 31 మంది చనిపోయారు. కాక్స్‌బజార్, ఎయిర్‌పోర్ట్ రోడ్డు, సిల్వర్‌సైన్ తదితర ప్రాంతాల్లో దుకాణాలు, హోటళ్లు, ఏటీఎం కేంద్రాలు లూటీకి గురయ్యాయి. ఈ ప్రాంతాల్లో జరిగిన హింసలో ఇద్దరు బీఎన్‌పీ నేతలు సహా.. 14 మంది మరణించారు. లాల్‌మొనిర్హాట్‌లో అవామీ లీగ్ నేత సుమోన్‌ఖాన్ ఇంటిని తగులబెట్టగా.. ఆరుగురు కుటుంబ సభ్యులు సజీవదహనమయ్యారు. జస్సోర్‌లోని అవామీ నేత షాహిన్ చక్కల్దర్‌కు చెందిన 14 అంతస్తుల 'హోటల్ జబీర్ ఇంటర్నేషనల్'కు నిప్పు పెట్టిన ఘటనలో మృతుల సంఖ్య 24కు చేరుకుందని అధికారులు తెలిపారు. కోటా ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుంచి 440 మరణాలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రెండు జైళ్లపై దాడి.. లూటీ.. ఖైదీల పరార్

సోమవారం జరిగిన ఆందోళనల్లో రెండు జైళ్లు ధ్వంసమయ్యాయి. వాటిల్లోని కరడుగట్టిన ఖైదీలు పరారవ్వగా.. ఒక జైలుకు చెందిన పలువురు ఖైదీలు తిరిగి వచ్చారు. ఆందోళనకారులు జైళ్లలోనూ దోపిడీకి పాల్పడ్డారు. షేర్పూర్‌లో ఉన్న జిల్లా జైలు గేట్లను బద్ధలు కొట్టిన సుమారు 10 వేల మంది ఆందోళనకారులు లోనికి దూసుకెళ్లారు. ఈ క్రమంలో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న 10 మంది కరడుగట్టిన ఖైదీలతో పాటు 500 మందికి పైగా ఖైదీలు పారిపోయారు. సత్ఖిరా జిల్లా జైలులో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. ఇక్కడ 596 మంది ఖైదీలు పారిపోయారు.

అయోమయంలో ఉద్యోగులు

ప్రభుత్వోద్యోగులు మంగళవారం విధులకు హాజరైనా.. చాలా చోట్ల కార్యాలయాలు తెరుచుకోలేదు. పార్లమెంట్ సచివాలయం, సుప్రీంకోర్టులోకి ఉద్యోగులను వెళ్లనీయలేదు. ప్రభుత్వ వెబ్‌సైట్లను డౌన్ చేశారు. మరికొన్ని కార్యాలయాల్లో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించారు. పోలీసుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఢాకా సహా.. ప్రధాన నగరాల్లో సింహభాగం పోలీస్‌స్టేషన్లను ఆందోళనకారులు తగుల బెట్టారు. చాంద్‌పూర్‌లో ఐదు ఠాణాల్లో లూటీ జరగ్గా.. ఓ ఎస్సై హత్యకు గురయ్యారు. బనియాచౌక్‌లో ఓ పోలీసు అధికారిని చంపి, చెట్టుకు వేళాడదీశారు.

ఆర్థికవేత్త నుంచి.. ప్రభుత్వాధినేతగా

» మహమ్మద్ యూనస్ ప్రస్థానం

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నియమితుడైన మహమ్మద్ యూనస్ ఆర్థికవేత్తగా సుపరిచితుడు. 2006లో నోబెల్ శాంతి పురస్కారం అందుకున్న యూనస్ 1940 జూన్ 28న తూర్పు బెంగాల్(ప్రస్తుతం బంగ్లాదేశ్)లోని చిట్టాగాంగ్‌లో జన్మించారు. ఆయన విద్యాభ్యాసమంతా చిట్టాగాంగ్‌లోనే జరిగింది. ఆ తర్వాత ఆయన పలు దేశాల వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. గ్రామీణ బ్యాంకులను స్థాపించి.. మైక్రోక్రెడిట్, మైక్రోఫైనాన్స్ విధానాలను పరిచయం చేశారు. ఈ అంశంపైనే ఆయనను నోబెల్ వరించింది. ఆయనను నోబెల్‌కు ఎంపిక చేసినప్పుడు ఆ పురస్కార కమిటీ బ్యాంకు రుణాలకు అర్హులు కాని పేద, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు గ్రామీణ బ్యాంకు ఓ దిక్సూచి వంటిదని వ్యాఖ్యానించింది. ఆర్థిక రంగానికి ఆయన చేసిన సేవకు గాను.. అమెరికా సహా.. పలు దేశాలు యూనస్‌ను పలు పురస్కారాలతో గౌరవించాయి. యూనస్ 2009లో అమెరికా ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అవార్డు అందుకున్నారు.

ఎవరీ నహీద్?

హసీనా రాజీనామా చేసి, భారత్ వెళ్లడానికి.. బంగ్లాదేశ్‌లో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు నిర్ణయాల వెనక.. విద్యార్థి సంఘాల సమన్వయకర్త.. 26 ఏళ్ల నహీద్ ఇస్లాం ఉన్నారు. చిన్నగా ప్రారంభమైన రిజర్వేషన్ల ఉద్యమాన్ని.. చినికిచినికి గాలివానగా మార్చడంలో నహీద్ కీలక పాత్ర పోషించారు. 1998లో ఢాకాలో జన్మించిన నహీద్.. ఢాకా విశ్వవిద్యాలయంలో సోషియాలజీ చదువుతున్నారు. గత నెల పోలీసులు ఇతణ్ని అరెస్టు చేయడంతో పాపులర్ అయ్యారు. పోలీసులు అతణ్ని స్పృహ తప్పేలా కొట్టడం.. రోడ్డుపై పారేయడం వంటి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో.. అనతికాలంలోనే పాపులర్ అయ్యారు.

విద్యార్థుల డిమాండ్లివే!

- ప్రభుత్వ పదవీకాలాన్ని 6 సంవత్సరాలకు పెంచాలి. ప్రభుత్వ కాలపరిమితి ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించాలి
- ప్రస్తుత ఎన్నికల సంఘాన్ని రద్దు చేసి, కొత్త అధికారులను నియమించాలి. పక్షపాత ధోరణితో వ్యవహరించే ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులను తొలగించాలి
- హసీనా ప్రభుత్వం వివిధ శాఖల్లో నియమించిన కాంట్రాక్టు నియామకాలను రద్దు చేయాలి
- విద్యార్థుల త్యాగానికి గుర్తుగా.. జూలై నెలలో జాతీయ సంతాపదినంగా ప్రకటించాలి. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు పరిహారాన్ని చెల్లించాలి
- గడిచిన 15 ఏళ్లుగా దేశంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి, కారకులను శిక్షించాలి.


దినాజ్‌పూర్‌లో ఓ ఆలయానికి ముస్లింల కాపలా

హిందువుల ఆలయాలు, ఇళ్లపై దాడి

బంగ్లాదేశ్ వ్యాప్తంగా హిందూ ఆలయాలు, హిందువుల దుకాణాలు, ఇళ్లపై దాడులు, లూటీలు జరిగాయని బంగ్లాదేశ్ వార్తాసంస్థలు వెల్లడించాయి. హిందువులతోపాటు.. ముస్లిముల్లో అహ్మదీయ వర్గానికి చెందిన వారిని టార్గెట్‌గా చేసుకున్న ఆందోళనకారులు హత్యలు, లూటీలకు పాల్పడ్డట్లు పేర్కొన్నాయి. దినాజ్‌పూర్‌లోని బోచాగంజ్‌లో హిందువులకు చెందిన 40 దుకాణాలు ధ్వంసమయ్యాయి. అయితే.. ఇస్లామీ ఆందోళన్ కార్యకర్తలు, ముస్లిం పెద్దలు కూడా హిందూ ఆలయాలను కాపాడేందుకు కర్రలు పట్టుకుని, గస్తీ తిరిగారు. కాగా.. బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనారిటీలపై జరుగుతున్న హింసను ఐరోపా సమాఖ్య ఢాకా కార్యాలయం ఖండించింది. మైనారిటీల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఎక్స్‌లో కోరింది.

హసీనాకు ఆశ్రయానికి బ్రిటన్ నిరాకరణ

వలస నిబంధనలు అనుమతించవని వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు బ్రిటన్ నిరాకరించింది. ఒక వ్యక్తి ఆశ్రయం కోరుతూ లేదా శరణార్థిగా వచ్చేందుకు తమ వలస చట్టాలు అనుమతించవని బ్రిటన్ హోం శాఖ కార్యాలయం పేర్కొంది. సైన్యం అల్టిమేటంతో వెంటనే ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిన హసీనా.. ఉన్నపళంగా సైనిక విమానంలో భారత్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఆమె తన సోదరి షేక్ రెహానాతో కలిసి భారత్ నుంచి లండన్ వెళతారని, అక్కడ ఆశ్రయం కోరతారన్న ప్రచారం నేపథ్యంలో బ్రిటన్ నిరాకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. హసీనా సోదరి రెహానా బ్రిటన్ పౌరురాలు. ఆమె కుమార్తె తులిప్ సిద్దిఖీ ప్రస్తుతం లేబర్ పార్టీ తరఫున పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం అక్కడ లేబర్ పార్టీనే అధికారంలో ఉంది. ఈ క్రమంలోనే అక్కడ ఆశ్రయం పొందాలని హసీనా భావించారు. కాగా, బంగ్లాదేశ్ నుంచి హసీనాను భారత్ తీసుకొచ్చిన సైనిక విమానం సీ-130జే ఖాళీగా వెనక్కి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా, హసీనా వీసా యాక్సెస్‌ను మంగళవారం అమెరికా రద్దు చేసింది.

నాడు నేను, నేడు హసీనా



న్యూఢిల్లీ, ఆగస్టు 6: షేక్ హసీనా బంగ్లాదేశ్‌ను వీడడంపై ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నాడు బంగ్లాదేశ్ నుంచి తనని తరమేసిన ఇస్లామిక్‌వాదుల ఒత్తిడి వల్లే నేడు షేక్ హసీనా దేశాన్ని వీడారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇస్లామిక్‌వాదులు, అవినీతి, అక్రమాలను ప్రోత్సహించడం వల్లే హసీనాకు ఈ పరిస్థితి ఎదురైందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో మహిళల సమానత్వంపై తస్లీమా రాసిన లజ్జ అనే నవల 1990ల్లో తీవ్ర వివాదాస్పదమైంది. ఇస్లామికవాదుల ఒత్తిడుల నేపథ్యంలో తస్లీమా దేశ బహిష్కరణకు గురయ్యారు. బంగ్లాలో తాజా పరిణామాలపై తస్లీమా స్పందిస్తూ.. "హసీనా ప్రస్తుత పరిస్థితికి ఆమే బాధ్యురాలు. ఇస్లామిక్‌వాదులను, అవినీతి, అక్రమాలను ప్రోత్సహించింది ఆమే. బంగ్లాదేశ్ పాకిస్థాన్‌లా మారకూడదు. సైనిక పాలన ఉండకూడదు. రాజకీయ పార్టీలు దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని తీసుకురావాలి" అని పోస్ట్ చేశారు.

రాడార్ల నిఘాలో.. రాఫెల్‌ల రక్షణతో

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో సోమవారం అల్లకల్లోలం నేపథ్యంలో షేక్ హసీనా ఇండియాకు బయల్దేరారని తెలుసుకున్న భారత భద్రతా బలగాలు బంగ్లాదేశ్ గగనతలాన్ని అనుక్షణం పర్యవేక్షించాయి. అటు వైపు నుంచి వచ్చే విమానాలపై వాయుసేన రాడార్లు ప్రత్యేకంగా నిఘా పెట్టాయి. మధ్యాహ్నం 3గంటల సమయంలో బంగ్లాదేశ్ గగనతలం నుంచి విమానం భారత్‌వైపు రాగా.. వెంటనే అధికారులు ఆ విమానంలోని సిబ్బందితో సంప్రదింపులు జరిపారు. హసీనా విమానానికి రక్షణగా పశ్చిమ బెంగాల్‌లోని హాసీమరా వైమానిక స్థావరం నుంచి 101స్క్వాడ్రన్‌లోని రెండు రాఫెల్ యుద్ధవిమానాలు వెంట వచ్చాయి. హసీనా విమానం సాయంత్రం 5.45గంటల సమయంలో యూపీలోని హిండన్ ఎయిర్‌బేస్‌లో ల్యాండ్ అయింది.



బంగ్లాదేశ్‌లో 19 వేల మంది భారతీయులు

మంగళవారం బంగ్లాదేశ్ నుంచి తిరిగి వస్తున్న భారత ట్రక్కు డ్రైవర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: రాజకీయ సంక్షోభం నెలకొన్న బంగ్లాదేశ్‌లో మొత్తం 19 వేల మంది భారతీయులు ఉన్నారని, వీరిలో 9 వేల మంది విద్యార్థులేనని విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. ఆందోళనలు మొదలైన జూలైలోనే చాలామంది వచ్చేశారని చెప్పారు. పొరుగు దేశం సైన్యంతోపాటు మన రాయబార కార్యాలయాల ద్వారా వారితో సంప్రదింపుల్లో ఉన్నామని, వారికి భద్రతాపరంగా ఇబ్బందులు లేవని అన్నారు. మైనారిటీలకు చెందిన ఆలయాలు, వ్యాపార కేంద్రాలపై దాడులు జరుగుతున్నట్లుగా మాత్రం దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికిప్పుడు భారతీయులను తరలించేంతటి తీవ్ర స్థాయి పరిస్థితులు బంగ్లాదేశ్‌లో లేవని స్పష్టం చేశారు. అక్కడి యంత్రాంగం మన రాయబార కార్యాలయాలు, ప్రజలకు భద్రత కల్పిస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బంగ్లాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో జైశంకర్ మంగళవారం లోక్‌సభ, రాజ్యసభలలో ప్రకటన చేశారు. కేంద్ర హోం, రక్షణ శాఖ మంత్రులు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలు హాజరైన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడారు. పరిస్థితులను తాము నిరంతరం నిశితంగా గమనిస్తున్నామని, భద్రతా దళాలను అత్యంత అప్రమత్తం చేశామని వివరించారు. జనవరిలో ఎన్నికలు పూర్తయినప్పటి నుంచే బంగ్లా అశాంతి నెలకొందని, దీనిపై హెచ్చరికలు కూడా చేశామని తెలిపారు.

హసీనా నుంచి అత్యవసర సందేశం

బంగ్లా ప్రధాని హసీనా ప్రస్తుతం షాక్‌లో ఉన్నారని, కోలుకున్నాక ఆమెతో మాట్లాడతామ జైశంకర్ తెలిపారు. మానవతా దృక్పథంతోనే ఆమెకు ఆశ్రయం ఇచ్చామని, భవిష్యత్‌పై నిర్ణయానికి సమయం ఇద్దామన్నారు. తక్షణం భారత్‌కు వచ్చేందుకు అనుమతి ఇవ్వాలంటూ హసీనా నుంచి సంక్షిప్త సందేశం వచ్చిందని ఎంపీలకు వివరించారు. కర్ఫ్యూ ఉన్నప్పటికీ ఢాకాలో ఆందోళనకారులు సమావేశం కావడంతో పరిస్థితి తీవ్రత తెలిసిన ఆమె భద్రతాధికారులతో సమావేశమై రాజీనామా నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్నారు. హసీనా వినతితో బంగ్లా నుంచి విమానం రాకకు అనుమతి ఇచ్చామని తెలిపారు. దశాబ్దాలుగా బంగ్లాదేశ్‌తో మనకున్న సన్నిహిత సంబంధాలు, ప్రస్తుతం అక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు.

పాక్ పాత్రపై ఇప్పుడే చెప్పలేం..

హసీనాను దించేయడంలో పాక్ పాత్ర ఉందా? అంటూ అఖిలపక్ష సమావేశంలో రాహుల్ ప్రశ్నించారు. ఇప్పుడే దీనిపై ఏమీ చెప్పలేమని జైశంకర్ బదులిచ్చారు. బంగ్లాలోని పాక్ దౌత్తవేత్త ఒకరు ఆ దేశంలో జరుగుతున్న ఆందోళనలను సమర్థిస్తూ తన సోషల్ మీడియా ప్రొఫైల్ పిక్‌ను మార్చుకున్నట్లుగా సమాచారం ఉందన్నారు.

హసీనాతో మోదం.. ఖలీదాతో ఖేదం!

బంగ్లాదేశ్ మహిళా నేతలిద్దరూ చెరో రకం

» భారత్‌తో హసీనా సత్సంబంధాలు

» ఆమె నిష్క్రమణతో భారత్‌కు పలు సవాళ్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: షేక్ హసీనా, ఖలీదా జియా.. ఒకరు అవామీ లీగ్ అధినేత. మరొకరు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) చీఫ్. ఈ మహిళా నేతలిద్దరూ బంగ్లాదేశ్ రాజకీయాల్లో 30 ఏళ్లుగా కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరిలో హసీనా భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించగా.. ఖలీదా జియా మాత్రం భారత్‌ను వ్యతిరేకించారు. బంగ్లాదేశ్ ప్రధానిగా హసీనా భారత్‌తో దృఢమైన సంబంధాలు కొనసాగించారు. భారత్-బంగ్లా మధ్య అన్ని రంగాల్లో బంధాలు బలపడ్డాయి. 2008లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఎన్నికలు భారత్‌తో సంబంధాల్లో సరికొత్త అధ్యాయానికి నాంది పలికాయి. రెండేళ్ల పాటు సైనిక పాలన కొనసాగిన తర్వాత జరిగిన ఆ ఎన్నికల్లో హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ భారీ మెజారిటీతో విజయం సాధించింది. ఆమె ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్-బంగ్లాలు ప్రతి అంశంలో కలిసి పనిచేశాయి. ఇరుదేశాలను కలిపే పలు బస్సు, రైలు మార్గాల్లో రాకపోకలను ప్రారంభించారు. హసీనా గత ఏడాది భారత్‌లో పర్యటించిన తర్వాత ఇరుదేశాల మధ్య కనెక్టివిటీని మరింత మెరుగుపర్చుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విస్తృత కనెక్టివిటీతోనే ఈ ప్రాంతం మరింత వృద్ధి సాధిస్తుందని.. ఈ విషయమై తాను, ప్రధాని మోదీ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు హసీనా గతంలో తెలిపారు. అలాగే హసీనా హయాంలో కీలకమైన సరిహద్దు సమస్యలను పరిష్కరించుకున్నారు. ఉత్తర బెంగాల్‌లో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న వివాదానికి ముగింపు పలికారు. అలాగే దశాబ్దాల తరబడి నలుగుతున్న తీరప్రాంత సరిహద్దు సమస్యను 2014లో పరిష్కరించుకున్నారు. తీస్తా నదీ జలాల వాటా విషయంలో విభేదాల పరిష్కారం దిశగానూ పెద్ద ముందడుగు పడింది. బంగ్లాదేశ్‌లో 10 బిలియన్ డాలర్ల ప్రైవేటు పెట్టుబడులు పెట్టేందుకు భారత్ అంగీకరించింది. మౌలిక సదుపాయాలు, ఇతర ప్రాజెక్టులకు 7.5 బిలియన్ డాలర్లు కేటాయించింది. హసీనా ప్రధాని అయిన తర్వాత బంగ్లాదేశ్‌లో ఐఎస్ఐ గూఢచర్య కార్యకలాపాలను అణచివేసేందుకు చర్యలు చేపట్టారు. ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, అంతరిక్షం, అణు శక్తి తదితర రంగాల్లో ఇరుదేశాలు మరింతగా సహకరించుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ కూడా ప్రకటించారు.



నిశితంగా గమనిస్తున్న భారత్..

షేక్ హసీనాకు మద్దతుగా ఉన్నప్పటికీ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. అక్కడి ప్రజల మనోభావాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. తాజాగా జరుగుతున్న ఘర్షణల్లో కూడా ఆందోళనకారులు భారత్‌పై తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ రాజకీయ నిపుణుడొకరు పేర్కొన్నారు. హసీనాకు భారత్ సాయం చేస్తోందని ఆందోళనకారులు ఆగ్రహంతో ఉన్నట్లు చెబుతున్నారు. కాగా, బంగ్లాదేశ్‌లో ఎవరు అధికారంలో ఉన్నా దౌత్య సంబంధాలు కొనసాగిస్తామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ప్రకటించారు. ఇక బంగ్లాదేశ్‌లో నెలకొన్న సంక్షోభం, హసీనా ప్రభుత్వం పతనం నేపథ్యంలో అక్కడి మైనారిటీలు మరోసారి ప్రమాదంలో పడతారన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.


గతేడాది సెప్టెంబరులో భారత పర్యటనకు వచ్చిన హసీనాతో ప్రధాని మోదీ

భారత వ్యతిరేక జియా..

బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానిగా ఖలీదా జియా రికార్డులకెక్కారు. జియా నేతృత్వంలోని బీఎన్‌పీ భారత్‌కు వ్యతిరేకం. ఆమె ప్రభుత్వం కూడా భారత వ్యతిరేక కార్యకలాపాలకు మద్దతు ఇచ్చేది. భారత వ్యతిరేకతను ఆమె తమ పార్టీ ఎన్నికల ప్రచారాస్త్రంగానూ వాడుకున్నారు. భారత్ తమ దేశ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకుంటోందని విస్తృత ప్రచారం చేశారు. 2001-06 మధ్య జమాతే ఇస్లామీ వంటి ఉగ్ర సంస్థకు కూడా బీఎన్‌పీ మద్దతిచ్చింది. బంగ్లాదేశ్ నుంచి కార్యకలాపాలు కొనసాగించే ఉల్ఫా వంటి అనేక తీవ్రవాద సంస్థలు ఈశాన్య భారతంలో రెచ్చిపోయాయి. అయితే, 2012లో ప్రధాని జియా భారత పర్యటనకు వచ్చారు. అధికారం కోల్పోయిన తర్వాత జియా అవినీతి కేసుల్లో ఆమెకు పదేళ్ల జైలు శిక్ష పడింది. ఆమె మళ్లీ అధికారంలోకి వస్తే భారత్‌కు భద్రతాపరంగా సవాళ్లు ఎదురవనున్నాయి.

బంగ్లా కల్లోలం వెనుక విదేశీ హస్తం!

ఇది అమెరికా కుట్ర అని కొందరి విశ్లేషణ



» ఖలీదా జియా కుమారుడు పాకిస్థాన్‌తో కలిసి పన్నిన వ్యూహమని మరో వాదన

ఢాకా, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ఏర్పడ్డ కల్లోల పరిస్థితుల వెనుక విదేశీ హస్తం ఉందని ఆ దేశ నిఘా వర్గాల సమాచారం! అయితే.. ఎవరి కుట్ర అనే విషయంలో భిన్నాభిప్రాయాలు వినపడుతున్నాయి. ఇది అమెరికా కుట్ర అని కొందరు రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతుండగా.. మొన్నటిదాకా జైల్లో ఉన్న ప్రతిపక్ష బీఎన్‌పీ నేత ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ పాకిస్థానీ గూఢచార సంస్థ ఐఎస్ఐతో కలసి లండన్‌లో పన్నిన వ్యూహమని, దీనికి చైనా మద్దతు కూడా ఉందని బంగ్లాదేశ్ అధికారులు కొందరు చెబుతున్నారు. తారిఖ్ అన్వర్, ఐఎస్ఐ ప్రతినిధుల మధ్య సౌదీ అరేబియాలో పలుమార్లు సమావేశాలు కూడా జరిగాయడానికి తమ వద్ద ఆధారాలున్నట్టు వారు స్పష్టం చేస్తున్నారు. భారత వ్యతిరేక జమాతే ఇస్లామీ పార్టీ విద్యార్థి విభాగమైన ఇస్లామీ ఛాత్ర శిబిర్ (ఐసీఎస్).. ఆందోళనలకు ఆజ్యం పోసిందని, ఇందుకు అవసరమైన సొమ్మును పాకిస్థాన్‌లో ఉన్న చైనా సంస్థల నుంచే ఐసీఎస్‌కు అందిందని ఆరోపణలున్నాయి. భారత్‌కు అనుకూలంగా ఉండే హసీనా ప్రభుత్వాన్ని కూలదోసి.. తమకు అనుకూలంగా ఉండే బీఎన్‌పీని అధికారంలోకి తెచ్చుకునేందుకే పాక్ ఐఎస్ఐ ఈ సాయం చేసిందనే వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది మే 23న షేక్ హసీనా చేసిన వ్యాఖ్యలు ఈ కుట్ర వెనుక అమెరికా హస్తం ఉందన్న వాదనకు ఊతమిచ్చేదిగా ఉందని పలువురు రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అప్పట్లో అవామీ లీగ్ నేతృత్వంలోని 14 పార్టీల కూటమి సమావేశంలో పాల్గొని ప్రసంగించిన ఆమె ఒక సంచలన విషయాన్ని బయటపెట్టారు. ఇండోనేషియా భూభాగంలోని కొంత భాగాన్ని విడదీసి 'ఈస్ట్ తైమూర్' అనే క్రైస్తవదేశాన్ని ఏర్పాటు చేసినట్టుగా.. బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుంచి కొంత భూభాగం తీసుకుని అక్కడ ఒక క్రైస్తవ దేశాన్ని ఏర్పాటు చేయడానికి విదేశీ కుట్ర జరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. జనవరి 7న జరిగిన ఎన్నికలకు ముందురోజు.. ఒక శ్వేతజాతి వ్యక్తి (వైట్‌మ్యాన్) తనను కలిశారని.. బంగ్లాదేశ్‌లో తమ దేశ వైమానిక స్థావరం ఏర్పాటుకు అనుమతిస్తే ఎన్నికలు సజావుగా జరిగేందుకు, అవామీలీగ్ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చేందుకు సహకరిస్తామని తనకు ఆఫర్ ఇచ్చారని హసీనా వివరించారు. "బంగ్లాదేశ్‌లో ఎయిర్‌బేస్ నిర్మాణానికి ఆ దేశానికి తాను అనుమతి ఇచ్చి ఉంటే నాకు ఏ సమస్యా ఉండేది కాదు" అని వ్యాఖ్యానించారు.

ఏ భూభాగాలంటే..

ఆనాడు తనకు ఆ ఆఫర్ ఇచ్చిన వ్యక్తి ఏ దేశానికి చెందిన వారో.. ఆ దేశం తీసుకోబోయే భూభాగాలు ఏవో ఆమె వెల్లడించలేదు. కానీ.. అవామీలీగ్ నేత, మాజీ స్క్వాడ్రన్ లీడర్ సద్రుల్ అహ్మద్ ఖాన్ అనంతరకాలంలో 'సండే గార్డియన్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ ప్రాంతాల వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్‌లో క్రైస్తవులు ఎక్కువగా ఉండే కుకి చిన్, బంగ్లాదేశ్‌లో చిట్టోగ్రామ్ కొండ ప్రాంతాలను (ఇవి మిజోరామ్ రాష్ట్రాన్ని ఆనుకుని ఉంటాయి) కలిపి ఒక క్రైస్తవ దేశంగా ఏర్పాటుచేసే కుట్ర జరిగిందని ఆయన వివరించారు. మయన్మార్ ద్వారా దక్షిణాసియా ప్రాంతంలో పట్టు సాధించడానికి అమెరికా చాలాకాలంగా ప్రయత్నిస్తోందని ఆయన గుర్తుచేశారు. "ఎన్నికలకు కేవలం 2 నెలల ముందు.. 2023, అక్టోబరు 28న బైడెన్‌కు సలహాదారుగా చెప్పుకొంటూ మియాన్ అరాఫీ అనే వ్యక్తి(అమెరికన్) హసీనాను ఇబ్బంది పెట్టడానికి ఢాకాలో 'బీఎన్‌పీ' కార్యాలయానికి వచ్చాడు. అంతకుముందు ఢాకాలోని అమెరికన్ క్లబ్‌లో పలువురు 'కీలక' వ్యక్తులతో చర్చలు జరిపాడు" అని అహ్మద్‌ఖాన్ ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

లోకం తీరు





వివరాలు వెల్లడిస్తున్న ఆసుపత్రి డైరెక్టర్ రామారావు (కుడి వైపు నుంచి మూడో వ్యక్తి). చిత్రంలో వైద్యులు, శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారులు

విశాఖ ఆంధ్ర హాస్పిటల్స్‌లో

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు

- రెండు, మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపులు
- ఆసుపత్రి డైరెక్టర్ పీవీ రామారావు

విశాఖపట్నం (మహారాణిపేట), ఆగస్టు 6: విశాఖపట్నంలోని ఆంధ్ర హాస్పిటల్‌లో చిన్నపిల్లలకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ పి.వి. రామారావు తెలిపారు. కలెక్టరేట్ జంక్షన్‌లోని ఆసుపత్రిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హీలింగ్ లిటిల్ హార్ట్స్-యూకే చారిటీ సంస్థ సహకారంతో విశాఖలో ఈ నెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు ఉచిత గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణుడు రేవంత్, డాక్టర్ విక్రమ్‌తో పాటు ఆంధ్ర హాస్పిటల్ కార్డియాలజీ విభాగం, బ్రిటన్ నుంచి విచ్చేసిన ప్రముఖ కార్డియాలజీ నిపుణుల బృందం తొలిరోజు ఏడుగురు చిన్నారులకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇటువంటి శస్త్ర చికిత్సలు ప్రతి నెలా సుమారు 60 వరకు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటివరకూ 30 మెడికల్ క్యాంపులు నిర్వహించి, నాలుగు వేల మంది పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు చేసినట్టు ఆయన వివరించారు. తొలిసారిగా విశాఖలో ఉచిత క్యాంపును ప్రారంభించినట్టు రామారావు తెలిపారు. రానున్న రోజుల్లో రెండు, మూడు నెలలకొకసారి క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. గుండెజబ్బులు ఎదుర్కొంటున్న పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు విక్రమ్, డాక్టర్లు రేవంత్, సుబ్రహ్మణ్యం, రమేష్, రవీంద్రదేవ్, మురళీకృష్ణ, చికిత్స పొందిన చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగ శాస్త్రాలపై ఈశా ఫౌండేషన్ 'ఇన్నర్ ఇంజనీరింగ్'

- 14 నుంచి అనంత, తిరుపతి, నెల్లూరు, రాజమహేంద్రవరంలో కార్యక్రమాలు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాచీన యోగ శాస్త్రాల విశిష్టతను తెలిపే 'ఇన్నర్ ఇంజనీరింగ్' కార్యక్రమాన్ని తెలుగులో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని అనంతపురం, తిరుపతి, నెల్లూరు, రాజమహేంద్రవరం నగరాల్లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం పట్ల ఆసక్తి ఉన్నవారు isha.co/ietelugu వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి మరింత సమాచారాన్ని తెలుసుకుని, తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. సందేహాలకు 040-41896666 ఫోన్‌నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

కన్నీటి కలబోత.. చేనేత!

తరతరాలుగా నమ్ముకున్న వృత్తి నేతన్నలను పస్తులు పెడుతోంది. బతుకు భారమైన నేత కార్మికులు అపురూపమైన కళను వదిలి వ్యవసాయ కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా మారిపోతున్నారు. దేశంలోనే అతిపెద్ద చేనేత పరిశ్రమగా గుర్తింపు పొందిన రాష్ట్రంలో... నేతన్నలు ఎన్నడూ లేనంత దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ పాలకుల నిర్వాకంతో పాడైన మగ్గాల మాటున కన్నీటితో, అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారు.



నేడు చేనేత దినోత్సవం..

- నేతన్నల వెతలు పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- 4.5 లక్షల మందిలో 81 వేల మందికే 'నేతన్న నేస్తం'
- ఆప్కోను ప్రక్షాళన చేస్తామన్న హామీకి జగన్ నీళ్లు
- చంద్రబాబు చేయూత కోసం నేతన్నల నిరీక్షణ

అమరావతి-ఆంధ్రజ్యోతి)

తెలుగు జాతి ఔన్నత్యానికి ధర్మవరం, మదనపల్లె, శ్రీకాళహస్తి, వెంకటగిరి, ఎమ్మిగనూరు, చీరాల, ఉప్పాడ, మంగళగిరి, పెడన, రాజమండ్రి, పొందూరు చేనేత వస్త్రాలు ప్రతీకలుగా నిలిచాయి. అలాంటి కళాకారుల్ని గౌరవిస్తూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అధికారంలోకి రాగానే చేనేత వస్త్రాలు స్వయంగా ధరించడంతో పాటు ఆ రంగానికి జవజీవాలు నింపారు. ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం వీరికోసం పలు సంక్షేమ పథకాలు కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ శాఖల అవసరాలకు ఆప్కో ద్వారా నేత వస్త్రాలు తప్పనిసరి గా కొనుగోలు చేయాలంటూ ఉమ్మడి రాష్ట్రంలో జీవో 24, విభజిత రాష్ట్రంలో జీవో 142 విడుదల చేసింది. మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ఆప్కోను బలోపేతం చేసి రిబేటు అమలు చేసింది. ప్రభుత్వ లెక్కల (సోషియో ఆడిట్-2023) ప్రకారం రాష్ట్రంలోని 1,282 చేనేత సహకార సంఘాల్లో కార్మికుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంది. ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన జగన్ అవన్నీ రద్దు చేసేశారు. కమీషన్లు ఇచ్చే ప్రైవేటు వస్త్ర వ్యాపారులకే గత వైసీపీ పాలకులు ఆర్డర్లు ఇచ్చారు. 2 లక్షలకు పైగా మగ్గాలున్న రాష్ట్రంలో 4.5 లక్షల మంది చేనేత అనుబంధ రంగాల్లో పనిచేస్తుంటే కేవలం 81వేల మందికే 'నేతన్న నేస్తం' వర్తింపజేసి సరిపెట్టారు. అందులోనూ అసలైన కార్మికులు 50 వేల మంది ఉంటే మిగతా వారంతా వైసీపీ కార్యకర్తలే.

సహకార సంఘాలు నిర్వీర్యం

'చేనేత కార్మికుల్లో నైపుణ్యాలు పెంచాలి. అధునాతన డిజైన్లు ఉత్పత్తి చేయాలి. మన చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి. అవసరమైన ప్రోత్సాహకాలు ప్రభుత్వం ఇస్తుంది. ముడిసరుకుతో పాటు వస్త్రంపైనా రాయితీ ఇద్దాం' అంటూ రాష్ట్ర విభజన తర్వాత సీఎం అయిన చంద్రబాబు 2019 వరకూ అమలు చేశారు. 'చేనేతను బలోపేతం చేస్తా.. ఆప్కోను ప్రక్షాళన చేస్తా'నంటూ అధికారంలోకి వచ్చిన జగన్.. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జగన్ బొమ్మ వేసి ఇచ్చిన యూనిఫాం కోసం అవసరమైన వస్త్రాన్ని పొరుగు రాష్ట్రాలకు చెందిన మరమగ్గాల నుంచి, తాడేపల్లి పెద్దల సిఫారసు ఉన్న సొసైటీల నుంచే కొనుగోలు చేశారు. నిజమైన నేత కార్మికులు తమ వస్త్రాన్ని సొసైటీకి ఇచ్చి అమ్మకాల్లేక అల్లాడిపోతున్నారు. 'మీ సొసైటీలో కార్మికుల్లో టీడీపీకి చెందినవాళ్లే ఎక్కువ అందుకే ఆర్డర్ ఇవ్వొద్దన్నా'రంటూ ఆప్కో అధికారులు నిలిపేశారు. వైసీపీ సర్కారు తీరుతో కృష్ణాజిల్లా పెడనలో వేలాది మంది వృత్తి వదిలేసి కూలీ పనులకు వెళ్తున్నారు. రాష్ట్రంలో నూలు డిపోలు ఎన్ని ఉన్నా నేత కార్మికుడికి మాత్రం ముడిసరుకు ఇవ్వకుండా గత ఐదేళ్ల పాటు పాలకులు తీరని అన్యాయం చేశారు. సరుకు ఇచ్చినట్లు లెక్కల్లో చూపుతున్న చేనేత జౌళిశాఖ ఉన్నతాధికారులను ఆ వివరాలు అడిగితే ముఖం చాటేస్తున్నారు. సొసైటీల పేరుతో బిల్లులు సృష్టించి సబ్సిడీ మింగేసిన గుట్టు రట్టవుతుందని వివరాలిచ్చేందుకు ససేమిరా అంటున్నారు. సబ్సిడీ నూలు అందజేసి తమకు పని కల్పించాలని చేనేత కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకొంటుంటే.. తమకు మార్కెటింగ్ ప్రమోషన్ కల్పించాలని చేనేత సహకార సంఘాలు, ఆప్కో విజ్ఞప్తి చేస్తున్నాయి. చేనేత వస్త్రంపై జీఎస్టీ విధించడం, చేనేత రిజర్వేషన్ డిజైన్లు(11) పవర్ లూమ్స్‌లో ఉత్పత్తి చేస్తుండటం, అధునాతన డిజైన్లు-ముడిసరుకు కోసం బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం వంటివి చేనేత రంగం కుదేలవడానికి ప్రధాన కారణాలు.

మన చేనేత పొట్టగొట్టి..

రాష్ట్రంలో 896 కాటన్, 325 పట్టు, 61 ఉల్లన్ సహకార సంఘాలున్నాయి. వాటి ద్వారా ఉపాధి పొందే లక్షల మంది నేతన్నలను ఆదుకోవడానికి గత ప్రభుత్వాలు నూలు, పట్టు, ఇతర ముడిసరుకు రాయితీపై సరఫరా చేసేవి. ఈ సంఘాల నుంచి ప్రభుత్వానికి అవసరమైన వస్త్రాన్ని కొనుగోలు చేసి చేనేతలకు ఊతమిచ్చేవి. అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కోసం చంద్రబాబు ప్రభుత్వం గట్టిగా శ్రమించింది. గత వైసీపీ ప్రభుత్వం మాత్రం పాఠశాల విద్యార్థుల యూనిఫాం కోసం కోట్లాది మీటర్ల వస్త్రం అవసరం కాగా రాష్ట్రంలోని ఒక్క చేనేత సంఘానికి లేదా కార్మికుడికి నూలు ఇచ్చిన పాపాన పోలేదు. అయితే విద్యార్థుల యూనిఫాంకు వస్త్రాన్ని మన చేనేతల నుంచే కొనుగోలు చేయాలని ఆదేశించినట్లు ఎన్నికల ప్రచారంలో జగన్ అబద్ధం చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై విస్మయం చెందిన చేనేత సంఘాల నేతలు ఆరా తీస్తే... కేవలం కమీషన్ల కోసం పొరుగు రాష్ట్రాల నుంచి వస్త్రాలు కొన్నట్లు వెల్లడైంది.

చీరాలలో నేతన్నతో మాట్లాడుతున్న మంత్రి సవిత

నేతన్నకు నేనున్నానని..!

- నేడు చీరాలకు చంద్రబాబు
- నేతన్నల కుటుంబాల స్థితిగతుల పరిశీలన, బహిరంగ సభ

బాపట్ల(ఆంధ్రజ్యోతి)/చీరాల, ఆగస్టు 6: వైసీపీ పాలనతో ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన చేనేత రంగానికి పూర్వ వైభవం కల్పించే దిశగా సీఎం చంద్రబాబు కార్యాచరణకు దిగనున్నారు. దీనిలో భాగంగా బుధవారం చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లా చీరాలకు రానున్నారు. క్షేత్రస్థాయిలో చేనేత కుటుంబాల ఆర్థిక స్థితిగతులను పరిశీలించి గత ఐదేళ్లలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చీరాల సభలో ప్రకటన చేస్తారని సమాచారం. జాండ్రపేట గ్రామంలోని కుటుంబాలతో చంద్రబాబు స్వయంగా మాట్లాడనున్నారు. జీఎస్టీ భారంపై ఉపశమనం కల్పించేలా సీఎం వరాల జల్లు కురిపిస్తారని నేతన్నలు ఆశతో ఉన్నారు. కాగా, సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించడానికి చేనేత జౌళిశాఖ మంత్రి సవిత మంగళవారం చీరాలకు వచ్చారు. జాండ్రపేటలో సీఎం సందర్శించే చేనేత కార్మికుల గృహాలను పరిశీలించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేటపాలెం పరిధిలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా చెట్లు నరకడం, స్తంభాలు తొలగించడం వంటివి చేయవద్దని కలెక్టర్ మురళి అధికారులను ఆదేశించారు.

సీఎం చంద్రబాబు పర్యటన ఇలా....

వేటపాలెం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు బుధవారం మధ్యాహ్నం 3:35 గంటలకు సీఎం చంద్రబాబు చేరుకుంటారు. అనంతరం జాండ్రపేటలోని హైస్కూల్ కు చేరుకొని చేనేత దినోత్సవంలో పాల్గొననున్నారు. తొలుత నేత కార్మికుల ఇళ్ల సందర్శనతో పాటు చేనేత స్టాళ్లను తిలకించనున్నారు. నేతన్నలతో ముఖాముఖిలో పాల్గొని, సభలో మాట్లాడతారు. సాయంత్రం 5:40కి తిరుగు ప్రయాణమవుతారు.

చేనేతకు ఆధునికీకరణ జోడించాలి: సీఎం

'చేనేత వస్త్రాలకు మళ్లీ ఆదరణ పెరుగుతోంది. నేతలో ఆధునీకరణ జోడిస్తే ఆ వర్గాల ఎదుగుదలకు అవకాశం ఉంటుంది.. జిల్లాల కలెక్టర్లు ఆ దిశగా ఆలోచించాలి' అని జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవించేవారికి ముడిసరుకు అందించడంతో పాటు ఉత్పత్తుల నాణ్యత, డిజైన్లు ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా ఉండేలా చూడాలని సూచించారు. చేనేత అభివృద్ధిపై దృష్టి సారించాలని, కార్మికుల జీవనోపాధికి ప్రభుత్వం నుంచి భరోసా దక్కాలన్నారు. ఈ నెల 7న కలెక్టర్లందరూ జాతీయ చేనేత దినోత్సవాన్ని జరిపించి జిల్లాలోని ఉద్యోగులు వారానికి ఒక రోజైనా చేనేత వస్త్రాలు ధరించేలా చూడాలని ఆదేశించారు.



ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న హైకోర్టు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

చంద్రబాబును కలిసిన హైకోర్టు ఉద్యోగుల సంఘం

- సమస్యలపై వినతిపత్రం అందజేత

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కిన వేణుగోపాలరావు నేతృత్వంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యులు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం అందజేశారు. వేతన సవరణ కమిటీ(పీఆర్‌సీ)ని ఏర్పాటు చేసి, ఆరునెలల్లో కొత్త పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, హైకోర్టు విజ్ఞప్తికి అనుగుణంగా అదనపు ఉద్యోగాలు మంజూరు చేయాలని కోరారు. సీఎంను కలిసినవారిలో హైకోర్టు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు కె.సురేంద్రనాథ్, కార్యదర్శి ఎం.ఎలీషా, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.చంద్రబాబు, సంయుక్త కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు రేష్మ, రాంబాబు, సూర్యారావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాకినాడ జిల్లాలో జగన్‌కు బిగ్‌షాక్



- నేడు వైసీపీని వీడనున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే
- దొరబాబు బాటలో పలువురు ముఖ్య నేతలు

పిఠాపురం, ఆగస్టు 6: కాకినాడ జిల్లాలో జగన్‌కు బిగ్‌షాక్ తగిలింది. వైసీపీ సీనియర్ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. ఆయనతో పాటు పలువురు ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు పార్టీని వీడతారని సమాచారం. ఇప్పటికే పార్టీ నాయకులు, కార్యకర్తలకు దొరబాబు ఆ మేరకు సంకేతాలు ఇచ్చారు. బీజేపీ నుంచి 2004లో, వైసీపీ నుంచి 2019లో పిఠాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన దొరబాబు వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకపాత్ర పోషించారు. 2024 ఎన్నికల్లో నాడు ఎంపీగా ఉన్న వంగా గీతావిశ్వనాథ్‌కు ఎమ్మెల్యే టికెట్ కేటాయించిన జగన్... దొరబాబుకు మొండిచేయి చూపించారు. జగన్ తీరుతో పార్టీకి రాజీనామా చేయాలని దొరబాబు భావించారు. దీంతో జగన్ స్వయంగా దొరబాబును బుజ్జగించి కాకినాడ జిల్లా వైసీపీ అధ్యక్ష పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. అయితే అది నెరవేరలేదు. అప్పటి నుంచి దొరబాబు పార్టీతో అంటీముంటనట్లుగానే వ్యవహరించారు. వైసీపీకి రాజీనామా చేయనున్న దొరబాబు జనసేనలోకి చేరతారని విస్తృతంగా ప్రచారం సాగుతోంది.

జనసేనలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు వైసీపీ కార్పొరేటర్లు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవో సవరించకుండా సర్దుబాటా?

- ముందు జీవో 117పై నిర్ణయం తీసుకోవాలి
- టీచర్ల సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాలు

గత ప్రభుత్వంలో వివాదంగా మారిన జీవో 117ను రద్దు లేదా సవరణ చేయకుండా ఉపాధ్యాయులను ఎలా సర్దుబాటు చేస్తారని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. జీవో 117ను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, హామీ ప్రకారం ఆ జీవోను రద్దు చేశాక సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి అవసరమైన చోటుకు టీచర్లను సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించడంతో ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పని సర్దుబాటు పేరుతో పది మంది లోపు విద్యార్థులు ఉన్న బడులను మూసేయాలని ఆలోచన చేయడం తగదని, వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో 117ను రద్దుచేయాలన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అస్తవ్యస్త విధానాలను సవరించకుండా టీచర్లను సర్దుబాటు చేయడం సరికాదని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి అన్నారు. జీవో 117ను రద్దుచేయాలని, టీచర్లకు పీరియడ్లు తగ్గించాలని పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. జీవో 117ను రద్దుచేసి ప్రత్యామ్నాయంగా మరో జీవో తేవాలని ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు కోరారు.

మరుగుదొడ్ల ఫొటోల నుంచి విముక్తిపై హర్షం

బడుల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే పని నుంచి విముక్తి కలిగించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. టీచర్ల బాధ అర్థంచేసుకుని ఆ బాధ్యతను తప్పించినందుకు మంత్రి లోకేశ్‌కు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వరు కృతజ్ఞతలు తెలిపారు. టాయిలెట్ల ఫొటోలు తీసే బాధ తప్పించడం హర్షణీయమని ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశరావు అన్నారు.

30న విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 13న నామినేషన్ల స్వీకరణకు తుది గడువుగా పేర్కొంది. 14న నామినేషన్ల పరిశీలన, 16 నామినేషన్ల ఉప సంహరణకు తుది గడువుగా ఈసీ పేర్కొంది. ఈ నెల 30న పోలింగ్ ప్రక్రియ ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.



టీడీపీ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న హోంమంత్రి అనిత, మండలి మాజీ చైర్మన్ షరీఫ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

భూ కబ్జాలు.. అక్రమ కేసులు.. వేధింపులు

- వైసీపీ నేతల అరాచకాలకు అంతే లేదు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు
- వినతులు స్వీకరించిన హోంమంత్రి, టీడీపీ నేతలు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రధాన కార్యాలయంలో హోంమంత్రి నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంగళవారం ప్రధానంగా వైసీపీ నేతల అరాచకాలపైనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏ రకంగా వేధించారో బాధితులు వివరించారు. హోంమంత్రితోపాటు శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గ్రీవెన్స్ స్వీకరించారు. టీడీపీ అభిమాని కావడంతో పార్టీ ప్రచార కార్యక్రమాలకు శ్రేణులను తీసుకెళ్లినందుకు తన తండ్రిని అతి కిరాతకంగా చంపి... తనను అక్రమ కేసుల్లో ఇరికించి రెండు నెలలు జైల్లో ఉంచారని కోనసీమ జిల్లా రాయవరం మండలానికి చెందిన సునా ఫాతిమా హోంమంత్రి వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఫాతిమా మాట్లాడుతూ తన భర్త విదేశాలకు వెళ్లాడని... తనకు దిక్కెవరూ లేరని.. తోట త్రిమూర్తులు, ఆయన అనుచరుడు కోరుకొండ రమణకు భయపడి హైదరాబాద్‌లో తలదాచుకుంటున్నామని తెలిపారు. తమ తండ్రిని చంపిన వారిని శిక్షించి తనపై మోపిన అక్రమ కేసులను తొలగించాలని కోరారు. కడప జిల్లా వేముల మండలం నల్లచెరువుపల్లెకు చెందిన రామన్న వినతిపత్రం ఇస్తూ... వైసీపీ నేత రవికుమార్‌రెడ్డి తన భూమిని ఆక్రమించుకుని తనను భూమిలోకి రానివ్వడం లేదని ఫిర్యాదు చేశారు. నంద్యాల మండలం కానకాలలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డి అనుచరులు తమ భూమిని ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని అల్లూరు షబానా వాపోయారు. తాను టీడీపీ కోసం పనిచేస్తుండటంతో వైసీపీ నాయకుడు తలారి చరణ్ తనపై అక్రమ కేసులు పెట్టాడని, సోషల్ మీడియాలో నిరాధారమైన పోస్టులతో వేధిస్తున్నాడని ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాలకి చెందిన రేవూరి అబ్రహం ఫిర్యాదు చేశారు. టీడీపీకి ఓట్లు వేయించినందుకు రాత్రికి రాత్రే తన భూమిలో వైసీపీ నేతలు ఇళ్లు కట్టారని.. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో తొలగించిన ఇళ్లు, మళ్లీ కట్టి తనను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని మోటుమాలకు చెందిన పురిణీ వెంకటేశ్వర్లు వాపోయారు. పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అనుచరులు తమ భూమిని ఆక్రమించుకున్నారని.. వీధి రౌడీలతో దాడి చేయించారని, దీనిపై ముదివేడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన నల్లతాతగారి వెంకటరమణారెడ్డి ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకుల అండతో తమ ఆస్తులు కొట్టేయాలని తమ సోదరులే ప్రయత్నిస్తున్నారని నంద్యాల జిల్లాకు చెందిన ఆవుల నాగమణి, ఆవుల భారతి, ఆవుల నాగేశ్వరి ఫిర్యాదు చేశారు. అక్రమ కేసులపై మరికొందరు ఫిర్యాదు చేయగా, భూసరిహద్దు తగాదాలపై కొందరు, చోరీ సొమ్ము రికవరీ చేయాలంటూ మరికొందరు, చేసిన పనులకు బిల్లులు రాలేదని పలువురు, వైసీపీ పాలనలో బాధితులైన ఉద్యోగులు వందల సంఖ్యలో అర్జీదారులు ఫిర్యాదులు చేశారు.

దళారీలను సంప్రదించొద్దు: టీటీడీ

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లను బుక్ చేసుకునేందుకు దళారీలను సంప్రదించవద్దని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేసింది. 'ఇటీవల 545 మంది యూజర్ల ద్వారా 14,449 అనుమానిత లావాదేవీలు జరిగినట్టు గుర్తించాం. అటువంటి వాటిని బ్లాక్ చేసి వారికి మెసేజ్ పంపాం. యాత్రికులు దళారీల వద్దకు వెళ్లొద్దు. ఆన్‌లైన్ ద్వారా లేదా కరెంట్ బుకింగ్ ద్వారా దర్శనం టికెట్లను బుక్ చేసుకోవాలని కోరుతున్నాం. అవకతవకలకు పాల్పడే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది.





జారిపడుతున్న భక్తుడు



పడిపోయిన వృద్ధుడు

శ్రీవారి భక్తులకు ఎంతకష్టం...ఎంతకష్టం!

- వర్షానికి పొంగిపొర్లిన డ్రెయినేజీలు
- ఆలయం ముందు నెయ్యితో కూడిన మురుగు
- జారిపడి పలువురికి గాయాలు

తిరుమలలో శ్రీవారి భక్తులకు అనుకోని కష్టం ఎదురైంది. ఆలయం ముందు మంగళవారం రాత్రి పలువురు భక్తులు జారిపడి గాయాలపాలయ్యారు. రాత్రి 10గంటల నుంచి గంటన్నర సేపు కొండపై భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో డ్రెయినేజీలు సైతం పొంగి పొర్లాయి. లడ్డూ బూందీ తయారీ కేంద్రం నుంచి ప్రవహించే ఓ కాలువ నుంచి నెయ్యితో కూడిన మురుగు పొంగి ఆలయం, పుష్కరిణి మార్గంలో కొంతమేర ప్రవహించింది. శ్రీవారి దర్శనం ముగించుకుని, లడ్డూ ప్రసాదం తీసుకుని వస్తున్న భక్తులు ఈ మురుగుపై కాలు వేయడంతో జారిపడిపోయారు. అలా అరగంట వ్యవధిలో దాదాపు 11 మంది భక్తులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న భద్రతా సిబ్బంది ఈ మార్గం గుండా నడవకుండా వర్షం తగ్గేవరకు చుట్టూ రోప్‌లను ఏర్పాటు చేశారు.

-ఆంధ్రజ్యోతి, తిరుమల



చంటిబిడ్డతో తల్లి కష్టం..

దేవదాయశాఖ డీసీ విజయరాజుపై వేటు!

ఏబీసీ కేసులో ఇరుక్కుని, దాని నుంచి బయటపడేందుకు నాడు వైసీపీకి ఊడిగం

- విజయరాజు ప్రాసిక్యూషన్‌కు రంగం సిద్ధం
- చర్యలు కోరుతూ ఏసీబీ డీజీకి దేవదాయశాఖ కమిషనర్ లేఖ
- విశాఖ భూముల ధారాదత్తం వ్యవహారంలో ఏసీ శాంతితో కలిసి కీలకపాత్ర

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

వైసీపీ నేతలతో అంటకాగి దేవదాయశాఖ భూములను అన్యాక్రాంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన అధికారులపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజును ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రాసిక్యూట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏసీబీ డీజీని కోరుతూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ లేఖ రాశారు. విజయరాజు దేవదాయశాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేస్తున్న సమయంలో 2017 డిసెంబరులో ఏసీబీ దాడులు జరిగాయి. అప్పట్లో రూ.1.68 కోట్లు ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించారు. అప్పటి నుంచి ఈ కేసు పెండింగ్‌లో ఉంది. కేసు తేలకుండానే విజయరాజును ఫోకల్ పోస్టులో నియమించడం, డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పించడం కూడా జరిగిపోయింది. వైసీపీ నేతల ఆశీస్సులే దీనికి కారణంగా చెబుతారు. ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల డీసీ పదవితోపాటు అత్యంత కీలకమైన ఉత్తరాంధ్ర మొదలుకొని కృష్ణా జిల్లా వరకు ఆరు జిల్లాల ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ బాధ్యతలను కూడా ఈయనే చూసేవారు. విశాఖలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి భూదందాలకు అప్పటి ఏసీ శాంతితోపాటు ఈయన కూడా పూర్తిస్థాయిలో సహకారం అందించారన్న ఆరోపణలు ఉన్నాయి. విజయరాజుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు పెండింగ్‌లో ఉన్నందున డీసీగా బడ్జెట్ శాంక్షన్స్‌తోపాటు ఆర్థిక లావాదేవీలు ఏవీ ఆయన జరపకూడదని అప్పట్లో నియామక ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ ఇప్పటికీ ఆయనే నేరుగా బడ్జెట్ శాంక్షన్లు ఇస్తున్నారు. ఆర్థిక లావాదేవీలన్నీ ఆయనే నిర్వహిస్తున్నారు.

టీడీపీ నాయకులపై అక్కసు..

తన మీద ఉన్న అభియోగాలను తొలగించాలని విజయరాజు అప్పటి సీఎం జగన్ పొలిటికల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌కు 2021 మేలో లేఖ రాశారు. 2019కు ముందు ఉన్న టీడీపీ ప్రభుత్వంలోని నాయకులు తనను నిబంధనలకు విరుద్ధంగా పనిచేయమన్నారని, తాను చేయకపోవడం వల్ల ఏసీబీ ద్వారా తనపై తప్పుడు అభియోగాలు మోపారంటూ టీడీపీ నాయకులపైనే ఆక్రోశం వెళ్లగక్కారు.

నీటి విడుదలలో నిర్లక్ష్యం..

కృష్ణా డెల్టా ఎస్ఈ ప్రసాద్‌బాబుపై వేటు

- ఈఎన్‌సీకి సరెండర్ చేశాం: రామానాయుడు
- సీఎం హెచ్చరించిన 24 గంటల్లోనే చర్యలు

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల గేట్ల ఎత్తివేతలో నిర్లక్ష్యం చూపే ఇంజనీరింగ్ అధికారులను ఉపేక్షించేది లేదని.. వారు ఆటోమేటిగ్గా సస్పెండైపోతారని సీఎం చంద్రబాబు సోమవారంనాటి కలెక్టర్ల సదస్సులో హెచ్చరించి 24 గంటలు గడవక ముందే.. ఓ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)పై వేటుపడింది. కృష్ణా డెల్టాలో సాగునీటి కోసం రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో నాగార్జునసాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు వరద వస్తున్నా డెల్టా ఎస్ఈ ప్రసాద్‌బాబు గేట్లు ఎత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఆయన్ను జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) కార్యాలయానికి సరెండర్ చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాకు తెలిపారు. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ఆయన మాట్లాడారు. ఓవైపు రైతులు సాగునీటి కోసం పడిగాపులు కాస్తుంటే.. గేట్లెత్తడంలో ఆలస్యం చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలని.. చివరి ఆయకట్టు వరకూ నీరు అందించాలని.. ఇందులో నిర్లక్ష్యం వహించే ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీమాపై పన్నుబండ

జీవిత, ఆరోగ్యబీమా ప్రీమియంలపై చెల్లించే జీఎస్టీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి పక్షాలు మంగళవారం పార్లమెంట్‌భవనం ముందు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఏడు భాషల్లో రాసిన ప్లకార్డులను పట్టుకొని, నినాదాలు చేస్తూ బీమా ప్రీమియంపై 18శాతంగా ఉన్న జీఎస్టీని టాక్స్ టెర్రరిజంగా అభివర్ణించాయి. కష్టకాలంలో ఆదుకుంటుందన్న ఆశతో సగటుమనిషి పైసాపైసా కూడబెట్టి ఏటా బీమా ప్రీమియం కడుతుంటే, దానిమీద కూడా ఇంతటి భారీస్థాయిలో జీఎస్టీ విధించడం కంటే అమానుషత్వం ఇంకేమైనా ఉంటుందా? అని విపక్షనేతలు విమర్శలు చేస్తున్నారు. జీవిత, ఆరోగ్యబీమాలను పూర్తిగా పన్నునుంచి మినహాయించాలని, ఆరోగ్యసమస్యలమీద అత్యధికంగా ఖర్చు చేస్తున్నది భారతీయులే కనుక, ఇంతటి అత్యావశ్యకమైన అంశంలో అధికజీఎస్టీలు సరికాదని వారంటున్నారు. మోదీ ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీతో ఏటా 24వేలకోట్ల రూపాయలు సంపాదిస్తోందని రాహుల్‌గాంధీ వాదన. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఆరోగ్యబీమా ప్రీమియంలపైనే ప్రభుత్వానికి 8263కోట్లు వసూలైందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి లోక్‌సభకు తెలియచేశారు. జీఎస్టీ తొలగింపు డిమాండ్ బలంగా ఉన్నదని అంగీకరిస్తూనే ఏ నిర్ణయమూ చేయాల్సింది కేంద్రం, రాష్ట్రాలతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ మాత్రమేనని ఆయన తేల్చేశారు.

బీమాపై పన్ను పూర్తిగా తొలగించాలంటూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు రవాణామంత్రి నితిన్‌గడ్కరీ లేఖ రాయడంతో ఈ డిమాండ్‌కు మంచిఊతం వచ్చింది. నాగపూర్ డివిజనల్ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అభ్యర్థనమేరకు ఈ లేఖరాస్తున్నట్టుగా చెబుతూనే, వారిని ఉటంకిస్తూనే ఆయన బీమాపై పన్ను సరికాదనీ, దానిని ఉపసంహరించుకోవాలని స్పష్టంగా కోరారు. జీవితబీమాపై పన్ను అంటే జీవితంలో అనిశ్చితిపై పన్నువేయడం, తన కుటుంబానికి భద్రతనిచ్చేందుకు యజమాని తీసుకొనే ఈ బీమాపై పన్ను ఉండకూడదు, ప్రస్తుత సమాజంలో ఎంతో అవసరమైన మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ కూడా సరికాదు అన్నారాయన. జీవిత, ఆరోగ్యబీమా పాలసీలు అత్యావశ్యకం అని ఉధృతంగా ప్రచారం చేస్తూనే వాటినుంచి భారీగా పన్ను పిండుకోవాలన్న ప్రభుత్వం పేరాశ బీమారంగాన్ని దెబ్బతీస్తున్నదని ఉద్యోగ సంఘాల బాధ. ప్రపంచ సగటులో సగం మాత్రమే ఉన్న మనదేశంలో బీమా విస్తరణ ఉధృతంగా జరగాలని సంబంధిత కమిటీలు చెబుతున్నాయి. ఆయా వర్గాల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల సంఖ్య పెరగాలని, ప్రచారం ఉధృతంగా ఉండాలని కూడా అంటున్నాయి. కానీ, కరోనా అనంతరకాలంలో బీమా అవసరాన్ని జనం అధికంగా గుర్తించినా, ప్రీమియం రేట్లు ఏటా పదిహేనుశాతం వరకూ పెరిగిపోతూ, దానికి జీఎస్టీకూడా తోడై భారంగా పరిణమించాయి. చాలామంది ప్రీమియంలు కట్టలేక వదిలేస్తున్న నేపథ్యంలో, జీఎస్టీ తగ్గించాలన్న డిమాండ్ హెచ్చింది. దాదాపు మూడువందలమంది ఎంపీలకు అఖిలభారత బీమా ఉద్యోగుల సంఘం వినతిపత్రాలు సమర్పించింది. బడ్జెట్ సమావేశాల్లో కొందరు ఎంపీలు ఈ విషయం లేవనెత్తకపోలేదు కానీ, గడ్కరీ లేఖతో ఈ సమస్యకు విస్తృత ప్రాచుర్యం దక్కింది. అంతకంటే ముఖ్యంగా, ఆరెస్సెస్ మూలాలున్న ఈ నాయకుడు ఒక విధానపరమైన మార్పును డిమాండ్ చేస్తూ బహిరంగ లేఖ రాయడం ప్రజలకు ఆశ్చర్యం కలిగించింది, రాజకీయ వర్గాల్లో విస్తృతచర్చకు దారితీసింది. ఇటీవల మరోమంత్రి ప్రహ్లాద్‌జోషీ కూడా ఆర్థికశాఖ సహాయమంత్రికి లేఖరాయడం విశేషమైన పరిణామం.

ప్రీమియంలమీద జీఎస్టీ ఎత్తివేయకపోతే రోడ్లమీదకు వస్తానని, ఉద్యమాలు చేస్తాననీ మమతాబెనర్జీ ఇటీవల హెచ్చరించారు. ఆమె పార్టీ ఎంపీ సభలో ప్రభుత్వాన్ని నిలదీశారు. లక్షలకోట్ల జీఎస్టీ వసూలవుతూ పెరుగుదల రేటు కూడా ఘనంగా ఉన్నస్థితిలో బీమామీద భారీగా పన్ను వేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు. లావాదేవీలు జరిగినప్పుడు పన్ను ఉండాల్సిందేనని గట్టిగా నమ్ముతున్న పక్షంలో అతి తక్కువ పన్ను స్లాబ్ ఐదుశాతంలోకి దీనిని తీసుకురావచ్చు. ప్రపంచంలో ఏ దేశంలోనూ బీమా ప్రీమియం మీద ఇంతపన్నులేదు. బంగారంపై మూడుశాతం, నగిషీ చెక్కిన డైమండ్లమీద 0.25శాతం పన్ను విధిస్తూ, ప్రజలు తమకుతాముగా కల్పించుకుంటున్న భద్రత, భరోసాలపై భారీ పన్నుతో విరుచుకుపడటం సముచితం కాదు.

సామాజిక మాధ్యమాలలో తన వాగ్ధాటితో క్రియాశీలకంగా ఉండడం ద్వారా విదేశాలలోని తెలంగాణ యువతను ఆకర్షించిన నాయకుడు రేవంత్ రెడ్డి. తెలంగాణలో కాంగ్రెస్ మరింతగా బలోపేతమయ్యేలా ప్రవాసుల మద్దతును సాధించేందుకై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అమెరికా పర్యటనలో నిర్మాణాత్మకంగా అడుగులు వేస్తారా?

ప్రవాసులకు చేరువకావడానికి కాంగ్రెస్ చేస్తున్నదేమిటి?

సరళంగా అందుబాటులోకి వస్తున్న పరస్పర సమాచార మార్పిడి సాంకేతిక విజ్ఞానం దేశ రాజకీయాలను పరోక్షంగా ప్రభావితం చేస్తున్న కాలమిది. ప్రవాసులు, వారిపై స్వదేశంలో ఆధారపడ్డ కుటుంబ సభ్యుల పాత్ర కీలకంగా మారుతోంది. మరి ప్రవాసులను ఆకట్టుకుని స్వదేశంలోని వారి బంధుమిత్రుల నుంచి రాజకీయ మద్దతు పొందడానికి ఈ నాటి రాజకీయ పార్టీలు, నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఇలా ఓటర్లకు చెరువయ్యే ప్రయత్నాలలో భారతీయ జనతా పార్టీ అగ్రగామిగా ఉండగా భారత జాతీయ కాంగ్రెస్ అట్టడుగులో ఉంది.

వాస్తవానికి కమలనాథుల కంటే దశాబ్దాల పూర్వమే విదేశాలలో కాంగ్రెస్ పార్టీ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసి)గా ఉనికిలో ఉన్నది. అయితే ఈ ఐఓసి అమెరికా, యూరోపియన్ దేశాలలోని మేధావి వర్గానికి మాత్రమే పరిమితమై సామాన్యులకు అందనంత దూరంలో ఉండేది. ఇప్పటికీ అలానే ఉంటూ వస్తూ ఉందనడం సత్య దూరం కాదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకలతో పాటు బలంగా ఉన్న పంజాబ్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన వారు లక్షలాది సంఖ్యలో విదేశాలలో వ్యాపార ఉద్యోగాలలో ఉన్నారు. వారి కుటుంబాలు స్వదేశాలలో ఉన్నాయి. చుట్టాలుపక్కాలు ఎంతో మంది ఉంటారు. గణనీయమైన సంఖ్యలో ఉన్న వారందరికీ చేరువ కావడానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్నదేమిటి? ఏమీ లేదు. ఏ రకమైన ప్రయత్నమూ చేయడం లేదు. ఇప్పటికీ ప్రతి వారం కాంగ్రెస్ పార్టీ నాయకగణం నుండి ఎవరో ఒకరు దుబాయి లేదా అమెరికాలో వ్యక్తిగతంగా పర్యటిస్తుంటారు. అయితే పార్టీ గూర్చి ఏనాడైనా వాకబు చేసిన సందర్భాలు దాదాపు శూన్యమని చెప్పక తప్పదు.

గల్ఫ్ లేఖ

కాంగ్రెస్ పార్టీ మంత్రులు తమ అధికార హయాంలో తరచు విదేశాలలో పర్యటించేవారు. అయితే ఆ పర్యటనలను వారు కేవలం గుప్త విహార యాత్రలుగా మాత్రమే పరిగణించారు కానీ పార్టీపరంగా బలోపేతమయ్యే దిశగా ఆలోచన కనీస మాత్రంగానైనా చేయలేదు. ఎవరైనా పార్టీ అభిమానులు ముందుకు వచ్చి కలవడానికి ప్రయత్నిస్తే అది ఆటు మంత్రులకు గానీ అధికారులకు గానీ సాధారణంగా రుచించేది కాదు. ఇందిరా గాంధీ వెంట సౌదీ అరేబియాకు వచ్చిన రాజీవ్‌గాంధీతో సమావేశమైన జె.గీతారెడ్డి తన ఉద్యోగానికి రాజీనామా చేసి స్వదేశానికి వెళ్ళి రాజకీయాలలో ప్రవేశించి సుదీర్ఘకాలం అధికార పదవులను నిర్వహించారు.



పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు గడ్డం ఆత్మచరణ్ రెడ్డి అనే ప్రవాసుడికి టిక్కెట్ ఇచ్చి గెలిపించారు. ఆ తర్వాత అదే నియోజకవర్గం నుంచి మరో అమెరికా ప్రవాసుడు మధు యాష్కీగౌడ్ కూడ రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. అయితే వీరెవ్వరు కూడా ప్రవాసులలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ప్రయత్నించిన సందర్భాలు లేవు.

ఎవరైనా అధికార ప్రముఖులు విదేశీ పర్యటనకు వెళ్ళి వస్తే చాలు, శంషాబాద్ నుంచి బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసాల దాకా సదరు నాయకుల సేనల పేర వెలిసే వేలాది బ్యానర్లలో పార్టీకి కించిత్ స్థానం కూడా ఉండదు. సామాజిక మాధ్యమాలలో తన వాగ్ధాటితో క్రియాశీలకంగా ఉండడం ద్వారా విదేశాలలోని తెలంగాణ యువతను ఆకర్షించిన నాయకుడు ఎ. రేవంత్ రెడ్డి. ఆయన ప్రస్తుతం ముఖ్యమంత్రిగా తన ప్రథమ అమెరికా పర్యటనలో ఉన్నారు. పిసిసి అధినేతగా ఆయన రెండేళ్ళ క్రితం అమెరికాలో జరిపిన పర్యటనలో భారీ కార్ల ర్యాలీ, సమావేశాలతో సంచలనం సృష్టించారు. ఆ పర్యటన ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను పెంపొందించడానికి దోహదం చేసిందనడంలో సందేహం లేదు. అయితే అది కాంగ్రెస్ పార్టీకి నూతన జవసత్వాలు చేకూర్చిందా లేదా అనేది తెలియదు. అమెరికాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా కొన్ని కార్యక్రమాలను పిసిసి ఎన్నారై సెల్ నిర్వహిస్తుంది, అదే సెల్‌కు అధ్యక్షుడిగా ఉన్న, మాజీ రాయబారి కూడ అయిన జి.వినోద్ కుమార్‌కు ఆహ్వానం అందలేదు. ఆయన్ను ప్రభుత్వ ప్రముఖులు ఎవరూ పట్టించుకోరు మరి.

ఇప్పుడు భారతీయ జనతా పార్టీ విషయానికి వద్దాం. ఇక్కడ మోదీ ఫోటో మినహా 'సేనల'కు స్థానం ఉండదు. బిజెపి ప్రవాసీ విభాగం అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తూ న్యూ ఢిల్లీలోని విదేశీ దౌత్యవేత్తలతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ ఉంటుంది. వీలయినప్పుడు బీజేపీ పాలిత రాష్ట్రాలలో విదేశీ దౌత్యవేత్తల పర్యటనలను ఏర్పాటు చేస్తుంది. ప్రవాసీ విభాగం అధ్యక్షుడయిన విజయ్ చౌతయివాలే ప్రధానమంత్రితో సహా భాజపా ముఖ్యమంత్రులతో కూడా తరుచు సమావేశమవుతారు. విదేశీ పర్యటనలకు వెళ్ళిన ప్రతి కేంద్ర మంత్రి విధిగా తాను కనీసం వంద మంది ప్రవాసులతో సమావేశం కావాలనే అనధికారిక నియమాన్ని ప్రధాని మోదీ విధించారు. పార్టీ నిర్మాణానికి కొంత సమయం కేటాయించాలి, అది భారతీయ ఎంబసీ అయినా లేదా ఫైవ్ స్టార్ హోటల్ అయినా సమావేశమనంతరం జై శ్రీరాం, భారత మాతకీ జై అనే నినాదాలు చేయాలి. సీనియర్ మంత్రులు నితిన్ గడ్కరీతో సహా వ్యక్తిగత పర్యటనలకు విదేశాలకు వెళ్లుతున్న మంత్రులు సైతం పార్టీ కార్యకర్తలతో సమావేశం కావాలనే పార్టీ ఆదేశాన్ని తుచ తప్పకుండా పాటిస్తున్నారు. సూటు ధరించే ఉన్నత ఉద్యోగాలు చేసే వారే కాకుండ తట్టా బుట్ట మోసే కార్మికులయినా సరే, వారు ఔత్సాహికులైన పార్టీ అభిమానులు అయితే వారిని ప్రోత్సహిస్తూ అందలం ఎక్కిస్తున్నారు. అగ్రనాయకుడు అమిత్ షా ఎంత బిజీగా ఉన్నా ఏదో విధంగానైనా వీలు చేసుకుని రాత్రి పూట విందుకు ప్రవాస కార్యకర్తలను ఆహ్వానించి పార్టీ పటిష్ఠతపై మాట్లాడుతారు. దుబాయికి వచ్చినప్పుడల్లా ధర్మపురి అర్వింద్ కార్మికులతో కూడ కలిసిమెలిసి కాఫీ షాపులలో కూర్చుంటారు.

కాంగ్రెస్ అధికారంలో లేని దశాబ్ద కాలంలో పార్టీ పేరును ఉచ్చరించడానికి కూడ ఇష్టపడని వారందరు ఇప్పుడు పార్టీ ప్రవాసీ అనుబంధ సంస్థల పేర షామియానాలు వేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ మరింతగా బలోపేతమయ్యేలా ప్రవాసుల మద్దతును సాధించేందుకై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అమెరికా పర్యటనలో ఏమైనా నిర్మాణాత్మకంగా అడుగులు వేస్తారా? వేచి చూద్దాం.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఎగిసిన బంగ్లా అలలకు ఎవరు కారణం?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'నేను పెను తుఫానును, నేను విధ్వంసాన్ని.. నాకే దయాలేదు, అన్నిటినీ ముక్కలు ముక్కలు చేస్తాను. నాకే నిబంధనలూ లేవు, చట్టాలూ లేవు, దారిలో ఉన్నవాటినన్నిటినీ ధ్వంసం చేస్తాను. నేను శివుడిని, తలపై చంద్రుడిని, నుదుటిపై సూర్యుడిని ధరించిన పినాకపాణిని. నేను ప్రళయాగ్రహాన్ని, అల్లకల్లోల సముద్ర ఘోషను. నేను సూర్యోదయపు నూతన యవ్వనాన్ని..'


బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే బంగ్లాదేశ్ జాతీయ కవి నజ్రుల్ ఇస్లాం కొన్ని దశాబ్దాల క్రితం రచించిన 'విద్రోహి' కవిత గుర్తుకు వస్తున్నది. ఎన్నో ఏళ్లుగా అసహనంగా ఉన్న సముద్రం ఆగ్రహంతో పెల్లుబుకినట్లు, నిశ్శబ్దంగా ఉన్న అగ్నిపర్వతం పెటిల్లున పేలినట్లు, ఉన్నట్లుండి ఆకాశం కుప్పకూలినట్లు బంగ్లాదేశ్‌లో జనాగ్రహం రోడ్లపై ప్రవహించింది. కనిపించిన వాటిని ధ్వంసం చేసింది. చట్టసభల్లోకి, ప్రధాని రాజప్రాసాదంలోకి ప్రవేశించి విశృంఖల కృత్యాలకు పాల్పడింది. బంగ్లా అంతటా ఆ దేశ వ్యవస్థాపకుడు ముజిబుర్ రహ్మాన్ విగ్రహాలను కూల్చివేశారు. ఎంతో కాలంగా ఊపిరిబిగపట్టుకుని ఎన్నో దుర్మార్గాలను సహిస్తూ వస్తున్న ప్రజానీకానికి తమ కసి తీర్చుకునేందుకు దేశం దేశమే 'రేజ్ రూమ్' (ఆగ్రహాన్ని వ్యక్తం చేసే గది)గా మారింది. రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం ఒక నిప్పుకణిక మాత్రమే. కాని బంగ్లాదేశ్ రగులుకునేందుకు ఎప్పటి నుంచో సిద్ధంగా ఉన్నది. బంగ్లాదేశ్ పాలకులు కానీ, ఆ పాలకులకు స్నేహంగా ఉన్న భారతదేశ నేతలు కానీ జరగబోయే ఉత్పాతాన్ని గ్రహించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనందువల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తింది.

ఈ ప్రజాగ్రహం కేవలం కొన్ని మతతత్వ శక్తులు, అమెరికా, చైనా, పాకిస్థాన్ అనుకూల ప్రేరేపిత శక్తుల వల్ల వ్యక్తమైంది కాదు. ఆఖరుకు అక్కడి ప్రతిపక్షాలతో కూడా నిమిత్తం లేకుండా జనం వీధుల్లోకి ప్రవేశించారు. బంగ్లాదేశ్‌లో దుర్మార్గాలకు అంతు లేనప్పుడు, అణిచివేత తార స్థాయికి చేరుకున్నప్పుడు అన్ని శక్తులూ ఏకమై చేసిన తిరుగుబాటు ఇది. ఆరు నెలల క్రితమే బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వచ్చింది. కాని ప్రజాగ్రహానికి ఎన్నికల ఫలితాలతో నిమిత్తం ఉండదని, బూటకపు ప్రజాస్వామ్యాన్ని నాయకులు గౌరవించినా ప్రజలు సహించలేనప్పుడు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తారని ఈ పరిణామాలు నిరూపించాయి.

తిరుగుబాట్లు అనేక రకాలుగా జరుగుతాయి. అవి హింసాకాండ, ఆగ్రహ జ్వాలలకే దారితీయాల్సిన అవసరం లేదు. శ్రీలంక, నేపాల్, వెనిజులా తదితర దేశాలతో పాటు భారత దేశంలో కూడా అనేకసార్లు ప్రజా ఉద్యమాలకు కావల్సిన రసాయనాలు తయారయ్యాయి. కాని వాటి ఉపశమనానికి కూడా పరిస్థితులు దోహదం చేశాయి. కొన్నిసార్లు ప్రజాస్వామికంగా ప్రజల తీర్పులే వారి ఆగ్రహాన్ని ఉపశమింపచేస్తాయి. ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీ ప్రభుత్వం పట్ల ఏర్పడిన ప్రజావ్యతిరేకత ఆమె ఓటమితో సమసిపోయింది. యూపీఏ పదేళ్ల పాలనపై, కాంగ్రెస్ రాజకీయాలపై ఆగ్రహాన్ని ప్రజలు బీజేపీని ఎన్నుకోవడం ద్వారా తీర్చుకున్నారు. మళ్లీ ఇటీవల అదే బీజేపీ ప్రభుత్వానికి మెజారిటీ తగ్గించి ప్రజలు పాలకులు తప్పులు సవరించుకునేందుకు, ప్రతిపక్షాలు సంఘటితమయ్యేందుకు అవకాశాన్ని కల్పించారు. దేశంలో ప్రాంతీయ, ఉప ప్రాంతీయ పార్టీలు అనేక సందర్భాల్లో ప్రజాగ్రహాలను తమకు అనుకూలంగా తిప్పుకున్నాయి. బంగ్లాదేశ్‌లో జరిగినట్లు మన ప్రతిపక్షాలు కూడా నిరాశా నిస్పృహలకు గురై ఎన్నికలను బహిష్కరించకుండా సంయమనం పాటించడం కూడా ఒక రకంగా మంచిదైంది.

కాని బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా అవామీ లీగ్ సర్కార్ ప్రజల ఆగ్రహం రోజురోజుకూ పెరిగేందుకే కాని చల్లారేందుకు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. బూటకపు ఎన్నికలను నిర్వహించి, నకిలీ ప్రత్యర్థులపై విజయం సాధించి అధికారాన్ని శాశ్వతం చేసుకునే ప్రయత్నం చేసింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేత బేగం జియాను అవినీతి ఆరోపణలపై జైలు పాలు చేసింది. ఆమె కుమారుడు, రాజకీయ వారసుడు లండన్‌కు ప్రవాసానికి వెళ్లాల్సి వచ్చింది. రాజకీయ ప్రత్యర్థులందర్నీ అణిచివేసింది. న్యాయ వ్యవస్థ ప్రజలను రక్షించే బదులు భక్షించే వ్యవస్థగా మారి జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు, పౌర సమాజ సంస్థల గొంతు నొక్కేందుకు ఉపయోగపడింది. అక్కడ ప్రభుత్వం నియమించిన న్యాయమూర్తులే కాని, మన దేశంలో మాదిరి కొలీజియం వ్యవస్థ లేదు. 2018లో రూపొందించిన డిజిటల్ సెక్యూరిటీ చట్టం ఆధారంగా ఎవరు ఏ మాత్రం విమర్శలకు పాల్పడినా అణిచివేతకు గురి చేయడం సామాన్యమైంది. మీడియా భయంతో స్వయం సెన్సార్‌షిప్ చేసుకోవాల్సిన ఆగత్యం ఏర్పడింది. పత్రికా స్వేచ్ఛ విషయంలో 180 దేశాల్లో బంగ్లాదేశ్ 163వ స్థానంలో ఉన్నదని 'రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్' సంస్థ తెలిపింది. పెద్ద ఎత్తున నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతో ఆ దేశం సతమతమవుతోంది.

బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలు పెంచుకోవడం భారత్‌కు వ్యూహాత్మకంగా అవసరమే. ఈశాన్య భారత రాష్ట్రాలకు అక్కడి నుంచి దగ్గరి దారి ఉన్నది. దక్షిణాసియా– పది ఆసియాన్ దేశాల అనుసంధానానికి బంగ్లాదేశ్ కీలకం. ఏడు దేశాల సభ్యత్వంతో కూడిన బిమ్‌స్టెక్‌లో మన ప్రాంతీయ ఆకాంక్షలకు బంగ్లాదేశ్ కేంద్ర బిందువు. పాకిస్థాన్, చైనాలతో ఉన్న శత్రుత్వం రీత్యా బంగ్లాతో స్నేహం అవసరమని మన ప్రభుత్వం భావించింది. చమురు ఉత్పత్తుల సరఫరా, సైనిక సహాయం ద్వారా హసీనా ప్రభుత్వానికి అండగా నిలిచింది. కాని ఈ స్నేహ సంబంధాలు మితిమీరిపోవడంతో భారత్ లేకుండా హసీనా ప్రభుత్వం మనుగడ లేదనే అభిప్రాయానికి దారి తీసింది. 'హసీనా వెనుక భారతదేశం అండగా లేకపోతే ఆమె నెప్పుడో గద్దె దించేవారం' అని ఖలీదా జియా ఒక సందర్భంలో అన్నారు. హసీనా తన నియంతృత్వ పోకడలతో భారత్ ప్రతిష్ఠను కూడా దెబ్బతీశారని ప్రముఖ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ 2017లోనే ఒక వ్యాసంలో రాశారు. హసీనా హయాంలో బంగ్లాదేశ్ బహుళ సాంస్కృతిక సంప్రదాయాలను కోల్పోయిందని, అక్కడ సంపదను హస్తగతంచేసుకున్న కొద్ది మంది వ్యాపారస్తులు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారని, అడుగడుగునా అవినీతి కొనసాగుతోందని ఆయన వివరించారు. నిజానికి పాకిస్థాన్‌లో మాదిరి బంగ్లాలో కూడా ఇస్లామిక్ పాలనను రుద్దేందుకు జమాత్ ఏ ఇస్లామియా వంటి సంస్థలు చేస్తున్న ప్రయత్నాలకు అక్కడి ప్రజలు ఊతమివ్వడం లేదని, కేవలం షేక్ హసీనాకు తగ్గిన జనాదరణవల్లే బంగ్లాదేశ్ ప్రజలు భారత్‌కు వ్యతిరేకంగా, ఇస్లామిస్టు మితవాదులకు అనుకూలంగా మారారని ఆయన చెప్పారు. తాజా పరిణామాల తర్వాత బంగ్లాలో ఏర్పడే ప్రభుత్వంపై ఏ శక్తుల ప్రభావం ఉంటుందో ఇప్పుడే చెప్పలేం.



గత జనవరిలో షేక్ హసీనా గెలుపుతో బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరత ఏర్పడిందన్న ధీమాతో భారత్ ఉదాసీనంగా వ్యవహరించింది. అది బూటకపు రాజకీయ సుస్థిరత అని, అక్కడ ప్రజలు పడగ మీద కొడితే లేచే సర్పాల్లా బుస కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని మనం గమనించడం కానీ, హసీనాను అప్రమత్తం చేయడం కానీ చేయలేకపోయాం. బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఇక్కడ మోదీ సేన తమకు 400 సీట్లకు పైగా స్థానాలు లభిస్తాయన్న ఊపులో ఉన్నది. తమ మెజారిటీ తగ్గుతుందని ఊహించలేని వారు బంగ్లాదేశ్ పరిణామాలను ఏ విధంగా ఊహించగలరు? విపక్షాల పట్ల తాము ప్రజాస్వామికంగా వ్యవహరించలేని వారు ప్రజాస్వామికంగా వ్యవహరించాలని హసీనాకు ఏ విధంగా హితవు చెప్పగలరు?

జనవరిలో జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా గెలుపుతో భారత్ అక్కడ రాజకీయ సుస్థిరత ఏర్పడిందన్న ధీమాతో ఉదాసీనంగా వ్యవహరించింది. అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు బంగ్లాలో ఎన్నికలు సక్రమంగా జరగలేదని విమర్శిస్తే మన ప్రధాని మోదీ ఆమెకు ఫోన్ చేసి నాలుగోసారి చారిత్రక విజయం సాధించారంటూ అభినందించారు. విచిత్రమేమంటే జనవరిలో ఎన్నికలు జరిగినప్పటి నుంచే అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయని మంగళవారం లోక్‌సభలో విదేశాంగ మంత్రి ప్రకటించారు. మరి ఇన్నాళ్లూ ఎందుకు మౌనంగా ఉన్నారు? బంగ్లాదేశ్‌లో ఏర్పడింది బూటకపు రాజకీయ సుస్థిరత అని కానీ, అక్కడ ప్రజలు పడగ మీద కొడితే లేచే సర్పాల్లా బుస కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కాని మనం గమనించడం కానీ, హసీనాను అప్రమత్తం చేయడం కానీ చేయలేకపోయాం. జనవరిలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఇక్కడ మోదీ సేన తమకు 400 సీట్లకు పైగా స్థానాలు లభిస్తాయన్న ఊపులో ఉన్నది. తమ మెజారిటీ తగ్గుతుందని ఊహించలేని వారు బంగ్లాదేశ్ పరిణామాలను ఏ విధంగా ఊహించగలరు? ప్రతిపక్షాల పట్ల తాము ప్రజాస్వామికంగా వ్యవహరించలేని వారు బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామికంగా వ్యవహరించాలని హసీనాకు ఏ విధంగా హితవు చెప్పగలరు? పైగా బంగ్లాదేశ్‌లో ఉన్న అవలక్షణాలు ఎన్నో మన దేశంలో కూడా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో హసీనా నియంతృత్వ చర్యలకు భారత్ పూర్తిగా వత్తాసు పలుకుతూ అన్ని విధాలా అండగా ఉన్నందువల్ల ఇవాళ హసీనా పట్ల ఉన్న వ్యతిరేకత భారత్ పట్ల వ్యతిరేకతను కూడా ప్రతిఫలిస్తున్నాయి. మోదీ ఇచ్చిన అండదండల మూలంగానే హసీనా భారత్‌కు నేరుగా రాగలిగారు. అక్కడి సైనికాధికారులు హసీనాకు 45 నిమిషాలు సమయం ఇచ్చి పారిపోయే అవకాశం కల్పిస్తే మన వైమానిక స్థావరంలో ఆమెకు భద్రత కల్పించి క్షేమసమాచారాలను తెలుసుకునేందుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను పంపాం. దాని వల్ల మన భారత్‌కేమి ప్రయోజనం? ప్రతి దేశంలోనూ దేశాధినేతలు మారుతూనే ఉంటారు. అందువల్ల వ్యక్తుల ఆధారంగా కాకుండా దేశాల ఆధారంగా మన విదేశాంగ నీతి మారుతూ ఉండాలి.

మనం ఇప్పటికే పాకిస్థాన్, నేపాల్, శ్రీలంకను దూరం చేసుకున్నాం. జనవరిలో మాల్దీవులు భారత్‌కు దూరంగా జరిగి తనను తాను చైనాకు అనుకూలంగా ప్రకటించుకుంది. మన చుట్టూ ఉన్న దేశాల భారత వ్యతిరేకతను చైనా ఉపయోగించుకుంటోంది. బంగ్లాదేశ్ కూడా ఇప్పుడు మన చేజారిపోయింది. కింకర్తవ్యం?

మీ స్నేహితులను సన్నిహితంగా ఉంచుకోవాలి, మీ శత్రువులను మరింత సన్నిహితంగా ఉంచుకోవాలన్నది విదేశాంగ నీతి. మనం చరిత్రను మార్చగలం కాని భౌగోళిక పరిస్థితులను మార్చలేం. మనం స్నేహితులను మార్చుకోగలం కాని పొరుగు వారిని మార్చుకోలేం.. అని మాజీ ప్రధాని వాజపేయి లాహోర్ పర్యటనలో భాగంగా అన్నారు. మన స్వదేశీ విధానం మనను కేవలం ఓడిస్తుంది. విదేశాంగ విధానం మనను పూర్తిగా దెబ్బతీస్తుంది అని కెనడీ ఊరికే అనలేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

సహకార వ్యవస్థను నమ్మి చతికిలబడ్డ చేనేత

ప్రభుత్వం సుమారు ఏడు దశాబ్దాలు సహకార రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి, చేనేత పరిశ్రమకు సహాయపడాలని ఆలోచించింది. కానీ సహకారరంగ ప్రోత్సాహం వల్ల చేనేత పరిశ్రమకు జరగవలసినంత మేలు జరగలేదు. మొత్తం చేనేత పరిశ్రమలో సహకార నేత కార్మికులు చాలా తక్కువ. నాలుగవ ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ సెన్సస్ 2019–20 ఫలితాల ప్రకారం, దేశంలోని 35.22 లక్షల మంది చేనేత కార్మికులలో... సహకార సంఘాల కార్మికులు కేవలం 6.3 శాతం (2.23 లక్షలు) మాత్రమే. పైగా, సహకార వ్యవస్థలో బోగస్ సంఘాలు, పేలవంగా నడిచే సంఘాలే ఎక్కువ. వీటివల్ల చేనేత పరిశ్రమకు ఒరిగింది తక్కువే. కానీ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లోని కొన్ని చేనేత సహకార సంఘాలు తమ కార్యకలాపాలను చక్కగా నిర్వహించడం వల్ల, సభ్యులు వాటిని వదలడానికి ఇష్టపడడం లేదు. సభ్యులకు నిరంతరం పని కల్పించడం, ఆకర్షణీయమైన వేతనాలు, బోనస్‌లు, ప్రభుత్వ పొదుపు నిధికి చెల్లింపులు, డిజైన్ అభివృద్ధికి చెల్లింపులు, ఇతర ప్రోత్సాహకాలు అందించడం దీనికి కారణాలు. సక్రమంగా నడిచే సంఘాల వల్ల మంచి మేలు జరుగుతుందనడానికి ఇవి నిదర్శనాలు.

ఏది ఏమైనా భారతదేశంలోని చేనేత పరిశ్రమలో సహకార రంగానికి వెలుపల ఉన్న చేనేత కళాకారులను వదిలి, సహకార రంగంలోని కార్మికులకే ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వాలన్న ప్రభుత్వ విధానం దాదాపు ఏడు దశాబ్దాలుగా కొనసాగిన ఆర్థిక తప్పిదం. సహకార సంఘాలు సిద్ధాంతపరంగా మంచివే అయినా, ఆచరణ పరంగా చాలావరకు నిరుపయోగమైనవి.

2023లో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ వారు తెలుగు రాష్ట్రాల్లోని నేత కార్మికులపై చేసిన అధ్యయనం వంటి అనేక అధ్యయనాల్లో బోగస్ సంఘాలు కుక్క గొడుగుల్లా వెలిశాయనీ, సహకార సంఘాలు చాలా వరకు ఉపయోగం లేనివనీ ఢంకా బజాయించి చెప్పాయి. ఈ సొసైటీలు చాలా వరకూ నిద్రాణంగా ఉంటాయి. నిధులను స్వాహా చేయడం తప్ప, ఇవి తమ సభ్యులకు తగినంత పనిని అందించడం లేదు. చాలా బోగస్ సంఘాల ఉనికి కేవలం రికార్డులలోనే ఉంటుంది. ఇదిలా ఉండగా, నిజానికి చట్టబద్ధమైన సొసైటీలు కూడా ఆర్థికంగా బలహీనంగా ఉన్నాయి. అవి కూడా సభ్యులకు చాలినంత ఉపాధి కల్పించడం లేదు. అవి ఇచ్చే నేత కూలి కూడా చాలా తక్కువ. అపెక్స్ సొసైటీల కొనుగోళ్లపైనే అవి ఎక్కువగా ఆధారపడుతున్నాయి.

బోగస్ సంఘాల స్థాపన, వాటి తదుపరి కార్యకలాపాలపై ప్రభుత్వ యంత్రాంగం సరైన నియంత్రణను సాధించలేకపోయింది. చాలా చోట్ల సంఘాల సభ్యులకు తామెందుకు సభ్యులయ్యారో వారికి తెలియదు. ప్రభుత్వం అందించే సహాయాన్ని ఈ నకిలీ సంఘాల మాఫియా కాజేస్తున్నదని తెలుసుకున్న ప్రభుత్వం, చేనేతకు తగిన బడ్జెట్ తోడ్పాటు అందించడానికి వెనుకాడుతోంది.

వాస్తవానికి, సహకార సంఘాల మాఫియాను దాని ప్రారంభ దశలోనే ప్రభుత్వం అరికట్టగలిగి ఉంటే, ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న సహకార సంఘ వ్యవస్థ, చేనేత పరిశ్రమపై గణనీయమైన ప్రభావాన్ని చూపేది. ఏది ఏమైనా సహకార వ్యవస్థ నిరాశనే మిగిల్చింది. కాబట్టి ప్రభుత్వం సహకార వ్యవస్థపై ఆధారపడి అభివృద్ధి నిధులను అందించే పద్ధతిని సమీక్షించుకోవాలి.

చేనేత పరిశ్రమ క్షీణదశలో ఉందనడానికి అనేక ఆనవాళ్లు ఉన్నాయి. ఇది గతంలో వ్యవసాయం తర్వాత రెండవ అతిపెద్ద ఉద్యోగప్రదాయిని. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అఖిల భారత చేనేత జనాభా లెక్కల ప్రకారం 2010లో 43.32 లక్షల మంది ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2019–20 నాటికి 35.22 లక్షలకు తగ్గింది. సహకార సంఘాలలో కార్యశీలక కార్మికుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. అంతేకాకుండా, మాస్టర్ వీవర్లు తీవ్ర కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నారు. చాలా మగ్గాలు అటకెక్కి బూజు పట్టాయి. 2010లో సగటు పనిదినాలు 234 ఉంటే, 2020లో అవి 207కి పడిపోయాయి. అధిక విలువ ఉత్పత్తులను తయారుచేసే పోచంపల్లి, గద్వాల్, ధర్మవరం, ఉప్పాడ వంటి చిన్న పాకెట్స్ మినహా సంప్రదాయ నేత కులాలలోని యువతను చేనేత పరిశ్రమ ఆకర్షించడం లేదు. ఈ ప్రాంతాలలో సంప్రదాయ చేనేత కులాల యువకులు, నూతన శక వృత్తి ఉద్యోగాలలో నిరాశ కలిగినప్పుడు రావడానికి పనికి వచ్చే ప్రత్యామ్నాయ వృత్తిగా చేనేతని భావిస్తున్నారు.



చేనేత పరిశ్రమ అభివృద్ధిని పట్టించుకోవాలంటే, ప్రభుత్వం ఇప్పుడు సహకారేతర చేనేత కార్మికులకు, ముఖ్యంగా మాస్టర్ వీవర్లకు, స్వతంత్ర కార్మికులకు గణనీయమైన సహాయాన్ని అందించాల్సిన అవసరం ఉంది. కానీ మాస్టర్ వీవర్లు, స్వతంత్ర వీవర్లు ప్రభుత్వ సహాయాన్ని దారి మళ్లించే అవకాశం ఉంది. అటువంటి ధోరణిని అరికట్టడానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, జియోట్యాగింగ్, బలమైన వ్యక్తిగత గుర్తింపు వ్యవస్థ, ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీని ఉపయోగించుకునే వ్యవస్థలను అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం ఆలోచించాలి.

నేటి మార్కెట్‌లో లభిస్తున్న ఉద్యోగాలకు వృద్ధ కార్మికుల ప్రతిభ సరిపోదు కాబట్టి వారే ఎక్కువగా ఈ వృత్తిలో ఉన్నారు. వయసు పైబడిన నేత కార్మికులు అత్యాధునికమైన మగ్గాలతో పని చేయలేకపోతున్నారు. అంతేకాకుండా, వారు అధిక నాణ్యత గల డిజైన్లను తయారు చేయలేరు. పైగా, చేనేతరంగం చాలా తక్కువ వేతనాలను అందిస్తోంది. ఎంత తక్కువ అంటే రిటైల్ అమ్మకాలు, కార్యాలయ నిర్వహణ, అకౌంటింగ్, నిర్మాణం వంటి సమకాలీన వృత్తులలో వచ్చే వేతనాలలో సగం కంటే తక్కువ. అయితే, సామాన్య ఉత్పత్తులకు బదులు, ఖరీదైన, ఆధునిక తరహా ఉత్పత్తులను నేయడం వల్ల అధిక వేతనాలు లభిస్తాయి.

కానీ అధిక విలువగల వస్త్ర ఉత్పత్తి చేసే చేనేత పనిలో కూడా ఇబ్బందులున్నాయి. వీటిలో నూతన డిజైన్ సెటప్‌కు ఖర్చు అధికం. పైగా ఈ ఖర్చు ఎక్కువ భాగం చేనేత కార్మికుని నెత్తిపైనే పడుతుంది. మరింత డిజైన్–ఇంటెన్సివ్ ఉత్పత్తులకు మారడానికి వృద్ధ కార్మికులకు చేతకాదు; నూతన డిజైన్లు నేయగల యువకులు ఈ వృత్తిలోకి రావడానికి విముఖంగా ఉన్నారు; నూతన డిజైన్లను నేసే నైపుణ్యాలను సంపాదించడం, వాటిని బదిలీ చేయడం ఇబ్బందులతో కూడుకున్న పని; అలాగే అనేక రకాల డిజైన్లు, నమూనాలు కావాల్సినంతగా లభ్యం కావడం లేదు. అధిక విలువ వస్త్రాలను నేయడంలో ఉన్న సమస్యలతో పాటు, చేనేత కార్మికులు అనేక ఇతర వ్యవస్థాగత ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నిత్యమూ పెరిగే నూలు, రంగు, రసాయనాల ధరలు, చేనేత కార్మికులకు తమ వస్తు నాణ్యతపై నియంత్రణ లేకపోవడం, అనుకరణలను ఉత్పత్తి చేసే పవర్‌లూమ్‌ల దాడి, వినియోగదారుల అవసరాలను తెలిపే సమాచార వ్యవస్థలు లేకపోవడం, కొనుగోలుదారులతోనూ, రిటైల్ వర్తకులతో బలమైన సంబంధాలు లేకపోవడం వంటివి ఉన్నాయి.

ఈ సవాళ్లతో పాటుగా, మార్కెట్‌లో అమ్ముకోవడాన్ని కష్టతరం చేసే విధంగా చేనేత ఉత్పత్తులపై జిఎస్‌టి విధిస్తున్నారు. చేనేతకు ప్రత్యేకించిన నిర్దిష్ట వస్తువుల ఉత్పత్తిని పరిమితం చేసే చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయకపోవడం, ప్రభుత్వం చేనేత అభివృద్ధికి ఇచ్చే బడ్జెట్‌ని ప్రతి ఏటా తగ్గించడం చేనేతను పీడిస్తున్న సమస్యలు. ఈ సమస్యలన్నీ సహకార రంగంలోని పరిశ్రమకూ, దానికి బయట ఉన్న మాస్టర్ వీవర్లు, స్వతంత్ర నేత కార్మికులకూ వర్తిస్తాయి.

చేనేత పరిశ్రమ అభివృద్ధిని పట్టించుకోవాలంటే, ప్రభుత్వం ఇప్పుడు సహకారేతర చేనేత కార్మికులకు, ముఖ్యంగా మాస్టర్ వీవర్లకు, స్వతంత్ర కార్మికులకు గణనీయమైన సహాయాన్ని అందించాల్సిన అవసరం ఉంది. కానీ మాస్టర్ వీవర్లు, స్వతంత్ర వీవర్లు ప్రభుత్వ సహాయాన్ని దారి మళ్లించే అవకాశం ఉంది. అటువంటి ధోరణిని అరికట్టడానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, జియోట్యాగింగ్, బలమైన వ్యక్తిగత గుర్తింపు వ్యవస్థ, ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్)ని ఉపయోగించుకునే వ్యవస్థలను అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం ఆలోచించాలి.

● డాక్టర్ మీసాల అప్పలయ్య
మాజీ జనరల్ మేనేజర్, ఏపీ స్టేట్ సెరిఫెడ్
(నేడు చేనేత దినోత్సవం)

బంగ్లాదేశ్‌తో జాగ్రత్త!

భారత్ పొరుగుదేశం, మిత్రదేశం అయిన బంగ్లాదేశ్‌లో తీవ్ర అస్థిరత్వం నెలకొంది. కొన్ని నెలలుగా పౌరుల ఆందోళనలు కొనసాగి, ప్రభుత్వపు నిర్వాకంతో తీవ్రరూపం దాల్చి, చివరకు ఆ దేశ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పారిపోయేంతగా గాడి తప్పాయి. ప్రస్తుతం అధ్యక్షుడి కోరిక మేరకు సైన్యం పరిస్థితిని అదుపులోకి తెచ్చుకొని, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు దిశగా వివిధ పక్షాలతో, విద్యార్థి నాయకులతో సంప్రదింపులు జరుపుతోంది. పొరుగు దేశం రాజకీయ, పాలన అస్థిరత్వంలో ఉండడం భారత్‌కు చేటు. పాకిస్తాన్, చైనా దేశాలు, స్థానిక భారత్ వ్యతిరేక సమూహాల్ని మచ్చిక చేసుకుని ఆ దేశంలో పరపతి పెంచుకొనే అవకాశాల్ని మెరుగు పర్చుకుంటాయి. ఆ స్థితి కలగకుండా మంచి స్నేహ సంబంధాల్ని కొనసాగించడానికి మన దేశం చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సి ఉంది. ఎందుకంటే ఇప్పుడు గద్దె దిగిన షేక్ హసీనా ప్రభుత్వం మన దేశంతో మిత్రత్వం నెరిపింది. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడ్డాయి. వాణిజ్యం, దౌత్యం బలపడ్డాయి. అయితే ఆమె అక్కడ నియంతలా వ్యవహరించి చెడ్డ పేరు తెచ్చుకుంది. ప్రజాబలాన్ని దూరం చేసుకుని, రాజకీయ వ్యతిరేకుల్ని అణిచివేసి, ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి, చివరకు తానే దేశం విడిచి పారిపోయే స్థితి తెచ్చుకుంది. కాబట్టి ఆమె (అవామీ లీగ్ పార్టీ) వ్యతిరేకులకు మన దేశం కూడా వ్యతిరేకంగానే కనబడుతుంది.

వచ్చేది ఏ ప్రభుత్వమైనా, సైనిక పాలన అయినా మన దేశంతో వారి సంబంధాలు సానుకూలంగా ఉండేటట్లు చూసుకోవాలి. సరిహద్దుల నుండి అధిక సంఖ్యలో శరణార్థులు చొరబడే అవకాశం ఉంది. భారత్‌కు వ్యతిరేకంగా ఆ దేశాన్ని వాడుకోవడానికి పొంచి ఉన్న అంతర్జాతీయ శక్తులను కూడా ఓ కంట కనిపెట్టుకుని ఉండాలి. ఎలాంటి సందేహం లేకుండా భారత్‌ని నమ్మదగిన మిత్రునిగా బంగ్లాదేశ్ ప్రజలు, రాజకీయ పక్షాలు మున్ముందు కూడా భావించాలంటే అది సరైన దౌత్యనీతితోనే సాధ్యం.

– డి.వి.జి. శంకర రావు
మాజీ ఎంపీ, పార్వతీపురం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

అగ్రి అయ్యారా?

మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబసభ్యులు కబ్జాచేసి విక్రయించిన అగ్రిగోల్డ్ భూముల ఉదంతంలో బాధ్యులైన వారిపై తూతూ మంత్రపు చర్యలతో సరిపెట్టేశారా? కీలక పాత్రధారులపై ఎలాంటి చర్యలూ తీసుకునే సాహసం చేయడం లేదా? జరుగుతున్న పరిణామాలను చూస్తే పై ప్రశ్నలకు ఔననే సమాధానం వస్తోంది. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను కబ్జాచేసి, విక్రయించేసిన ఘటనలో విజయవాడ రూరల్ డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్, మండల సర్వేయర్ రమేశ్, గ్రామ సర్వేయర్ దేదీప్యను అప్పటి కలెక్టర్ ఢిల్లీరావు సస్పెండ్ చేశారు. అయితే సర్వేయర్ మాత్రం నేటికీ యథావిధిగా విధులకు హాజరవుతుండటం కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులను అపహాస్యం చేసేలా ఉంది. అగ్రి దందాలో జోగి కుటుంబానికి సహకరించిన అప్పటి నున్న సబ్ రిజిస్ట్రార్ నాగేశ్వరరావుపైనా అధికారులు ఎలాంటి చర్యలకూ సిఫారసు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.





అగ్రిగోల్డ్ భూముల కబ్జా కేసులో మారని అధికారుల తీరు

- పేరుకే అధికారుల సస్పెన్షన్.. నేటికీ సీటులోనే
- మండల సర్వేయర్ రమేశ్‌పై సస్పెన్షన్ వేటు
- అయినా యథావిధిగా విధులకు హాజరు
- కీలకపాత్రధారి సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు శూన్యం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలోని సర్వే నంబరు 87లో 2160 గజాల విస్తీర్ణంలోని అగ్రిగోల్డ్ భూములను గతంలో సీఐడీ అటాచ్ చేసింది. ఈ భూములను జోగి రమేశ్ కుటుంబసభ్యులు కబ్జాచేసి విక్రయించేశారని తెలిపారు. 2022లో జోగి వెంకటేశ్వరరావు, జోగి రాజీవ్ కలిసి ఈ కబ్జాకు తెరదీయగా 2023 జనవరిలోనే అగ్రిగోల్డ్ యాజమాన్యం విజయవాడ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న తమ భూములను జోగి రాజీవ్, వెంకటేశ్వరరావు కబ్జా చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే అప్పటికీ జోగి రమేశ్ మంత్రిగా ఉండటంతో పోలీసులు ఈ ఫిర్యాదును అటకెక్కించారు.

ఈ అధికారులపై చర్యలేవి?

కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మరోసారి ఈ కబ్జా బాగోతం తెరపైకి వచ్చింది. తొలుత సర్వే నంబరు 88లోని భూములను కొన్న జోగి కుటుంబసభ్యులు ఆ తర్వాత స్వీయ సవరణ దస్తావేజుతో సర్వే నంబరును 87గా మార్చి అగ్రిగోల్డ్ భూములను చెరబట్టారు. అప్పటి నున్న సబ్ రిజిస్ట్రార్ నాగేశ్వరరావు డైరెక్షన్‌లోనే జోగి కుటుంబసభ్యులు ఈ స్వీయ సవరణ దస్తావేజు డ్రామా ఆడినట్టు చెబుతున్నారు. ఈయన్ను ఎన్నికలకు ముందు ఇబ్రహీంపట్నంకు బదిలీ చేశారు. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములను జోగి కుటుంబానికి కట్టబెట్టడంలో కీలకంగా వ్యవహరించిన సబ్ రిజిస్ట్రార్‌పై ఎలాంటి చర్యలకూ అధికారులు సిఫారసు చేయలేదు. తాజాగా అగ్రిగోల్డ్ యాజమాన్యం ఈ ఉదంతంపై హైకోర్టును ఆశ్రయించింది. వారు దాఖలు చేసిన పిటిషన్‌లో సబ్ రిజిస్ట్రార్ నాగేశ్వరరావు పేరును ప్రస్తావించింది.

కబ్జా భూములు కొనుగోలు

మరోవైపు మండల సర్వేయర్ రమేశ్‌పై సస్పెన్షన్ వేటు పడినా సర్వే శాఖలో ఉన్నతాధికారుల అండ ఉండటంతో ఆయన నేటికీ యథావిధిగా విధులకు హాజరవుతున్నారు. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములను కబ్జా చేయడం ఎంత నేరమో వాటిని కొనుగోలు చేయడమూ అంతే నేరం. జోగి కుటుంబసభ్యుల నుంచి 205 గజాలు చొప్పున పగిడిపాటి చైతన్యరెడ్డి కుటుంబసభ్యులు ఏడుగురు ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇంత జరిగినా ఈ ఉదంతంలో ఇంతవరకు జోగి కుటుంబ సభ్యులపై కానీ వారి నుంచి ఆ భూములను కొనుగోలు చేసిన విజయవాడ వైసీపీ కార్పొరేటర్ పగిడిపాటి చైతన్యరెడ్డి కుటుంబ సభ్యులపై కానీ ఎలాంటి కేసులు నమోదు కాకపోవడం గమనార్హం.

పులిచింతలకు జలకళ

ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం

పులిచింతలకు నీటి 'చింత' తీరుతోంది. అట్టడుగుకు పడిపోయిన నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నీటి కరువుతో ఉన్న ప్రాజెక్టుకు జలకళ వస్తోంది. నాగార్జునసాగర్ నుంచి 3.71 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు వచ్చిన ఈ నీటి నుంచి లక్షా 3 వేల 290 క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజీ వైపునకు వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు మొత్తం 24 గేట్లు ఉండగా ఆరు గేట్లను 2.5 మీటర్ల మేరకు ఎత్తారు.



పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్ నుంచి 3.71 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- ప్రస్తుత నీటి నిల్వ 22.74 టీఎంసీలు
- ఇన్‌ఫ్లో పెరగడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- దిగువకు 1.3 లక్షల క్యూసెక్కులు విడుదల
- ఆరు గేట్లను 2.5 మీటర్లు ఎత్తిన అధికారులు

ఆంధ్రజ్యోతి - విజయవాడ/ జగ్గయ్యపేట రూరల్ : పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం చేసిన తర్వాత రెండోసారి నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరాయి. 2019లో మొదటిసారిగా డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు. నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలకు ముందు ప్రాజెక్టులో 1.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు 3.61 టీఎంసీలు ఉంటే డెడ్ స్టోరేజ్‌గా పరిగణిస్తారు. ఈ ఏడాది నీటి నిల్వలు దీన్ని దాటుకుని కిందికి దిగిపోయాయి. తూర్పుడెల్టాకు నీటిని విడుదల చేయడానికి ఇటు ప్రకాశం బ్యారేజీ, అటు పులిచింతల ప్రాజెక్టులో నిల్వలు లేకపోవడంతో పట్టిసీమ నుంచి గోదావరి నీటిని తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం బ్యారేజీలో నీటి నిల్వలు తగ్గినప్పుడు పులిచింతల నుంచి నీటిని విడుదల చేసుకునే పరిస్థితి ఉండేది. గడిచిన ఐదారేళ్లలో పులిచింతల నీటి చింతను ఎదుర్కొంది. కృష్ణా నీటి యాజమాన్య బోర్డు ఆదేశాలతో నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేసినా అది స్టోరేజీకి సరిపోయింది. ఆ నీటితో ఉమ్మడి కృష్ణాజిల్లా తాగు, సాగునీటి అవసరాలను తీర్చారు. గడచిన వ్యవసాయ సంవత్సరంలో ఒక పంటకు మాత్రమే సాగునీటిని అందజేశారు.

● పెరుగుతున్న నీటి సామర్థ్యం

పులిచింతల ప్రాజెక్టులో జలకళ పెరుగుతోంది. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 45.77 టీఎంసీలు. నాగార్జునసాగర్ నుంచి వస్తున్న నీటితో ప్రాజెక్టులో నీటి నిల్వలు 22.74 టీఎంసీలకు చేరాయి. సాగర్ నుంచి ప్రస్తుతం 3.71 లక్షల క్యూసెక్కులు వస్తున్నా, ఇది బుధవారం నాటికి 4 లక్షల క్యూసెక్కులు దాటవచ్చని పులిచింతల ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటి నిల్వలు 45.77 టీఎంసీలకు చేరతాయని అధికారులు స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతోపాటు జలవిద్యుత్ కేంద్రం నుంచి మరో 5600 క్యూసెక్కుల నీరు పులిచింతలకు చేరుతోంది.

పైకి లేచిన బ్యారేజీ గేట్లు

పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజీ గేట్లను మంగళవారం అర్ధరాత్రి ఎత్తారు. బ్యారేజీలో ప్రస్తుత నీటిమట్టం 10.6 అడుగులు ఉంది. 2.72 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 12 అడుగులు. పూర్తి నీటి సామర్థ్యం 3.07టీఎంసీలు. నీటి నిల్వలు పూర్తిస్థాయికి చేరుకోవడానికి ఇంకా 0.35 టీఎంసీల నీరు అవసరం. పట్టిసీమ నుంచి వచ్చిన గోదావరి నీరు, తెలంగాణలో కురిసిన వర్షాలకు వాగుల ద్వారా వచ్చిన వరదతో బ్యారేజీలో నీటి నిల్వలు 2.72 టీఎంసీలకు చేరుకున్నాయి. పులిచింతల ప్రాజెక్టు నుంచి మంగళవారం లక్షా 3 వేల 290 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజీ గేట్లను అర్ధరాత్రి ఎత్తారు.

ముక్త్యాల వద్ద కృష్ణానది వరద ప్రవాహం



లోతట్టు ప్రజలు జాగ్రత్త

- సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి
- వీఎంసీ కమిషనర్

చిట్టినగర్ : ప్రకాశం బ్యారేజీ ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తున్నందున బ్యారేజీకి దిగువన లోతట్టు ప్రాంతాలు, నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నారని, ఈ నీటిని ప్రకాశం బ్యారేజీ ద్వారా కిందికి విడుదల చేస్తారని అన్నారు. నది పరివాహక ప్రదేశం, లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వీఎంసీలో ప్రజల కోసం 24/7 కంట్రోలు రూం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ మూడు షిఫ్టుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు తమ సమస్యలపై 81819 60909, 0866 242785, 2424172లకు తెలియజేయాలన్నారు.

వరద ప్రవాహంతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వచ్చే నీటితో ప్రకాశం బ్యారేజీ జలకళను సంతరించుకుంది. అయినా ప్రకాశం బ్యారేజీ దిగువన నదీ పరివాహక ప్రాంత కోడూరు, నాగాయలంక మండలాల్లోని రైతులు మాత్రం ఆందోళనలో ఉన్నారు. కరకట్టలు బలహీనంగా ఉండటమే దీనికి కారణం. అధికంగా వర్షాలు పడే శ్రావణం, భాద్రపదం, ఆశ్వయుజం మాసాలు రాకముందే ఎగువన ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. వచ్చే మూడు నెలల్లో వర్షాలు కురిసి భారీ వరదలు వస్తే కరకట్టలు తట్టుకునే పరిస్థితి లేదు. గ్రామాలపై వరద విరుచుకుపడే ప్రమాదముందని భయాందోళనలు నెలకొన్నాయి.

కరకట్టల భయం

కోడూరు, నాగాయలంక మండలాల్లో బలహీనంగా కరకట్టలు



ఉల్లిపాలెం గ్రామం వద్ద కోతకు గురైన కరకట్ట

- * ఇప్పటికే నిండిపోయిన ఎగువ ప్రాజెక్టులు
- * బ్యారేజీకి చేరుతున్న వరద నీరు
- * వచ్చే మూడు నెలల్లో భారీ వర్షాలు పడితే ప్రమాదమే
- * బలహీనంగా ఉండటంతో వరదను తట్టుకోలేని కరకట్టలు
- * కృష్ణా పరివాహక ప్రాంత ప్రజల్లో భయాందోళనలు

అవనిగడ్డ : మహాబలేశ్వరంలో పుట్టి అనేక ఆనకట్టలు దాటుకుని లక్షలాది ఎకరాల భూమిని సస్యశ్యామలం చేస్తూ బెజవాడలోని ప్రకాశం బ్యారేజీని చేరుకుంది కృష్ణమ్మ. అక్కడి నుంచి ఎలాంటి అడ్డంకులూ లేకుండా 70 కిలోమీటర్లు ప్రయాణించి కోడూరు, నాగాయలంక మండలాల్లో సాగరంతో సంగమిస్తుంది. 1964, 94 కాలంలో వచ్చిన వరదల కారణంగా ఏర్పడిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు విజయవాడ దిగువన కృష్ణానదికి అటు, ఇటు పరివాహక ప్రాంతాల్లో కరకట్టలు నిర్మించారు. వరదల వల్ల నష్ట తీవ్రతను తగ్గించేలా చర్యలు తీసుకున్నారు. విజయవాడ నుంచి పులిగడ్డ వరకు కరకట్టను వాహనాలను తిరిగేందుకు అనుగుణంగా ఏర్పాటు చేశారు. పులిగడ్డ దగ్గర నుంచి నాగాయలంక మండలం గుల్లలమోద, కోడూరు మండలం హంసలదీవి వెళ్లే కరకట్టలను మాత్రం బలంగా నిర్మించలేదు.

ఉల్లిపాలెం, టి.కొత్తపాలెంలో ప్రమాద ఘంటికలు

సాగర సంగమానికి దగ్గరలో ఉండే ఉల్లిపాలెం వద్ద కరకట్ట వరదల ప్రవాహం కారణంగా కోతకు గురైంది. దీనికితోడు సముద్రపు బ్యాక్ వాటర్ ద్వారా వచ్చే అటుపోట్లు, అలల కారణంగా నిత్యం కరకట్ట ప్రాంతం నీటిలో నానుతూ ఉంటోంది. గడిచిన ఐదేళ్లలో ఏటా వరదలు వచ్చినప్పటికీ తూతూ మంత్రపు చర్యలతోనే సరిపుచ్చారు. ఇప్పుడు ఉల్లిపాలెం ప్రాంతంలో దాదాపు నది కోతకు గురై కరకట్టకు కొద్ది గజాల దూరానికే వచ్చి చేరింది. ఏ మాత్రం వరద పెరిగినా కరకట్టను బలహీనపడి ఉల్లిపాలెం, హంసలదీవి ప్రాంతాల్లో పెను నష్టం సంభవించే ప్రమాదం ఉంది. నాగాయలంక మండలం టి.కొత్తపాలెం సమీపానికి వచ్చే సరికి నది ప్రవాహ గమనం ఒక్కసారిగా మారిపోవటంతో ఆ ప్రాంతంలో వరదల తాకిడికి, సముద్రపు ఆటుపోట్ల కారణంగా వచ్చే అలల తాకిడికి కరకట్ట వరకు భూమి పూర్తిగా కోసుకుపోయింది. గతంలో కరకట్టకు, నదికి మధ్య దాదాపు 100 గజాలకుపైగా దూరం ఉండేది. నేడు కేవలం నాలుగైదు గజాల దూరానికి మాత్రమే పరిమితమైపోయింది. ఇప్పటికే వర్షాల కారణంగా కరకట్ట పైభాగంలో అక్కడక్కడా ఓలలు ఏర్పడ్డాయి. 2009లో ఓలేరులో కరకట్ట తెగిపోవటానికి ఇలాంటి స్వల్పమైన ఓలలే కారణమని రైతులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టులన్నీ ఇప్పటికే జలకళను సంతరించుకుని నిండుకుండలా నీటితో తొణికిసలాడుతున్న నేపథ్యంలో ఇంకా ముసురు వర్షాలు కూడా ప్రారంభం కానందున ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లోనూ పెద్దఎత్తున వరదలు వచ్చే పరిస్థితి ఉందని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. వరదలు ఒక్కసారిగా ముంచెత్తే పరిస్థితి రానివ్వకుండా కొద్దికొద్దిగా నీటిని విడుదల చేసుకునేలా ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనికన్నా కరకట్టలను బలోపేతం చేస్తే మేలని ప్రజలు కోరుతున్నారు.

కరకట్టల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

కోడూరు, నాగాయలంక మండలాల్లో కరకట్టలు బలహీనంగా ఉన్నచోట కట్టను పటిష్టపర్చేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వరదలను ముందే ఊహించి ఆ ప్రాంతాల్లో ఇసుకతో నిండిన గోదాములను సిద్ధం చేస్తున్నాం. ప్రాజెక్టులన్నీ నిండిపోయి ఉండటంతో వరదలు వచ్చే పరిస్థితి మాత్రం తప్పనప్పటికీ ఎలాంటి నష్టం జరుగకుండా ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం.

- రావెళ్ల రవికిరణ్, డీఈ, ఇరిగేషన్

ఆర్డీవో పోస్టింగ్‌లపై కసరత్తు

సమర్థులకే కట్టబెడతారా?

- పోస్టులపై భారీ అవినీతి ఆరోపణలు
- జాబితా వస్తే కానీ తేలని గుట్టు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తహసీల్దార్ల బదిలీలు ముగిసిన క్రమంలో ఇక ఆర్డీవోల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఆర్డీవోల బదిలీల వ్యవహారాలు జీఏడీ చూస్తోంది. ఆర్డీవోలు కూడా తాము చెప్పే వారికే ఇవ్వాలని ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నప్పటికీ జీఏడీ ఆ చాన్స్ ఇవ్వటం లేదు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సమర్థులైన వారికి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టుగా కొందరు ప్రజా ప్రతినిధులకు జీఏడీ పెద్దలు చెప్పినట్టుగా తెలుస్తోంది. దీంతో ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకున్నవారి పరిస్థితి అయోమయంగా మారింది. మండలాల స్థాయిలో అవినీతిని నిరోధించాలంటే ఆర్డీవోల స్థాయిలో ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నడుచుకునే సమర్థులే కావాల్సిన అవసరం ఉంది. అయితే జీఏడీ పెద్దలపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. ఆర్డీవో పోస్టు కావాలంటే రూ.15 లక్షలు పలుకుతోందన్న విమర్శలు కూడా వస్తున్నాయి. గతంలో వివిధ శాఖల నుంచి వచ్చి రెవెన్యూను విడిచిపెట్టిపోకుండా ఆర్డీవోలుగా, డీఆర్వోలుగా పదవులు అనుభవిస్తున్నవారు ఉన్నారు. సమర్థులైన వారినే నియమిస్తామని చెబుతున్న జీఏడీ పెద్దలు వారిని వారి సొంత శాఖలకు పంపుతారో, తిరిగి వారికే కేటాయిస్తారో వేచి చూడాల్సిందే. ఒకవేళ వారికే మళ్లీ పోస్టింగులు ఇస్తే రివర్స్ పోస్టింగులు ఇచ్చినట్టే.

ప్రాణాలు విడిచిన మరో కార్మికుడు

సిమెంట్ కర్మాగార ప్రమాదంలో ఐదుకు చేరిన మృతులు



గుగులోతు గోపీనాయక్ (ఫైల్)

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 6 : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ అపోలో డీఆర్‌డీవోలో చికిత్స పొందుతున్న గుగులోతు గోపీనాయక్ (34) సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన కూలీల సంఖ్య ఐదుకు చేరింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మంగళవారం సాయంత్రం బూదవాడలోని బంధువులకు అప్పగించారు. గోపీనాయక్ కర్మాగారంలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో గాయపడిన 16 మందిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ సమీపంలోని ఆంధ్ర, మణిపాల్ ఆస్పత్రుల్లో వారికి వైద్యం అందించారు. ఆయా ఆస్పత్రుల్లో నలుగురు మృతి చెందారు. గోపీ నాయక్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం ఇటీవల హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.

● కుటుంబ నేపథ్యం

బూదవాడ గ్రామానికి చెందిన బాలాజీ, రమణల కుమారుడు గోపీనాయక్ పెద్దగా చదువుకోలేదు. కుటుంబ పోషణ నిమిత్తం కూలి పనులకు వెళ్తుంటాడు. గ్రామంలో సిమెంట్ కర్మాగారం నిర్మించటంతో అందులో రోజువారీ కూలీగా వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రోజా, కుమారుడు కళ్యాణ్, కుమార్తె మల్లిక, తల్లిదండ్రులు ఈయనపై ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబానికి ఆసరగా ఉన్న కుమారుడి మృతితో చిన్నారులను ఎలా పోషించాలో అర్థం కావటం లేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

35 మందిని బదిలీ చేస్తూ ఆదేశాలు ● రేంజ్‌కు 13 మంది సరెండర్

పోలీసు కమిషనరేట్‌లో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. మొత్తం 35 మందిని బదిలీ చేస్తూ కమిషనర్ రాజశేఖరబాబు మంగళవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం చేసిన బదిలీల్లో 53 మందితో తొలి జాబితా విడుదల చేశారు. తాజాగా 35 మందితో మలి జాబితాను ఇచ్చారు. ఈ బదిలీల్లో 13 మంది ఇన్‌స్పెక్టర్లను ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. - విజయవాడ

బదిలీల వివరాలు 6లో

ఇన్‌స్పెక్టర్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్టేషన్
1. ఎస్‌కే అహ్మద్ అలీ	సీసీఎస్	సూర్యారావుపేట
2. ఎస్ఎస్ఎస్‌వీ నాగరాజు	వీఆర్	కృష్ణలంక
3. ఎస్.చినకొండలరావు	వీఆర్	కొత్తపేట
4. కె.గిరిబాబు	వీఆర్	తిరువూరు
5. వై.బాలరాజాజీ	ఎస్ఈబీ	సత్యనారాయణపురం
6. డి.చవాన్	జెన్‌కో విజిలెన్స్	నందిగామ రూరల్
7. వైవీవీఎల్ నాయుడు	ఇంటెలిజెన్స్	నందిగామ టౌన్
8. డి.చంద్రశేఖర్	సీఐడీ	మైలవరం
9. ఎన్.మురళీకృష్ణ	సీసీఎస్	ట్రాఫిక్ 4
10. వై.సత్యరమేష్	సైబర్ క్రైం	ట్రాఫిక్ 2
11. కె.మహేంద్ర	ట్రాఫిక్ 2	ఏలూరు రేంజ్
12. డి.వెంకటరమణ	ఏలూరు రేంజ్	వీఆర్
13. ఎం.కిషోర్‌బాబు	వీఆర్	ట్రాఫిక్ 4
14. జీఆర్‌కే హనీష్‌బాబు	నందిగామ టౌన్	పీసీఆర్
15. ఎం.రామ్‌కుమార్	వీఆర్	సీసీఎస్
16. కె.శ్రీనివాస కుమార్	వీఆర్	సీసీఎస్
17. వి.దుర్గారావు	సూర్యారావుపేట	ఏలూరు రేంజ్
18. ఎం.వెంకట నారాయణ	సత్యనారాయణపురం	ఏలూరు రేంజ్
19. పి.చంద్రశేఖరరావు	నందిగామ రూరల్	సీటీఎఫ్
20. ఎం.సురేష్	ఇంటెలిజెన్స్	ట్రాఫిక్ 1
21. ఎ.ఉమామహేశ్వరరావు	వీఆర్	ట్రాఫిక్ 1
22. ఎ.చంద్రశేఖర్	సీటీఎఫ్	ఇబ్రహీంపట్నం
23. డి.ప్రసాదకుమార్	సీసీఎస్	ఏలూరు రేంజ్
24. చిత్రాడ గోపాలకృష్ణ	సీసీఎస్	ఏలూరు రేంజ్
25. బి.గుణరాము	వీఆర్	సైబర్ క్రైం
26. వి.వెంకటేశ్వరరావు	సీసీఎస్	ఏలూరు రేంజ్
27. సీహెచ్‌పీ కృష్ణంరాజు	కొత్తపేట	ఏలూరు రేంజ్
28. వి.కృష్ణ	పీసీఆర్	ఏలూరు రేంజ్
29. పి.జగదీశ్వరరావు	ట్రాఫిక్ 1	వీఆర్
30. డి.గోవిందరావు	ట్రాఫిక్ 2	ఏలూరు రేంజ్
31. జి.శంకరనాయక్	వీఆర్	ఏలూరు రేంజ్
32. ఎండీ అహ్మదున్నీసా	వీఆర్	ఏలూరు రేంజ్
33. ఐవీ నాగేంద్రకుమార్	వీఆర్	ఏలూరు రేంజ్
34. బి.నరసింహమూర్తి	కమిషనరేట్ అటాచ్‌మెంట్	ఏలూరు రేంజ్
35. టి.చంద్రశేఖర్	వీఆర్	సీసీఎస్

చిన్నారిపై లైంగిక దాడి అమానుషం

నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం: మంత్రి పార్థసారథి


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

పన్‌టౌన్, ఆగస్టు 6: అభం శుభం తెలియని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడటం అమానుషమని, దోషిని కఠినాతికఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని, ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఏలూరు జిల్లా, నూజివీడు రూరల్ మండలం, పల్లెర్లమూడి గ్రామంలో అత్యాచారానికి గురై విజయవాడ ప్రభుత్వ పాత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను, ఆమె కుటుంబ సభ్యులను మంగళవారం మంత్రి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. సంఘటన తెలిసిన వెంటనే దోషిని గుర్తించాలని జిల్లా యంత్రాంగాన్ని, పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనితలు వెంటనే స్పందించి పోలీసు అధికారులకు చేసిన ఆదేశాల మేరకు పోలీసు అధికారులు సంఘటన జరిగిన తీరు ఆధారంగా రెంటచింతల సమీపంలో దోషిని అరెస్టు చేశారన్నారు. అతని పై పోక్సో కేసు నమోదు చేశారని, భవిష్యత్తులో మరెవరూ ఇటువంటి సంఘటనలకు పాల్పడకుండా ఉండేందుకు కఠినాతి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి అవసరమైన తక్షణ సహాయాన్ని అందించామని, ప్రభుత్వ పర్వంగా అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే సమయంలో పారిశుధ్య పనులను పరిశీలించి రోగులకు వారి వెంట వచ్చే సహాయకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా మెరుగైన సౌకర్యాలు అందచేయాలని సూపరింటెండెంట్, అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వినాయక్, ఆర్ఎంఓ డాక్టర్ శోభ, డాక్టర్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం దార్శనికతకు అనుగుణంగా కార్యాచరణ

మాస్టర్ ప్లాన్ల ప్రకారం అభివృద్ధి పనులు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 6: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దార్శనికతకు అనుగుణంగా జిల్లాలో అన్ని శాఖల అధికారుల కార్యాచరణ ఉండాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన స్పష్టం చేశారు. మంగళవారం ఆమె జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, డీఆర్‌వో వి.శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. సోమవారం సీఎం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో చర్చించిన కీలక అంశాలతో పాటు సీఎం, ఉప ముఖ్యమంత్రి చేసిన సూచనలను కలెక్టర్ వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య ఆరోగ్యం, సహజ వనరులు, సంక్షేమం, గృహ నిర్మాణం, ఇలా శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో భవిష్యత్తు ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకొని అధికారులు సమన్వయంతో, అధికారులకు సరైన మార్గనిర్దేశనం చేస్తూ లక్ష్యాలను చేరుకొనేందుకు కృషి చేయాలన్నారు.



ఈ-పంట బుకింగ్‌పై దృష్టి సారించాలి

లక్ష్యాలకు అనుగుణంగా ఈ ఖరీఫ్ వివిధ పంటల సాగు విస్తీర్ణం ఉండేలా చూడాలని, సెప్టెంబరు 15 నాటికి ఈ-పంట బుకింగ్‌ను పూర్తి చేయాల్సి ఉన్నందున తగిన కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. సాధించాల్సిన లక్ష్యాలతో పాటు ప్రకృతి వ్యవసాయం, యువతలో నైపుణ్యాల పెంపు, ధరల నియంత్రణ, గృహ నిర్మాణ లక్ష్యాలపై కలెక్టర్ మార్గనిర్దేశనం చేశారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు సాగుచేసిన పంటల వివరాలను పూర్తిస్థాయిలో ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ, వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు పంటసాయం, పంట నష్టరిహారం, పంటల బీమా, ఇతరత్రా ప్రభుత్వ పథకాలు అందాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరన్నారు. ఈ-క్రాప్‌ను తూతూమంత్రంగా చేయవద్దని, రైతులు ఒక రకం పంటసాగుచేస్తే మరోపంటను సాగుచేసినట్టు నమోదుచేస్తే సహించేది లేదన్నారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో వివిధ దశల్లో పరిశీలన చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి పద్మావతి, డీడీ మనోహర్, ఏడీలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో మంగళవారం జేసీ గీతాంజలిశర్మతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేయడంతోపాటు, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వాటర్‌ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్‌ను పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. దేశభక్తిని చాటుతూ పాఠశాల విద్యార్థులతో నృత్యప్రదర్శనలు, ప్రభుత్వ పథకాలను తెలియజేస్తూ శకటాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రసంగంలో వివిధ శాఖల ప్రగతి నివేదికను తెలియజేస్తారని అధికారులు తమ నివేదికలు పంపాలన్నారు. ఏఎస్పీ టీవీడీ ప్రసాద్, ఆర్డీవో ఎం వాణి, డీఎస్‌వో పార్వతి, డీఎంహెచ్‌వో గీతాభాయి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, డీఈవో తాహెరాసుల్తానా, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.




పొంగి పొర్లుతున్న వాగు

పొంగిపొర్లుతున్న లింగగూడెం గండివాగు

పెనుగంచిప్రోలు, ఆగస్టు 6: మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి మండలంలోని లింగగూడెం గండివాగు పొంగి పొర్లింది. గ్రామానికి ఎగువన పెద్ద ఎత్తున వర్షం పడటంతో లింగగూడెం-పెనుగంచిప్రోలు గ్రామాల మధ్య ఉన్న గండి వాగు 2, 3 గంటలపాటు పొంగింది. దీంతో దాదాపు 3,4 గంటల మేర రహదారిపై ప్రయాణాలు నిలిచిపోయాయి. వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మధ్యాహ్నం నుంచి రాకపోకలు మొదలయ్యాయి. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఎస్ఐ పి.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ చేపట్టారు.

తైక్వాండో పోటీల్లో మెరిసిన గ్రామీణ కుసుమం

● రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్, జాతీయ పోటీలకు ఎంపిక



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 3,4 న జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మండలంలోని జూపూడి గ్రామానికి చెందిన కలతోటి రమేష్‌బాబు కుమార్తె కలతోటి దామిని మొదటిస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఈనెల 8,9న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు దామినిని ఎంపిక చేశారు. ఆమె విజయవాడలోని డాన్‌బోస్కో స్కూల్లో టెన్త్ చదువుతోంది. ఉమ్మడి జిల్లా కార్యదర్శి అంకమ్మరావు దామినికి కోచ్‌గా వ్యవహరించారు. జాతీయ పోటీలకు ఎంపికైన దామినిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందిస్తున్నారు. అక్కడ కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రామంతో పాటు రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

తిరువూరు ఆర్టీసీ డ్రైవర్ల నిజాయితీ


ప్రయాణికురాలికి బ్యాగ్ అందజేస్తున్న డ్రైవర్లు

తిరువూరు, ఆగస్టు 6: బస్సులో విలువైన వస్తువులున్న బ్యాగ్ మర్చిపోయిన ప్రయాణికురాలికి బ్యాగ్‌ను తిరిగి అందించి తిరువూరు ఆర్టీసీ బస్సు డ్రైవర్లు నిజాయితీని నిరూపించుకున్నారు. స్థానిక డిపోనుంచి ఈనెల 4న సాయంత్రం 4.15 గంటలకు మంత్రాలయం వెళ్లే బస్సులో గుంటూరు జిల్లాకు చెందిన సీహెచ్ వీరలక్ష్మి, విజయవాడలో బస్సు ఎక్కి కర్నూలులో దిగింది. కొంతసేపటికి బ్యాగ్ కనిపించకపోవడంతో, తిరువూరు ఆర్టీసీ ఎంక్వయిరీకి ఫోన్‌చేసి డ్రైవర్ల నెంబరు తీసుకొని వారికి ఫోన్‌చేసి సీటు నెంబరు చెప్పి బ్యాగ్ మిస్సయిన సంగతి చెప్పడంతో డ్యూటీలో ఉన్న డ్రైవర్ బస్సులో వెదికి బ్యాగు ఉన్నట్టు తెలిపారు. బస్సు తిరుగు ప్రయాణంలో కర్నూలు-1 డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి సమక్షంలో డ్రైవర్లు బి.అంకమారావు, కె.భాస్కరరావు ఆమెను విచారించి, రూ.3500 నగదు, సుమారు రూ.లక్ష విలువైన బంగారు నానుతాడున్న పర్సును అందించారు. నిజాయితీగా వ్యవహరించిన డ్రైవర్లను ఆర్టీసీ డీఎం వేణు, సిబ్బంది, పలువురు కార్మికులు అభినందించారు.


అదుపులోకి తీసుకున్న నిందితులతో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది

గంజాయి కేసులో ఆరుగురి అరెస్టు

● 1.7 కేజీల గంజాయి స్వాధీనం

కూచిపూడి, ఆగస్టు 6: కూచిపూడి - మొవ్వ గ్రామాల మధ్యనున్న ఖాళీస్థలంలో గంజాయి సేవిస్తున్న ఆరుగురు యువకులను కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మొవ్వ మండలం వేములమడ గ్రామానికి చెందిన మురారి పవన్ కుమార్, కాసాని జ్ఞానసాయి, మొవ్వకు చెందిన పోలన రాహుల్, ఘంటసాల మండలం కొడాలి గ్రామానికి చెందిన గుమ్మడి ఆనంద్ బసవేశ్వర్, మోటుపల్లి సునీల్, గుడివాడకు చెందిన గూడవర్తి కిరణ్ కూచిపూడి - మొవ్వ గ్రామాల మధ్య ఉన్న ఖాళీప్రదేశంలో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి మధ్యవర్తుల సమక్షంలో వారిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి నుంచి 1.7 కేజీల గంజాయితోపాటు 10 మద్యం సీసాలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం వారిపై కేసు నమోదు చేసి మొవ్వ కోర్టుకు హాజరుపర్చగా, న్యాయమూర్తి నిందితులకు 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్టీటీపీఎస్‌లో సాంకేతిక లోపం

ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్‌లో మంగళవారం సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో 1,2,5వ యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 3,4 యూనిట్లలో వార్షిక మరమ్మతులు నిర్వహిస్తున్నారు. దీంతో 5 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 1నుంచి 3 దశల్లోని మొత్తం 6 యూనిట్లలో 1,320 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి గాను కేవలం ఆరో యూనిట్లో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. 1120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలిగింది. సాంకేతిక లోపానికి గల కారణాలను అధికారులు పరిశీలిస్తున్నారు. నాలుగో దశ ఏడవ యూనిట్‌లో 500 మెగావాట్లు, ఐదో దశ ఎనిమిదో యూనిట్‌లో 800 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

ఎన్టీఆర్ బీమాతో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం

● మంత్రి కొల్లు రవీంద్ర


వైద్య శిబిరంలో మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 6: ఎన్టీఆర్ వైద్య సేవల కింద బీమా పద్ధతిలో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే పాలసీని సీఎం చంద్రబాబు త్వరలో ప్రకటించనున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం పోతేపల్లి జ్యూయలరీ పార్కులో మంగళవారం జరిగిన ఉచిత వైద్య సేవా శిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ ఆహార అలవాట్లను సక్రమంగా నిర్వర్తించాలని, కాలుష్య నియంత్రణ నిర్వహిస్తే చక్కని ఆరోగ్యం లభిస్తుందన్నారు. మచిలీపట్నం నగర ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఆదివారం బీచ్‌లో ప్రత్యేక యోగ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వివిధ సాంస్కృతిక, స్వచ్ఛంద సేవాసంస్థలను, అసోసియేషన్లను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. జ్యూయలరీ పార్కు యాజమాన్యం ఈ తరగతుల నిర్వహణకు ముందుకు రావాలన్నారు. ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా 100 అన్న కాంటీన్లను ప్రారంభిస్తున్నామన్నారు. మచిలీపట్నం బైపాస్ రోడ్డులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. స్టార్ కళాశాల ప్రిన్సిపాల్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి.శ్రీరాం అధ్యక్షత వహించిన ఈ శిబిరంలో జ్యూయలరీ పార్కు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చలమలశెట్టి నరసింహారావు, అధ్యక్షుడు పి.సుబ్బారావు, కార్యదర్శి వడ్డి జితేంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నేతలు కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచే నాని, తలారి సోమశేఖర్, కాటం మధు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, లంకే శేషగిరి, కాగిత గోపాలరావు, బీపీసీ కరుణకుమార్, జనసేన నేతలు మాదివాడ రాము, కర్రి మహేష్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ సచివాలయాల్లో ఇసుక బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్ల మాయంపై విచారణ జరిపించి తగిన చర్యలు చేపడతామన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల స్వీకరణ

మచిలీపట్నం టౌన్: జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయవచ్చన్నారు. డిసెంబరు 8న జరిగే ఈ పరీక్షకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 సెప్టెంబరు 6లోగా చెల్లించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

తాళం వేసిన బడ్డీకొట్టులో మృతదేహం

మచిలీపట్నం టౌన్: స్థానిక మహిళా పోలీసు స్టేషన్‌కు దగ్గరలో తాళం వేసి ఉన్న బడ్డీకొట్టులో మృతదేహాన్ని చిలకలపూడి పోలీసులు కనుగొన్నారు. ఎస్ఐ యు.ఎల్. సుబ్రహ్మణ్యం అందించిన వివరాలిలా ఉన్నాయి. బలరామునిపేటకు చెందిన బత్తిన శ్రీనివాస్ (42) నాలుగేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. దివ్యాంగుడైన శ్రీనివాస్ ఒక బడ్డీని అద్దెకు తీసుకుని చిరు వ్యాపారం చేస్తున్నాడు. 1న పించను తీసుకున్న తరువాత అద్దెకు తీసుకున్న బడ్డీలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పదేళ్ల క్రితం శ్రీనివాస్ భార్య, పిల్లలు వదిలి వెళ్లిపోగా బలరామునిపేటలో తల్లివద్ద జీవిస్తున్నాడు. 4 రోజులుగా బడ్డీలో దుర్వాసన వస్తుండటంతో మునిసిపల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఆధ్వర్యంలో కార్పొరేషన్ సిబ్బంది బడ్డీకొట్టు తెరవగా బత్తిన శ్రీనివాస్ మృతదేహంగా గుర్తించారు. 6 రోజులుగా ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు చెప్పారు. ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. అయితే శ్రీనివాస్ మృతికేసును ఆత్మహత్య కేసుగా చిలకలపూడి పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీడ్రైవర్ మృతి



జగ్గయ్యపేట రూరల్: జాతీయ రహదారిపై అనుమంచిపల్లి - షేర్‌మహ్మద్‌పేట వై జంక్షన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని పట్టణంలోని చింతలతోపుజూకు చెందిన లారీ డ్రైవర్ కాట్రగడ్డ సైదేశ్వరరావు (34) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడ నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన కోదాడ నుంచి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జలవనరుల శాఖ ఎస్ఈ బదిలీ

విజయవాడ: జలవనరుల శాఖ ఎస్ఈగా ఉన్న టీజేహెచ్ ప్రసాద్‌బాబు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో స్పెషల్ డివిజన్ ఈఈ పి.గంగయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రసాదబాబును జలవనరుల శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. తూర్పు సబ్‌డివిజన్ డీఈగా ఉన్న కొడాలి బాబుకు తూర్పు డివిజన్ ఈఈగా అదనపు బాధ్యతలను అప్పగించారు.

మచిలీపట్నం - రేపల్లె

రైలుమార్గం నిర్మించండి

● ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-రేపల్లె మధ్య నూతన రైల్వేలైన్ నిర్మాణానికి అనుమతులివ్వాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. న్యూఢిల్లీలో మంగళవారం రైల్వేశాఖ మంత్రిని ఎంపీ బాలశౌరి కలిసి మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారన్నారు. మచిలీపట్నం, గుడివాడ, విజయవాడ మీదుగా తెనాలికి చేరుకోవాలంటే 145 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, మచిలీపట్నం-రేపల్లె రైలుమార్గాన్ని నిర్మాణం చేస్తే కేవలం 45 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందన్నారు. కోస్తాతీరం వెంబడి రాకపోకలు సాగించే రైళ్లను మళ్లించవచ్చని, దీంతో విజయవాడ జంక్షన్‌పై రద్దీ తగ్గుతుందన్నారు. మచిలీపట్నం-ధర్మవరం వరకు తిరుపతి మీదుగా వెళ్లే రైలును గతేడాది సెప్టెంబరులో నిలిపేశారని, ఈ రైలును తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం పునరుద్ధరించాలని కోరారు. మచిలీపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లను చిలకలపూడి, వడ్లమన్నాడు స్టేషన్లలో నిలిపేలా అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ బాలశౌరి కోరారు.


రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు రైల్వేలైన్ గురంచి వివరిస్తున్న ఎంపీ బాలశౌరి


కేంద్ర విద్యాశాఖ మంత్రికి వివరాలు చెబుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

నందిగామ, నూజివీడులో కేంద్రీయ విద్యా సంస్థలను

ఈ ఏడాదే ప్రారంభించండి

కేంద్ర మంత్రి ధరేంద్ర ప్రధాన్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజ్ఞప్తి

విద్యాధరపురం ఆగస్టు 6: నందిగామ, నూజివీడులో ఈ ఏడాది నుంచే కేంద్రీయ విద్యాసంస్థలను ప్రారంభించి, తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంగళవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రిని ఢిల్లీలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గతేడాది సెప్టెంబర్ 22న పబ్లిక్ ఇన్వెస్టెమెంట్ బోర్డు సమావేశంలో నందిగామ, నూజివీడులో కేంద్రీయ విద్యాలయాలు మంజూరైనట్టు చెప్పిన విషయాన్ని ఎంపీ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాత్కాలిక భవనాల లభ్యతపై నివేదిక పంపమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను కేంద్ర విద్యాలయ సంఘటన్ కోరిందన్నారు. ఆ మేరకు సికింద్రాబాద్‌లోని పికెట్‌లోగల డిప్యూటీ రీజనల్ కమిషనర్ నివేదిక పంపారన్నారు. అదే నివేదిక ప్రస్తుతం న్యూఢిల్లీలోని కేంద్ర విద్యాలయ సంఘటన్ వద్ద ఉందని ఎంపీ శివనాథ్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈమేరకు విద్యామంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు.

గుడివాడ-కంకిపాడు రహదారిని

అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే వెనిగండ్ల


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ: గుడివాడ-కంకిపాడు రహదారి అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారుల్లో ఉన్న గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రహదారుల అభివృద్ధికి, మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రత్యేకంగా ఏఎన్ఆర్ కళాశాల నుంచి వెంట్రప్రగడ వరకు రూ.5కోట్లతో రివిట్‌మెంట్‌తో రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. వెంట్రప్రగడ నుంచి నందమూరు వరకు రహదారి మరమ్మతులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి ఉపాధి హామీ నిధులను ఉపయోగిస్తామన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులతో ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఇబ్బందులు పడకూడదనే నేషనల్ హైవేలో విలీనం చేయాలని ప్రతిపాదనలు రూపొందించామని, కేంద్ర మంత్రి గడ్కారీ విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే ఎంపీ బాలశౌరి సహకారంతో రహదారి విలీన ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసరావు, డీఈ కామేశ్వరరావు, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

నిమ్మకూరులో కీచక ఉపాధ్యాయుడి అరెస్టు

● విద్యార్థుల పట్ల లైంగిక వేధింపులు, అసభ్యకర ప్రవర్తన ● పోక్సో చట్టం కింద కేసు నమోదు

పామర్రు, ఆగస్టు 6: ఏడవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ ఓ ఉపాధ్యాయుడిపై వచ్చిన ఫిర్యాదు మేరకు పామర్రు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని నిమ్మకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దాసరి వెంకట రాజేశ్వరరావు (58) తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పామర్రు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి మంగళవారం పాఠశాలలో విచారణ జరిపారు. తమతో కూడా అభ్యంతరకరంగా ఆ ఉపాధ్యాయుడు ప్రవర్తించాడని మరి కొందరు విద్యార్థినులు వెల్లడించడంతో ఆ ఉపాధ్యాయుడిపై పోలీసులు పోక్సో కేసుపెట్టి అరెస్టుచేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థినిపై గతేడాది జూలైలో కొందరు యువకులు సామూహిక అఘాయిత్యానికి పాల్పడటం, అనంతరం ఆ విద్యార్థిని కాలువలో శవమై కనిపించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువక ముందే నేడు అదే పాఠశాలలో ఇలాంటి సంఘటన జరగటంపై పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశాం: డీఈవో



నిమ్మకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి అరెస్టు అయిన తెలుగు ఉపాధ్యాయుడిపై డీవైఈవో అందించిన నివేదిక ప్రకారం అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెరా సూల్తానా మంగళవారం విలేకర్లకు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.30

లయోలలో సెక్యూరిటీ సిస్టమ్స్‌పై అవగాహన సదస్సు

భారతీనగర్, ఆగస్టు 6: ఆంధ్రా లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం సెక్యూరిటీ సిస్టమ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎఫ్‌ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ బి. సాంబిరెడ్డి పాల్గొని బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు సాంకేతికత, సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంశాలను తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ఈసీఈ విభాగధిపతి కె. ప్రశాంతి జాస్మిన్, ఈఈఈ విభాగాధిపతి నవీన్ కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌వైజర్‌కు సూచనలిస్తున్న సీఎంహెచ్‌వో డాక్టర్ పి.రత్నావళి

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించండి

చీఫ్ మెడికల్ అధికారిణి డాక్టర్ రత్నావళి

చిట్టినగర్, ఆగస్టు 6: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ. రత్నావళి శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం వనటౌన్ పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పలుచోట్ల డ్రైయిన్లలో చెత్త వ్యర్థాలు పేరుకుపోవడం గమనించి వెంటనే పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, డ్రైయిన్‌లలో మురుగు, వర్షం నీరు సక్రమంగా పారుదల జరిగేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, రోడ్ల వెంబడి వర్షంనీరు నిల్వకుండా చూడాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మర్యాద పూర్వక కలయిక

పటమట, ఆగస్టు 6 : విజయవాడ సెంట్రల్ ఏసీపీగా దామోదర్, పటమట సీఐగా పవన్ కిషోర్‌లు నూతనంగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా టీడీపీ నాయకులు, యువ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ మంగళవారం వారిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం నజీర్ తమ సంస్థ ద్వారా తాము నిర్వహించిన పలు సామాజిక కార్యక్రమాలను వారికి వివరించారు. యునైటెడ్ ముస్లిం మైనార్టీ ఫోర్స్ అధ్యక్షుడు మొహమ్మద్ సుభానీ, సగ్గుర్తి వంశీ, శిరీష్‌లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

వన్‌టౌన్ ఆగస్టు 6: పొట్టపై కణితి వ్యాధితో బాధపడుతున్న 52వ డివిజన్ ఉప్పర వాగుకు చెందిన శీలం కుమార్‌కు కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. కుమార్ తల్లి అభ్యర్థన మేరకు ఉమ్మడి వెంకటేశ్వరరావు చొరవ తీసుకుని విషయాన్ని, ఎంపీ, ఎమ్మెల్యేలకు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వన్‌టౌన్ సీఐగా గురుప్రకాష్ బాధ్యతల స్వీకారం



వన్‌టౌన్, ఆగస్టు 6: విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా గురు ప్రకాష్ నియామకమయ్యారు. మంగళవారం ఆయన స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఇంద్రకీలాద్రి పై దుర్గమ్మను దర్శించుకున్నారు.

ఆడపిల్లలకు రక్షణ కరువు

● మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి దుర్గాంబ

భవానీపురం, ఆగస్టు 6: సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకపోవడం సిగ్గు చేటని, రాష్ట్రంలో ఆడపిల్ల పుడితే భయపడే పరిస్థితి నెలకొందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, వావి వరసలు మర్చిపోయి పసిపిల్లలపై అత్యాచారం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై శాశ్వత పరిష్కారం చేసే పరిస్థితి లేదని, లైంగిక నేరాల నియంత్రణను నిరంతరం పర్యవేక్షించే ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, పాలకులపై ఉందన్నారు. పసిపిల్లలకు భద్రత కల్పించాలని మహిళా సమాఖ్య ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నామని దుర్గాంబ తెలిపారు.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

వన్‌టౌన్, ఆగస్టు 6: బీసెంట్‌రోడ్డు మోడరన్ సూపర్ మార్కెట్ వద్ద పార్కింగ్ చేసిన బైక్ చోరీ కేసులో గవర్నర్‌పేట పోలీసులు జామి కిరణ్ రెడ్డిని మంగళవారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక గంగానమ్మ గుడివద్ద ఎస్. మాణిక్యరాజు సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతను నాలుగు రోజుల క్రితం బంధువుతో కలిసి సరుకులు కొనుగోలు చేయటానికి బీసెంట్ రోడ్డులోని మోడరన్ సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. తన బైక్‌ను సూపర్ మార్కెట్ వద్ద పార్కింగ్ చేసి మార్కెట్‌కు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత బైక్ వద్దకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు.

దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి కొత్తపేట, గొల్లపాలెంగట్టుకు చెందిన జామి కిరణ్ రెడ్డిని గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడిపై నగరంలోని పలు స్టేషన్లలో చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిపాలతోనే బిడ్డలకు ఆరోగ్యం

తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో డాక్టర్ శారద





ప్రసంగిస్తున్న డాక్టర్ శారద, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమా

రైల్వేస్టేషన్, ఆగస్టు 6: చంటి పిల్లలకు తల్లిపాలే అమృతమని వైద్యులు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం విజయవాడ రైల్వే ఆసుపత్రిలో ఓపీడీ బ్లాక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. జయదీప్ థీమ్‌ను వివరించారు.సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ గైనకాలజిస్టు డాక్టర్ శారద మాట్లాడుతూ తల్లిపాల విషయంలో ప్రజల నుంచి సాధారణంగా ఎదురయ్యే అపోహలను తొలగించారు. తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యమని అన్నారు. పాలిచ్చే తల్లులలో కేన్సర్ ప్రమాదం కూడా ఉండదని, ఇంకా ఇతర అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అసిస్టెంట్ చీఫ్ మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ డి. సీతారామ్ మాట్లాడుతూ శిశువులకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విజయవాడ డివిజన్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శౌరిబాల మార్గదర్శకత్వంలో నిర్వహించారు. తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తల్లి పాలతోనే రోగనిరోధక శక్తి పెంపు

● సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా

పాయకాపురం: చిన్నారులకు తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వాంబేకాలనీలో గర్భిణులకు, బాలింతలకు మంగళవారం తల్లిపాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి బొండా ఉమా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలతో నవజాత శిశువులకు కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. స్థానిక కార్పొరేటర్ కంచి దుర్గ, నేతలు ధనశేఖర్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే నాణ్యమైన విద్య : ఎమ్మెల్యే గద్దె

పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



విద్యార్థికి నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ప్రిన్సిపాల్ రవికుమార్

కృష్ణలంక, ఆగస్టు 6 : పిల్లల చదువులే ఆ కుటుంబానికి ఆస్తి అని, అలాంటి నాణ్యమైన చదువును టీడీపీ ప్రభుత్వం విద్యార్థులందరికీ అందిస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు పరిధిలోని కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత నోటు పాఠ్య పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరైన విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇంటర్ స్థాయిలో మధ్యాహ్న భోజనాన్ని చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని కూడా తీసివేశారని చెప్పారు. మళ్లీ ఆ పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రిని కోరామని ఆయన కూడా సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామన్నారు. కళాశాలకు అతి సమీపంలోనే అన్న క్యాంటీన్‌ను కూడా ప్రారంభించనున్నామని చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం అమలు చేయడం లేదా అన్న క్యాంటీన్ నుంచి నేరుగా విద్యార్థులకు అందించే విధంగా చూస్తామని గద్దె తెలిపారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గోరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, కేశనం భావన్నారాయణ, గోగుల రమేష్, జనసేన నాయకులు కొవ్వూరి కిరణ్‌బాబు, డీఈవో రెడ్డి, దాత దమ్మాలపాటి రంగారావు, ప్రిన్సిపాల్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

ఏపీఐఐసీ కాలనీలోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం

భారతీనగర్: ఏపీఐఐసీ కాలనీలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాల్గో డివిజన్ పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కోగంటి రామయ్య కల్యాణ మండపంలో స్థానిక పెద్దలు నిర్వహించిన కాలనీ సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పటమట సీఐ పవన్ కిషోర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, కాలనీ అధ్యక్షుడు పాతూరి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, రెడ్డి రాంబాబు, గద్దె రమేష్, పాల్గొన్నారు.

దౌర్జన్యంగా ఆస్తి పత్రాలు, నగదు ఎత్తుకెళ్లారు

● పోలీసులకు రిటైర్డ్ ఎస్సై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 6 : కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించి తన ఆస్తిపత్రాలు, నగదు, బంగారపు ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఓ రిటైర్డ్ ఎస్సై మంగళవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన చింత హేమచంద్ర ఎస్సైగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యాడు. పదిహేను ఏళ్ల క్రితం భార్య చనిపోవడంతో గత కొంత కాలంగా కుమారి అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఇరువురికి మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఈనెల 4న కుమారి తన ఇద్దరు కొడుకులతో కలిసి రిటైర్డ్ ఎస్సై హేమచంద్ర ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించారు. ఇంట్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్, ఎల్ఐసీ పత్రాలతో పాటు ఆస్తి పత్రాలను, బీరువాలో నగదు, బంగారపు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అకౌంట్స్‌లో పారదర్శకత

●ఏఎన్‌యూ ఆచార్యులు డాక్టర్ కనకదుర్గ



వన్‌టౌన్, ఆగస్టు 6: నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అకౌంట్స్‌లో మరింత పారదర్శకత లభిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఎ. కనకదుర్గ అన్నారు. కాకరపర్తి భావన్నారాయణ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఏ రోల్ ఆఫ్ ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ ఇన్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ అనే అంశంపై ఆ కళాశాల సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ ఎ.కనకదుర్గ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వలన అకౌంట్స్ రంగంలో మరింత వేగం చోటు చేసుకుంటుందన్నారు. ఈ క్రమంలో అకౌంటెంట్లకు పనిభారం చాలా వరకు తగ్గుతుందని వివరించారు. దీనిలో ఎదురయ్యే లోపాలను అధిగమించి మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే క్రమంలో మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు అధ్యక్షత వహించారు. విభాగాధిపతి హేమంత్, అధ్యాపకులు కె. ప్రకాష్, జయవర్ధన్, పాల్గొన్నారు.

ట్రాక్టర్లు, టిప్పర్లపై డ్యూటీలా!

మహిళా పారిశుధ్య కార్మికుల పాట్లు

సత్యనారాయణపురం, ఆగస్టు 6: మహిళా పారిశుధ్య కార్మికులకు ట్రాక్టర్లు, టిప్పర్లపైన డ్యూటీలు వేయడంతో నానా అవస్థలు పడుతున్నారు. సర్కిల్ టూ పరిధిలో చెట్లు కొట్టిన సమయంలో, సిల్టు తీసినప్పుడు, రోడ్డు మార్జిన్‌లో మట్టి తరలించేందుకు ట్రాక్టర్లు, టిప్పర్లను వాడుతుంటారు. చెట్లు కొట్టేసిన సమయంలో కొమ్మలతో పాటు, దుంగలు సైతం వారు వాటితో లోడు చేయాల్సి వస్తుంది.

బరువైన దుంగలు మెయలేక వారు పడే బాధలు వర్ణనాతీతం. మహిళలు టిప్పర్లు ఎక్కడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. 27వ డివిజన్ బావాజీపేటలో మంగళవారం శరభయ్యగుడి రోడ్డులో విద్యుత్ శాఖవారు కరెంటు తీగలకు అడ్డు వచ్చిన చెట్టు కొమ్మలను తొలగించారు. వాటిని ట్రాక్టర్లు, టిప్పర్లకు ఎత్తే బాధ్యతను మహిళలకు అప్పగించడంతో వారి పాట్లు వర్ణనాతీతం.

కనీసం వారు ట్రాక్టర్‌ను ఎక్కే పరిస్థితి లేదు. కొమ్మలు ట్రాక్టర్‌లోకి అతికష్టం మీది ఎక్కించిన తర్వాత స్థానికంగా ఉన్న నిచ్చెన సాయంతో ట్రాక్టర్ దిగుతున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లపైన డ్యూటీలను కేవలం మహిళలకే కాకుండా పురుషులకు వేయాలని కోరుతున్నారు.



నిచ్చెన సాయంతో ట్రాక్టర్ దిగుతున్న పారిశుధ్య కార్మికురాలు



కేక్ కట్ చేస్తున్న పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్

ఘనంగా పుట్టగుంట జన్మదిన వేడుకలు

కంకిపాడు, ఆగస్టు 6 : ప్రముఖ పారిశ్రామిక వేత్తపుట్టగుంట సతీష్ జన్మదిన వేడుకలు కంకి పాడు అయాన కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వమత ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, విజయ డైయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ జెడ్పీ చైర్మన్ గద్దె అనురాధ, ద్వారకా తిరుమల దేవస్థాన అనువంశిక ధర్మకర్త ఎస్‌వీఎన్ నివృతరావు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, విజయవాడకు చెందిన వివిధ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలతో పాట్లు

● నిల్వ ఉంటున్న వర్షపు నీరు
● పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడివిని తలపిస్తున్న వైనం
● విషజ్వరాలు ప్రబలుతాయనే భయాందోళనలో స్థానికులు
● కొరవడిన యజమానుల పర్యవేక్షణ

పాయకాపురం, ఆగస్టు 6 : పాయకాపురం ఉడాకాలనీ ప్రజలు ఖాళీ స్థలాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ ఏర్పడి దశాబ్దాల కాలం గడచినా ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ఎల్ఐజీ 1, ఎల్ఐజీ 2, ఈడబ్ల్యూఎస్, ఎంఐజీ తదితర ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలపై యజమానుల పర్యవేక్షణ లేకపోవడం, కొంత మంది యజమానులు వేరే ప్రాంతాల్లో ఉండటంతో సదరు ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులా మారాయి.

వర్షాకాలం వస్తే స్థలాల్లో పిచ్చిమొక్కలు, కంప పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు చేరడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారవుతున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, విషజ్వరాల ప్రబలుతాయనే భయాందోళనలో స్థానికులు ఉన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో విష సర్పాలు కూడా తిరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చి సదరు స్థలాలను మెరక చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఉడా కాలనీ మెయిన్ రోడ్డు వెంబడి ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న వర్షపు నీరు



ఉడా కాలనీలో నీరు నిలిచి చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం

నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

● కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, ఆగస్టు 6: నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర ఎంతో కీలకమైందని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నూతన భవనంలో కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టి నగర పురోగతికి తోడ్పాటును అందించాలన్నారు. కాంట్రాక్టర్లకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. తొలుత కాంట్రాక్టర్లంతా నూతన కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. సీఈ ప్రభాకరరావు, ఎస్ఈ నరసింహ మూర్తి, రామ్మోహన్‌రావు, అకౌంట్స్ ఆఫీసర్ పాల్గొన్నారు.

ఇఫ్లూలో బీఏ(ఆనర్స్/ రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. షిల్లాంగ్, లఖ్‌నవూ ప్రాంతీయ క్యాంపస్‌లలో కూడా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. సీయూఈటీ యూజీ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఏటా నిర్దేశిత కోర్సులు పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. ఏడాది కోర్సు పూర్తిచేసి యూజీ సర్టిఫికెట్, రెండేళ్ల కోర్సు పూర్తిచేసి యూజీ డిప్లొమా, మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఏ డిగ్రీ, నాలుగేళ్లు చదివి బీఏ ఆనర్స్/రీసెర్చ్ డిగ్రీ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. సీయూఈటీ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UMXeSxkలో చదవండి.

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్



హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- 'పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు.

స్పాట్ అడ్మిషన్స్: అభ్యర్థులు ఆగస్టు 19న డిప్లొమా బ్లాక్‌లో రిపోర్ట్ చేయాలి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదిన్నర వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. మధ్యాహ్నం పదకొండు నుంచి పన్నెండున్నర వరకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. సాయంత్రం రెండు గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. తరవాత కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.

- **స్పాట్ అడ్మిషన్స్ తేదీ:** ఆగస్టు 19
- **వేదిక:** రూమ్ నెంబర్ 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037.
- **వెబ్‌సైట్:** www.citdindia.org

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్(ఫార్మర్స్ కోటా) కింద బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 13

చిరునామా: రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034

వెబ్‌సైట్: angrau.ac.in

దిక్సూచి DIKSUCHI

SCHOLARSHIP ALERT

Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 10-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ASPI2

Raman Kant Munjal

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 20-08-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RMKSP4

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

బరువెక్కిన హృదయంతో...



గతంలో కుదుర్చుకున్న పలు చిత్రాల ఒప్పందం కారణంగా బిగ్‌బాస్ నుంచి స్వల్ప విరామం తీసుకుంటున్నట్టు అగ్రనటుడు కమల్ హాసన్ ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించారు. 'ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రయాణం నుంచి ఒక చిన్న విరామం తీసుకుంటున్నాననే విషయాన్ని బరువెక్కిన హృదయంతో ప్రకటిస్తున్నాను. బిగ్ బాస్ కారణంగానే మీ ఇళ్లకు వచ్చి మిమ్మల్ని కలుసుకునే భాగ్యం నాకు లభించింది. మీరు అందించిన ఉద్వేగపూరిత, ఉత్సాహభరిత మద్దతు, ఆదరణ కారణంగా బిగ్‌బాస్ తమిళ సీజన్ దేశంలోనే ఉత్తమ టెలివిజన్ రియాలిటీ షోలలో ఒకటిగా మారింది. ఒక ప్రెజెంటర్‌గా నేను వ్యక్తిగతంగా నేర్చుకున్న అనేక విషయాలను నిజాయితీగా మీతో పంచుకున్నాను' అని కమల్ హాసన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి (చెన్నై)

'దేవర' నటుడికి అరుదైన వ్యాధి




మలయాళ నటుడు షైన్ టామ్‌చాకో.. 'దసరా', 'రంగబలి' వంటి సినిమాలలో ప్రతినాయక పాత్రలతో తెలుగులోనూ పాపులర్ అయ్యారు. ఇప్పుడు ఆయన ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'లోనూ విలన్‌గా కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో.. తనకు అటెన్షన్ డెఫిసిటీ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏ.డీ.హెచ్.డీ) ఉందని తెలిపారు. ఈ వ్యాధి ఉండే వారు ఇతరుల కంటే ప్రత్యేకంగా కనిపించడానికి ప్రయత్నిస్తారని.. అయితే ఇందుకు తానేం బాధపడట్లేదని.. దీన్నే పాజిటివ్ క్వాలిటీగా భావిస్తా అని చెప్పారు.

క్రేజీ ప్రాజెక్ట్‌కు 9న శ్రీకారం



జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం ఈ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. 'కేజీఎఫ్' చిత్రంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించే ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమా గురించి నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ యలమంచి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'శుక్రవారం పూజా కార్యక్రమాలతో లాంచనంగా సినిమాను ప్రారంభిస్తున్నాం. రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్‌లో మొదలవుతుంది. ఎన్టీఆర్ అక్టోబర్ నుంచి షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ లోపు ఆయన లేని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. హీరోయిన్ ఎవరన్నది ఇంకా ఎంపిక చేయలేదు' అని చెప్పారు. ప్రస్తుతం తను నటిస్తున్న 'వార్ 2' చిత్రం షూటింగ్‌ను ఈలోగా పూర్తి చేసి, ప్రశాంత్ నీల్ చిత్రం మీద పూర్తిగా దృష్టి పెట్టనున్నారు ఎన్టీఆర్. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మించనున్నారు. పూర్తి వివరాలను చిత్ర ప్రారంభోత్సవం రోజున వెల్లడిస్తారు.

ఇండస్ట్రీ ఏ ఒక్క ఫ్యామిలీ సొత్తు కాదు



'వీళ్లు తప్ప మరేవరూ ఉండరు' అంటూ మెగా ఫ్యామిలీపై చేస్తున్న విమర్శలపై నటుడు నాగబాబు స్పందించారు. సోమవారం 'కమిటీ కుర్రోళ్లు' సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ "సినిమా ఇండస్ట్రీలో ఎటు చూసినా మెగా ఫ్యామిలీదే ఆధిపత్యం.. కొందరి ఎదుగుదలను ఆ ఫ్యామిలీ అడ్డుకుంటోందని ఎంతో మంది స్టార్లు అనడం విన్నాను. అలా అనడం ముమ్మాటికీ తప్పు. మాకు అలాంటి ఫీలింగ్ లేదు. ఇండస్ట్రీ మా తాత సొత్తు కాదు.. మా నాన్న సామ్రాజ్యం కాదు. అలాగే నందమూరి ఫ్యామిలీది కాదు, అక్కినేని కుటుంబానిది కాదు. ఇండస్ట్రీ అందరికీ చెందినది. సినిమా కుటుంబ నేపథ్యం ఏమీ లేకపోయినా అడవి శేష్ వంటి హీరోలు తమ టాలెంట్‌తోనే పైకి వచ్చారు. వారికి ఎవరూ అడ్డం పడలేదుగా. ఇప్పుడు 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంలో నటిస్తున్న వాళ్లు ఏ రేంజ్‌కి వెళతారో ఎవరన్నా ఊహించగలరా! ఈ రోజు సినిమాలే కాదు.. ఆర్టిస్టుల కోసం ఎన్నో ఓటీటీ వేదికలు ఉన్నాయి. మంచి కంటెంట్ ఉన్న సినిమాకి ట్రై చేయండి. రెగ్యులర్ సినిమాల్లో రొటీన్ క్యారెక్టర్స్ కోసం ప్రయత్నించకండి" అని చెప్పారు.

సినిమా చెట్టును తిరిగి బతికిస్తాం!



సినిమా చెట్టును శాస్త్రీయ పద్ధతిలో తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తూర్పుగోదావరి జిల్లా డీఎఫ్‌వో బి.నాగరాజు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు సోమవారం తెల్లవారుజామున పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ చెట్టు కూలిపోయిందనే విషయం తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో రోజంతా ఇదే విషయం హాట్ టాపిక్‌గా మారింది. కాగా అమరావతి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం డీఎఫ్‌వో బి.నాగరాజు, డీఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో ఎం.కార్తీక్ ఈ సినిమా చెట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నాగరాజు మాట్లాడుతూ పడిపోయిన చెట్టును సైంటిఫిక్‌గా తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.


ఆంధ్రజ్యోతి (కొవ్వూరు)

వామ్మో.. రూ.పది కోట్లా?



దక్షిణాదిలో కొంత కాలం పాటు అగ్ర నటిగా కొనసాగిన సమంత.. స్టార్ హీరోలకి ఏ మాత్రం తగ్గని రేంజ్‌లో పారితోషికం అందుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే లేటెస్ట్‌గా అందిన సమాచారం మేరకు.. ఆమె తీసుకునే పారితోషికం రూ.పది కోట్లకు చేరిందట. అదీ సినిమాకు కాదండోయ్. 'హనీ బన్నీ' అనే స్పై థ్రిల్లర్ వెబ్ సిరీస్‌కు. 'సిటాడెల్' అనే ఆంగ్ల వెబ్ సిరీస్‌కు భారతీయ వెర్షన్‌గా తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్ కోసం రూ.పది కోట్ల రికార్డు పారితోషికం సమంత అందుకున్నారట. వరుణ్‌ధావన్‌తో కలసి నటించిన ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవ్వనుంది. ఇంతకు ముందు కూడా ఓ ప్రాజెక్ట్ కోసం ఒక బాలీవుడ్ ప్రొడ్యూసర్ భారీ మొత్తం సమంతకు ఆఫర్ చేయగా.. ఆమె తిరస్కరించారని టాక్. ఆ ప్రొడ్యూసర్ సమంతకు భారీ పారితోషికంతో పాటు లాభాల్లో 25 శాతం వాటా కూడా ఆఫర్ చేశారట. సమంత ఆ చిత్రాన్ని అంగీకరించి ఉంటే అది ప్రస్తుతం ఆమె ఈ సిరీస్ కోసం తీసుకున్న రూ.పది కోట్ల కంటే ఎక్కువే అయ్యేది.

డజనుకు పైగా చిత్రాలు.. ఒకే రోజు!



ఒకే రోజు మూడు నాలుగు సినిమాలు విడుదల కావడం సర్వసాధారణమే. సంక్రాంతికో.. దసరాకో.. ఇలా ఆరు లేదా ఏడు సినిమాలు ఒకే రోజు విడుదలైన సందర్భాలు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకూ భారీ బడ్జెట్ చిత్రాలే ఉంటాయి. మీడియం బడ్జెట్‌లో తయారైన చిత్రాలు కూడా ఒక రోజున ఐదారు విడుదలైన సందర్భాలు లేకపోలేదు. అయితే వచ్చే గురువారం (ఆగస్టు 15) నాడు ఒకటి కాదు రెండు కాదు .. దాదాపు డజనుకు పైగా దక్షిణాది చిత్రాలు వెండితెర పై సందడి చేయనున్నాయి. స్వాతంత్య్ర దినోత్సవంతో పాటు లాంగ్ వీకెండ్ కూడా కలసి వస్తుండడమే ఈ సందడికి కారణం. ఆ సినిమాల వివరాల్లోకి వెళితే...

మాస్ మసాలా సినిమాలకు పెట్టింది పేరు రవితేజ. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'మిస్టర్ బచ్చన్'తో థియేటర్లలో జోష్ తీసుకురావడానికి దర్శకనిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. ఇందులో రవితేజ, బిగ్ బీ అమితాబ్ ఫ్యాన్‌గా కనిపించనున్నారు. సినిమాలో ఆయన ఇన్‌కమ్ టాక్స్ అధికారి పాత్రను పోషించారు. . యాక్షన్‌తో కూడుకున్న ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. గతంలో రవితేజతో 'షాక్', 'మిరపకాయ్' వంటి చిత్రాలు తెరకెక్కించిన హరీశ్ శంకర్ దీనికి దర్శకుడు. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ సినిమాలో రవితేజ వింటేజ్ లుక్, నూతన నటి భాగ్యశ్రీ బోర్సే అందాలు సినిమాకు ప్లస్ అవుతాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.



బంగారు గనుల నేపథ్యంలో...

'శివ పుత్రుడు', 'అపరిచితుడు' వంటి చిత్రాలతో తెలుగులోనూ పాపులర్ అయిన నటుడు విక్రమ్. ఆయన లేటెస్ట్‌గా నటించిన పీరియాడికల్ డ్రామా చిత్రం 'తంగలాన్'. 'మద్రాస్', 'కాలా' చిత్రాల ఫేమ్ పా.రంజిత్ దీనికి దర్శకత్వం వహించారు. 19వ శతాబ్దంలో కర్ణాటకలోని కోలార్ బంగారు గనుల కార్మికుల జీవితాల నేపథ్యంలో జరిగే కథగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలో విక్రమ్‌తో పాటు పాత్రధారులందరూ విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా అయినా విక్రమ్ విజయాల కొరతను తీరుస్తుందని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్.. సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి.

డబుల్ ఎంటర్టైన్‌మెంట్





'ఇస్మార్ట్ శంకర్'తో 2019లో సూపర్ హిట్ కొట్టారు డైరెక్టర్ పూరి జగన్నాథ్, హీరో రామ్ పోతినేని. వారి కలయికలో ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'పై భారీ అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న పూరీ జగన్నాథ్, రామ్ పోతినేనికి ఈ చిత్ర విజయం చాలా కీలకం కానుంది. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచేసేలా చేశాయి. యాక్షన్ సన్నివేశాలకు థియేటర్స్‌లో పూనకాలు గ్యారంటీ అని చిత్ర బృందం ధీమాగా ఉంది. పూరి మార్క్ డైలాగ్స్‌ను తెలంగాణ యాసలో రామ్ పలికిన తీరు.. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటిస్తుండడం, మణిశర్మ సంగీతం సినిమాకు ప్రధానాకర్షణగా ఉండనున్నాయి.

'ఆయ్' అంటూ సందడి

గోదావరి యాస నేపథ్యంలో.. ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఆ కోవలోకి చెందిన చిత్రమే 'ఆయ్'. 'మేం ఫ్రెండ్సండి' ట్యాగ్‌లైన్. ఫుల్ లెంగ్త్ వినోదం గ్యారంటీ అంటూ ప్రచార చిత్రాలతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ సినిమాను అంజి కంచిపల్లి తెరకెక్కించారు. నార్నే నితిన్, నయన్ సారిక ఇందులో హీరో హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో సినిమాకు పాజిటివ్ బజ్ వచ్చింది.

అదే రోజున ఈ చిత్రాలు కూడా...



నటనా ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే కీర్తి సురేశ్.. కయల్విజి అనే పాత్రలో, హిందీ రాని తమిళమ్మాయిగా.. నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'.. 'ఎవడే సుబ్రమణ్యం', 'కల్యాణ వైభోగమే' ఫేమ్ మాళవిక నాయర్ నటించిన 'క్రిష్ణమ్ ప్రణయ సఖీ' అనే కన్నడ సినిమా.. హిందీ చిత్రం 'అంధాధున్' రీమేక్‌గా తమిళంలో తెరకెక్కిన 'అంధగాన్'.. 'డిమోంటీ కాలనీ' అంటూ తెలుగు వారిని భయపెట్టిన తమిళ హారర్ చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న 'డిమోంటీ కాలనీ 2'.. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ నటించిన థ్రిల్లర్ 'భైరతి రణగల్'.. భావన నటించిన 'హంట్' అనే మలయాళ హారర్ థ్రిల్లర్.. 'దృశ్యం' సినిమా సిరీస్‌తో నేషనల్‌వైడ్ గుర్తింపు పొందిన జీతూ జోసెఫ్ తెరకెక్కించిన కామెడీ ఎంటర్టైనర్ 'నునకూజి'.. 'వాజా' అనే మలయాళ కామెడీ చిత్రం కూడా అదే రోజు బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాలతో పోటీ పడుతున్నాయి. ఈ సినిమాల్లో ఏవి ప్రేక్షకుల ఆదరాభిమానాలు దక్కించుకుంటాయో ఈ నెల 15 వరకు వేచి చూడాల్సిందే.

పెద్ద విజయం కోసం... చిన్న కథ



వినోదాత్మక చిత్రాలతో ఓ వైపు అలరిస్తూనే.. ప్రయోగాత్మక చిత్రాలు, వైవిధ్యమైన పాత్రలకు ఎప్పుడూ ముందుండే నటుడు ప్రియదర్శి ఆయన చాణక్య వర్మ అనే పాత్రతో స్కూల్ టీచర్‌గా నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. సెలక్టివ్‌గా సినిమాలు చేసే నివేదా థామస్ ఇందులో ఓ మధ్య తరగతి ఇల్లాలి పాత్రను పోషించారు. విశ్వదేవ్, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించారు. నంద కిశోర్ ఈమని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతో పాటు గుండెని బరువెక్కించే భావోద్వేగాలూ ఉన్నాయని టీజర్ ద్వారా తెలుస్తోంది.

సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా'



యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ నటించే కొత్త చిత్రం 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ మంగళవారం ప్రారంభమైంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 30 రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలు, పాటలు చిత్రీకరిస్తామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. తొలి రోజు షూటింగ్‌లో రాశీ ఖన్నా కూడా పాల్గొన్నారు. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. వైవా హర్ష ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని, జ్ఞానశేఖర్ బాబా ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.

ప్రేమికులు రిలేట్ అయ్యేలా...



విజయ్‌శంకర్, విషిక జంటగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇదనీ, ప్రేమలో ఉన్న ప్రతి లవర్ రిలేట్ చేసుకొనేలా సినిమా ఉంటుందని విజయ్‌శంకర్ చెప్పారు. తను పోషించిన పాత్ర చూశాక అమ్మాయిలు తమ బాయ్‌ఫ్రెండ్స్‌ని ఇబ్బంది పెట్టరని హీరోయిన్ విషిక చెప్పారు.

యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్



సాగర్, శ్రుతి శంకర్ జంటగా నటించిన 'కాలం రాసిన కథలు' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని ఈ నెల 29న విడుదలకు సిద్ధమైంది. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. యం. యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

పోలీస్ ఆఫీసర్‌గా విశ్వక్ సేన్



కొత్తగా..

విభిన్న పాత్రలతో అలరిస్తున్న విశ్వక్ సేన్ ఇప్పుడు పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. 'దసరా' తో భారీ బ్లాక్ బస్టర్‌ను అందించిన సుధాకర్ చెరుకూరి ఈ చిత్ర నిర్మాత. శ్రీధర్ గంటా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఎవ్రీ యాక్షన్ ఫైర్స్ ఏ రియాక్షన్' అనేది సినిమా ట్యాగ్‌లైన్. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇదనీ, విశ్వక్ సేన్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తారని దర్శక నిర్మాతలు చెప్పారు. విశ్వక్ సేన్‌కు ఇది 13వ సినిమా.

అలరించే కుర్రోళ్లు



అంతా కొత్త వారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్, సాయిదుర్గ తేజ్, అడవి శేష్, నాగబాబు, వెంకీ అట్లూరి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిత్ర సమర్పకురాలు నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'పదిహేను మంది కొత్త ఆర్టిస్టులను పరిశ్రమకు అందిస్తున్నాను..అనే తృప్తి నాకు ఉంది. చిత్ర దర్శకుడు వంశీ పేరు ఇకపై ఎక్కువగా వినిపిస్తుంది' అని చెప్పారు. చిత్రం పెద్ద హిట్ కావాలని అతిథులు కోరారు.

ఆనందం వెల్లివిరిసింది.. ఉడుంపట్టు పట్టిన రెజ్లర్ వినేశ్ ఫొగాట్.. అంచనాలను తారుమారు చేస్తూ ఏకంగా స్వర్ణ పోరుకు దూసుకెళ్లింది. ఏడాది కిపైగా వివాదాలు.. విమర్శలు.. అనుమానాలు.. అవమానాలకు ఎదురు నిలిచిన వినేశ్.. పోటీల ఆరంభం లోనే అద్భుతం చేసింది. తొలి రౌండ్‌లోనే నమ్మశక్యం కాని రీతితో.. ప్రపంచ మేటి రెజ్లర్ సుసాకికి తొలి ఓటమి రుచి చూపించిన ఫొగాట్.. ఒక్కసారిగా ఫేవరెట్‌గా మారిపోయింది. అలవోకగా సెమీస్ చేరి.. స్వర్ణ చరిత్రకు అడుగు దూరంలో నిలిచింది. నైరాశ్యం ఆవహించిన భారత అభిమానుల్లో.. జోష్ నింపింది.



వినేశ్ వండర్

సెమీస్‌లో విజయానంతరం ఫొగాట్

ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర

● ఓటమి ఎరుగని సుసాకికి షాక్ ● కనీసం రజతం ఖాయం

పారిస్: ఏం గెలుస్తుందిలే.. అని తేలిగ్గా తీసుకొన్న రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పెను సంచలనం సృష్టించింది. ఓటమి ఎరుగని డిఫెండింగ్ చాంప్ యుయి సుసాకికి ఓటమి రుచిచూపింది. క్వార్టర్స్‌లో ఒక్సానా లివాచ్ (ఉక్రెయిన్)పై నెగ్గిన ఫొగాట్.. సెమీస్‌లో యుస్నేలిస్ గుజ్‌మన్ (క్యూబా)ను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ క్రమంలో దేశానికి రజత పతకాన్ని ఖాయం చేసిన వినేశ్.. పసిడి పోరుకు చేరుకొన్న తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించింది. బుధవారం రాత్రి జరిగే ఫైనల్లో అమెరికా రెజ్లర్ సారా హిల్డ్‌బ్రాంట్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సాధారణంగా తాను తలపడే 53 కిలోల విభాగంలో మరొకరికి బెర్త్ ఖరారు కావడంతో.. తక్కువ వెయిట్ కేటగిరీలో బరిలోకి దిగడానికి తన బరువు తగ్గించుకొంది. ట్రయల్స్‌లో ఎలాగోలా అవకాశం దక్కించుకొన్న ఫొగాట్.. ఒక్క ఉడుంపట్టుతో యావత్ దేశం దృష్టినీ తనవైపునకు తిప్పుకొంది.

ఆడలేదు.. వేటాడింది..

50 కిలోల విభాగంలో తొలి రౌండ్‌లో ఫొగాట్ ప్రత్యర్థి జపాన్ టాప్ రెజ్లర్ సుసాకి అని డ్రా ఖరారు కావడంతో అందరూ ఆశలు వదిలేసుకొన్నారు. ఎందుకంటే అంతర్జాతీయ కెరీర్‌లో ఆడిన 82 మ్యాచ్‌లో సుసాకి ఒక్క బౌట్ కూడా ఓడలేదు. పైగా టోక్యోలో గోల్డ్‌తోపాటు నాలుగుసార్లు వరల్డ్ చాంపియన్ కావడంతో ఫొగాట్ పని ఇక అంతే అని పెదవి విరిచారు. కానీ, బలమైన ప్రత్యర్థిని వ్యూహాత్మకంగా ఎలా దెబ్బకొట్టాలో ముందుగానే సిద్ధమైన వినేశ్.. మ్యాట్‌పై దాన్ని ఆచరణలో పెట్టి అద్భుతం చేసింది. మంగళవారం జరిగిన రౌండ్-16లో ఫొగాట్ 3-2 సుసాకిపై చిరస్మరణీయ విజయంతో క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. బౌట్‌లో 90 సెకన్లు ఇద్దరు రెజ్లర్లు ఒకరిని ఒకరు అంచనా వేసుకోవడానికే కేటాయించారు. వినేష్ రక్షణాత్మకంగా వ్యవహరించడంతో తొలి పాయింట్ కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఫొగాట్, సుసాకి అదను కోసం వేచి చూసే ధోరణినే అవలంబించారు. ఈక్రమంలో మరో పాయింట్ కోల్పోయిన ఫొగాట్ 0-2తో వెనుకబడింది. కానీ, పటిష్ఠమైన డిఫెన్స్‌తో సుసాకి పాయింట్లు ఇవ్వకుండా ఎంతో చతురతతో వ్యవహరించింది. ఈ క్రమంలో పోటీ ముగియడానికి మరో 15 సెకన్ల సమయం ఉందనగా.. అప్పటి వరకు దూరదూరంగా ఉంటూ ప్రత్యర్థిని మభ్యపెట్టిన వినేశ్.. ఒక్కసారిగా సుసాకిపై ఎదురుదాడి చేసింది. పట్టుకోల్పోయిన జపాన్ రెజ్లర్‌ను మ్యాట్‌పై పడేసి రెండు పాయింట్లు స్కోరు చేసింది. హఠాత్ పరిణామంతో సుసాకి నివ్వెరపోయి చూస్తుండగా.. ఫొగాట్ సంబరాల్లో మునిగింది. జపాన్ రెజ్లర్ చాలెంజ్ చేసినా.. ఆమెకు నిరాశే ఎదురైంది.





ఇక, క్వార్టర్స్‌లో ఒక్సానాపై వినేశ్ 7-5తో గెలిచింది. తొలుత ఫొగాట్ 4-0తో ఆధిక్యం సాధించింది. కానీ, పోరాడిన ఒక్సానా.. వినేశ్‌ను తన పట్టులో బిగిస్తూ 4 పాయింట్లు స్కోరు చేసింది. చివరి 48 సెకన్లలో ఒక్సానాను టేక్‌డౌన్ చేసిన ఫొగాట్ బౌట్‌ను ముగించింది.

అంతా ఏకపక్షంగా..

వరుసగా రెండు బౌట్‌లు నెగ్గి ఆత్మవిశ్వాసంతో ఉన్న ఫొగాట్.. సెమీస్‌లోనూ అదే జోరు చూపింది. ఏకపక్షంగా సాగిన పోరులో వినేష్ 5-0తో యుస్నేలిస్ గుజ్‌మన్ లోపెజ్ (క్యూబా)ను చిత్తు చేసింది. ఇద్దరు ఆరంభంలో ఆచితూచి ఆడారు. అయితే, లోపెజ్ రక్షణాత్మకంగా వ్యవహరించడంతో.. ఫొగాట్‌కు తొలి టెక్నికల్ పాయింట్ లభించింది. తర్వాత మరింత దూకుడుగా వ్యవహరించిన వినేష్ 4 పాయింట్లతో బౌట్‌ను సొంతం చేసుకొంది. రియో, టోక్యో క్రీడల్లో క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన ఫొగాట్ ఈసారి ఏకంగా ఫైనల్‌కు చేరుకోవడం విశేషం

సివంగి..


'ఆమె.. మన సివంగి. డిఫెండింగ్ చాంప్‌ను ఓడించిన వినేశ్. వెంటనే మరో మాజీ వరల్డ్ చాంపియన్‌పై గెలవడం అద్భుతం. ఆమె ప్రపంచాన్ని జయించబోతోంది'
- బజ్‌రంగ్ పూనియా.

ఏడాది క్రితం సరిగ్గా రోడ్డు పైనే నిద్రించింది.. మానసికంగా ఎంతో వేదనకు గురైంది.. ప్రాక్టీస్‌ను కోల్పోయింది.. మోకాలి గాయానికి శస్త్రచికిత్స చేయించుకుంది... కొన్నాళ్లు ఆటకు దూరమైంది.. అసలు ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుందా అన్న సంశయాన్ని దాటుకొని పారిస్ క్రీడలకు ఎంపికైంది.. ఇన్ని సవాళ్లు, ప్రతికూలతల మధ్యే పోటీపడింది. గెలవాలన్న కసితో, సంకల్ప బలంతో ముందుకు సాగింది.. రౌండ్ రౌండ్‌కు ప్రత్యర్థులను ఉడుం పట్టుతో హడలెత్తిస్తూ ఏకంగా స్వర్ణపోరులో నిలిచింది. ఇలా.. తానెదుర్కొన్న విమర్శలు, అవమానాలన్నింటికీ ఆటతోనే బదులిచ్చిన పోరాట యోధురాలు వినేశ్ ఫొగాట్.

నాడు న్యాయం కోసం నేడు దేశం కోసం

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఏడాది క్రితం మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలతో బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో వినేశ్ కీలకపాత్ర పోషించింది. రోజుల తరబడి సహచర రెజ్లర్లతో కలిసి ధర్నాలో పాల్గొంది. ఆపై అరెస్టయింది. పోలీసుల దాష్టీకాన్ని చవిచూసింది. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఏమాత్రం కనికరించలేదు. బ్రిజ్‌భూషణ్‌ను తిరిగి రెజ్లింగ్ సమాఖ్యలోకి రానివ్వకుండా చేసేందుకు ఆమె అన్ని ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలో తాను సాధించిన ఖేల్ రత్న లాంటి ప్రతిష్ఠాత్మక అవార్డులను సైతం వెనక్కి చ్చేసింది. ఆన్‌లైన్‌లో ఆఫ్‌లైన్‌లో వేధింపులు ఎదుర్కొంది. అయినా వెనక్కి తగ్గలేదు. చివరకు అనుకున్నది సాధించింది. బ్రిజ్‌భూషణ్ తిరిగి సమాఖ్య ఎన్నికలకు దూరమవడంతో మళ్లీ ఆటపై దృష్టి పెట్టింది. ఈ సమయంలోనే మోకాలి గాయానికి శస్త్రచికిత్స చేయించుకుంది. ఏడాదిపాటు ఆటకు దూరమైంది. అయినా వెరవలేదు. శిక్షణలో రాటుదేలింది. ఈ సమయంలోనే తాను పోటీపడాల్సిన 53 కిలోల విభాగంలో అంతిమ్ పంగల్ ఒలింపిక్స్ కోటా గెలిచింది. దీంతో తన బరువు విభాగాన్ని 50 కిలోలకు మార్చుకుంది. అందులో జాతీయ సెలెక్షన్స్‌లో నెగ్గి ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో పోటీపడింది. అదే జోష్‌లో వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌కు ఎంపికై ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించింది. 50 కిలోల విభాగంలో భారీ అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ప్రీ క్వార్టర్స్ బౌట్‌లో వరల్డ్ నెంబర్‌వన్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత సుసాకి రూపంలో ఎదురైన సవాల్‌ను సమర్థవంతంగా అధిగమించింది. ఆ తర్వాత క్వార్టర్స్‌లో ఉక్రెయిన్ రెజ్లర్ ఒక్సానాను చిత్తుచేసి సెమీస్‌కు చేరడంతో వినేశ్ ఆనందానికి హద్దుల్లేవు. ఇక సెమీస్‌లో క్యూబా అమ్మాయి గుజ్‌మాన్‌ను చిత్తుచేసి భారత రెజ్లింగ్ చరిత్రలో తన ప్రస్థానాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది.నాడు కన్నీళ్లు పెట్టుకున్న ఆ వనితే.. ఇప్పుడు విశ్వవేదికపై యోధురాలిలా పోరాడి దేశానికి గర్వకారణమైంది.



పారిస్‌లో నేటి భారతం

అథ్లెటిక్స్: మిక్స్‌డ్ మారథాన్ వాక్ రిలే పతకరౌండ్ : ప్రియాంక గోస్వామి, సూరజ్ పన్వర్ (ఉ. 11.00); పురుషుల హైజంప్ క్వాలిఫికేషన్ : సర్వేశ్ అనిల్ కుషారె (మ. 1.35); మహిళల జావెలిన్ త్రో క్వాలిఫికేషన్ : అన్నూ రాణి (మ. 1.55); మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రౌండ్ 1: జ్యోతి యర్రాజి (హీట్ 4) (మ. 1.45); పురుషుల ట్రిపుల్ జంప్ క్వాలిఫికేషన్ : ప్రవీణ్ చిత్రవేల్, అబ్దుల్లా అబూబాకర్ (రా. 10.45); పురుషుల 3వేల స్టీపుల్ చేజ్ ఫైనల్ : అవినాశ్ సబ్లే (రా. 1.13)

గోల్ఫ్: మహిళల వ్యక్తిగత ఫైనల్స్-రౌండ్ 1: అదితి అశోక్, దీక్షా డాగర్ (మ. 12.30)

టేబుల్ టెన్నిస్: మహిళల టీమ్ క్వార్టర్‌ఫైనల్: భారత్ X జర్మనీ (మ. 1.30).

రెజ్లింగ్: మహిళల 53 కిలోల ప్రీక్వార్టర్‌ఫైనల్స్ : అంతిమ్ పంగల్ X జ్యెనెప్ ఎట్గిల్ (టర్కీ) (మ. 3.05); మహిళల 50 కిలోల ఫ్రీస్టయిల్ ఫైనల్: వినేశ్ ఫొగాట్ X సారా ఆన్ (అమెరికా) (రాత్రి 11.20 గం.)

వెయిట్‌లిఫ్టింగ్: మహిళల 49 కిలోల పతక రౌండ్ : మీరాబాయి చాను (రా. 11.00).

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
అమెరికా	22	31	29	82
చైనా	22	20	16	58
ఆస్ట్రేలియా	14	12	9	35
ఫ్రాన్స్	13	16	19	48
బ్రిటన్	12	15	18	45
కొరియా	11	8	7	26
జపాన్	11	6	11	28
ఇటలీ	9	10	6	25
నెదర్లాండ్స్	8	5	6	19
జర్మనీ	8	5	4	17
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

నాలుగో డోపీ.. దొరికాడు

ఏథెన్స్: పారిస్ ఒలింపిక్స్‌లో ఇప్పటికే ముగ్గురు క్రీడాకారులు డోపింగ్‌లో పట్టుబడగా.. తాజాగా మరొకరు కూడా దొరికారు. గ్రీకు దేశానికి చెందిన అథ్లెట్ ఒకరు డోప్ పరీక్షలో విఫలమయ్యాడు. అతను నిషేధిత డ్రగ్ తీసుకున్నట్టు రుజువైందని గ్రీస్ ఒలింపిక్ కమిటీ వెల్లడించింది. అతడిని వెంటనే అథ్లెట్ల క్రీడాగ్రామాన్ని వదిలి వెళ్లాలని ఆదేశించారు. అయితే, డోపీగా తేలిన ఆ అథ్లెట్ ఎవరు.. ఏ క్రీడకు సంబంధించిన వాళ్లు అన్న విషయాన్ని మాత్రం బహిర్గతం చేయలేదు.

పోరాడినా.. ప్చ్

హాకీ సెమీస్‌లో జర్మనీ చేతిలో భారత్ ఓటమి

స్పెయిన్‌తో కాంస్య పతక పోరు రేపు



పారిస్: నాలుగు దశాబ్దాల తర్వాత భారత హాకీ జట్టు ఒలింపిక్ ఫైనల్‌కు చేరుతుందని ఆశపడిన అభిమానులకు నిరాశే మిగిలింది. మంగళవారం వరల్డ్ నెంబర్ 2 జర్మనీతో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్‌లో భారత్ 2-3తో పరాజయం పాలైంది. భారత హాకీ జట్టు ఆఖరి సెకను వరకు స్కోరును సమం చేసేందుకు పోరాడినా ఫలితం దక్కలేదు. పలుమార్లు పెనాల్టీ కార్నర్ అవకాశాలు లభించినా సద్వినియోగం చేసుకోకపోవడం దెబ్బతీసింది. ఇక భారత జట్టు కాంస్య పతకం కోసం స్పెయిన్‌తో.. స్వర్ణం కోసం జర్మనీ జట్టు టీమ్ నెదర్లాండ్స్‌ను ఢీకొంటుంది. భారత్ నుంచి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఏడో నిమిషంలోనే గోల్ సాధించగా, రెండో గోల్‌ను 36వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ అందించాడు. జర్మనీ తరఫున గోంజలో పిల్లట్ (18), క్రిస్టోఫర్ రుర్ (27), మార్కో మిల్ట్‌కౌ (54) గోల్స్ సాధించారు.

ఆరంభంలోనే ఆధిక్యం దక్కినా..: తొలి క్వార్టర్‌లో భారత్ ఆధిపత్యం సాగింది. అయితే ఈ సమయంలో ఆరు పెనాల్టీ కార్నర్లు లభించినప్పటికీ జట్టు ఒక్కటి మాత్రమే సద్వినియోగం చేసుకుంది. పీసీ ద్వారా ఏడో నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ జట్టుకు తొలి గోల్ అందించాడు. కానీ రెండో క్వార్టర్‌లో జర్మనీ ఎదురుదాడికి భారత తడబడింది. మిడ్‌ఫీల్డ్‌లో వీరిదే హవా సాగడంతో భారత్ గోల్‌పోస్టుపై దాడులు ఎక్కువయ్యాయి. చివరకు జర్మనీ కూడా పీసీ ద్వారానే 18వ నిమిషంలో స్కోరును సమం చేసింది. అలాగే 27వ నిమిషంలో జర్మనీకి పెనాల్టీ స్ట్రోక్ లభించడంతో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో క్వార్టర్ ఆరంభంలో భారత్‌కు స్కోరును సమం చేసే అవకాశం వచ్చినా ప్రత్యర్థి కీపర్ వమ్ము చేశాడు. కాసేపటికే మరో పీసీతో గోల్ చేసిన భారత్ 2-2తో స్కోరును సమం చేసి ఉత్కంఠ పెంచింది. 47వ నిమిషంలో జర్మనీ గోల్ అవకాశాన్ని కీపర్ శ్రీజేష్, వివేక్ సమర్థంగా అడ్డుకున్నారు. అయితే పదే పదే దాడులు జరిపిన జర్మనీ చివరకు 54వ నిమిషంలో చేసిన ఫీల్డ్ గోల్‌తో భారత్ షాక్‌కు గురైంది. చివరి నిమిషాల్లో కీపర్ శ్రీజేష్ స్థానంలో మరో ప్లేయర్‌ను గ్రౌండ్‌లోకి పంపినా ఫలితం దక్కలేదు. అలాగే ఆఖర్లో జర్మనీ పీసీని కీపర్ లేకుండానే భారత్ నిలువరించింది. ఇక ఆఖరి సెకన్లలో రెండు అవకాశాలు వచ్చినా ఒకటి వైడ్‌గా, మరొకటి పోస్ట్ పైనుంచి వెళ్లడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు.

వచ్చాడు.. వచ్చేశాడు. ఎవరు ఏ పతకం గెలిచినా.. గెలవకపోయినా స్వర్ణం ఖాయమన్న అంచనాలున్న ఏకైక భారత అథ్లెట్ నీరజ్ చోప్రా. ఇసుమంతైనా ఆ నమ్మకాన్ని తగ్గించకుండా క్వాలిఫయింగ్‌లో ఈ స్టార్ జావెలిన్ త్రోయర్ తొలి ప్రయత్నంలోనే వావ్.. అనిపించాడు. మిగతా ప్లేయర్లు కిందా మీదా పడుతుంటే, ఊపిరి బిగపట్టి విసిరిన త్రోకు అతడి జావెలిన్.. రాకెట్ వేగంతో అలా.. అలా దూసుకెళ్లి 89.34మీ. దూరం వెళ్లి పడింది. తద్వారా నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించి అభిమానులను ఆనందడోలికల్లో ముంచాడు. గుర్తుందా.. టోక్యో గేమ్స్‌లో అతడు 87.58మీ. దూరంతోనే గోల్డ్ కొట్టేశాడు. మరో భారత అథ్లెట్ కిశోర్ జెనా మాత్రం నిరాశపర్చాడు.

ఒకే ఒక్క త్రో...



జావెలిన్‌త్రోలో ఫైనల్‌కు నీరజ్

తొలి ప్రయత్నంలోనే 89.34మీ. దూరం

కిశోర్ జెనా విఫలం

పారిస్: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా తాజా ఒలింపిక్స్‌ను ఘనంగా ఆరంభించాడు. మంగళవారం స్టేడ్ డి ఫ్రాన్స్ స్టేడియంలో జరిగిన పురుషుల జావెలిన్‌త్రో క్వాలిఫయింగ్‌లో తను తొలి ప్రయత్నంలోనే 89.34మీ. దూరం విసిరి ఫైనల్‌కు అర్హత సాధించాడు. నీరజ్ కెరీర్‌లో ఇది రెండో బెస్ట్ త్రో. అలాగే క్వాలిఫికేషన్ రెండు గ్రూపుల్లో 32 మంది త్రోయర్లు పాల్గొనగా నీరజ్‌దే టాప్ షో. ఫైనల్‌కు అర్హత సాధించాలంటే అథ్లెట్లు జావెలిన్‌ను కనీసం 84మీ. దూరం విసరాల్సి ఉంటుంది. నీరజ్ మొదటి ప్రయత్నంలోనే అంతకుమించి వేయడంతో మిగిలిన రెండు చాన్స్‌లను ఉపయోగించుకోవాల్సిన అవసరం లేకపోయింది. మరోవైపు టాప్-12 మంది అథ్లెట్ల మధ్య జరిగే ఫైనల్ గురువారం రాత్రి 11.55కు ఆరంభమవుతుంది. వాస్తవానికి నీరజ్ ఈ ఏడాది బెస్ట్ 88.36మీ. (దోహా డైమండ్ లీగ్‌లో) దూరమే అయినా ఒలింపిక్స్ క్వాలిఫికేషన్‌లో మాత్రం దాన్ని సునాయాసంగా అధిగమించాడు. ఇక రెండుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన గ్రెనెడా అథ్లెట్ పీటర్స్ అండర్సన్ (88.63మీ.), పాక్‌కు చెందిన అర్షద్ నదీమ్ (86.59మీ.) కూడా గ్రూప్ 'ఎ'లో నీరజ్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే బెర్త్ దక్కించుకున్నారు. బ్రెజిల్ త్రోయర్ డా సిల్వా లూయిజ్ (85.91మీ) మాత్రం మూడో ప్రయత్నంలో అర్హత సాధించాడు. ఇదిలావుండగా గ్రూప్ 'ఎ'లో బరిలోకి దిగిన మరో భారత త్రోయర్ కిశోర్ జెనా మాత్రం తొమ్మిదో స్థానంతో నిరాశపర్చాడు. అతడు తొలి ప్రయత్నంలో 80.73మీ., మూడో ప్రయత్నంలో 80.21మీ. విసరగా.. రెండో ప్రయత్నంలో ఫౌల్ అయ్యాడు.

సమం చేస్తారా?

● తడబడుతున్న భారత బ్యాటర్లు

● 27 ఏళ్ల తర్వాత లంకకు సిరీస్ గెలిచే చాన్స్

● మూడో వన్డే మ. 2.30 నుంచి



కొలంబో: స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబడుతున్న భారత బ్యాటింగ్.. భంగపాటును తప్పించుకోవాలనుకొంటోంది. మూడు వన్డేల సిరీస్‌లో 0-1తో వెనుకబడిన రోహిత్ సేన.. బుధవారం శ్రీలంకతో జరిగే చివరి మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్ గెలిస్తే సిరీస్ 1-1తో సమమవుతుంది. తొలి వన్డే టై కాగా.. రెండో మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో భారత్ ఓటమి పాలైంది. మరోవైపు ఫుల్‌జోష్‌లో ఉన్న ఆతిథ్య లంక.. ఈ వన్డే నెగ్గి 27 ఏళ్ల తర్వాత భారత్‌పై తొలి సిరీస్ పట్టేయాలన్న పట్టుదలతో ఉంది. 1997లో సచిన్ టెండూల్కర్ కెప్టెన్సీలో చివరిసారి భారత్ 0-3తో లంక చేతిలో ద్వైపాక్షిక సిరీస్‌లో పరాజయం పాలైంది. కాగా తాజాగా రెండు వన్డేల్లోనూ టీమిండియా మిడిలార్డర్ వైఫల్యం బహిర్గతమైంది. ఓపెనర్ రోహిత్ దూకుడైన ఆరంభాన్నిచ్చినా.. కోహ్లీ పేలవ ప్రదర్శన ఎంతో ప్రభావం చూపిస్తోంది. రెండో వన్డేలో వాండర్సే స్పిన్ దెబ్బకు శివమ్ దూబే, కేఎల్ రాహుల్ డకౌట్ కాగా.. శ్రేయాస్ అయ్యర్ (7) వికెట్ల ముందు దొరికిపోయాడు. తగిన ఫుట్‌వర్క్ లేకపోవడంతో స్లో బౌలర్లను ఎదుర్కోవడంలో బోల్తాపడుతున్నారు. మధ్య ఓవర్లలో కోహ్లీ నిలబడి పరుగులు సాధిస్తే భారత్ విజయం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రోహిత్ ఎలా ఆడుతున్నాడో గమనించి వీరు కూడా అదే తరహాలో స్పిన్‌ను ఎదుర్కొంటే.. లంక బౌలర్లకు చుక్కలు చూపించవచ్చు. హిట్‌మ్యాన్ ఫిట్‌నెస్‌పై అనుమానాలున్నా.. అతడు ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దూబే స్థానంలో స్పిన్ బౌలింగ్ చేయగల రియాన్ పరాగ్‌కు చాన్స్ దక్కొచ్చు. భారత బౌలర్లు కూడా టెయిలెండర్ల పనిపట్టడంపై దృష్టిసారించాలి. కాగా, లంక సిరీస్‌పై గురిపెట్టింది. బ్యాటర్లు ఓ మాదిరైన స్కోర్లు అందిస్తున్నా.. స్పిన్నర్లు హసరంగ, వాండర్సే ప్రత్యర్థి వెన్ను విరుస్తున్నారు. వీరి నుంచి జట్టు మరోసారి అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలున్నాయి.

జట్లు (అంచనా):

భారత్: రోహిత్, గిల్, కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, దూబే/పరాగ్, అక్షర్, సుందర్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్. **శ్రీలంక:** పథుం నిస్సంక, అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), సదీర సమరవిక్రమ, అసలంక (కెప్టెన్), జనిత్ లియనాగే, వెల్లలగే, కమిందు మెండిస్, వాండర్సే, ధనంజయ, అసిత ఫెర్నాండో.

నడవలేని స్థితిలో కాంబ్లీ



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ క్రికెటర్, సచిన్ టెండూల్కర్ చిన్ననాటి స్నేహితుడు వినోద్ కాంబ్లీ ప్రస్తుతం తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. అందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఏదో పనిమీద బయటకొచ్చిన 52 ఏళ్ల కాంబ్లీ.. ఓ షాప్ ముందు పూర్తిగా నడవలేని స్థితిలో బైక్‌ను ఆసరాగా పట్టుకొని నిలబడినట్టు ఆ వీడియోలో ఉంది. కింద పడిపోతున్న అతడిని స్థానికులు కొందరు పక్కకు తీసుకొచ్చి కూర్చోబెట్టారు. అయితే, ఈ వీడియో ఎప్పుడు తీసిందన్నదానిపై స్పష్టత లేదు. కాగా, ఆర్థికంగానూ అంతంత మాత్రంగానే ఉన్నాననీ, బీసీసీఐ ఇచ్చే పెన్షన్‌తోనే జీవితాన్ని నెట్టుకొస్తున్నట్టు కాంబ్లీ గతంలో ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

ఆ ఎస్‌యూవీలు ఆమె 'కృపే'



సృజనాత్మకత, దార్శనికత, రాబోయే మార్పులను ఊహించగలిగే సామర్థ్యం... రామ్‌కృప అనంతన్ వీటన్నిటి సమాహారం. మహీంద్రా థార్, స్కార్పియో, ఎక్స్‌యూవీ 700 లాంటి అనేక ఇండియన్ ఎస్‌యూవీలు ఆమె మేధస్సులోనే రూపుదిద్దుకున్నాయి. ప్రస్తుతం ఈ ఆటోమోటివ్ డిజైనింగ్ దిగ్గజం తన నైపుణ్యంతో ఎలక్ట్రిక్ వాహనాల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

మగవారు ఎంతగానో ఇష్టపడే మహీంద్రా థార్, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, స్కార్పియోలను డిజైన్ చేసింది ఒక మహిళ అనేది చాలామందికి తెలియకపోవచ్చు. వాటన్నిటి వెనుకా ఉన్న వ్యక్తి రామ్‌కృప అనంతన్. సాంకేతికతతో సృజనాత్మక నైపుణ్యాలను జోడిస్తే అద్భుతాలు చెయ్యవచ్చనడానికి ఆమె చక్కటి ఉదాహరణ. "డిజైనింగ్‌ను వృత్తిగా నేను ఎంచుకోవడానికి కారణం నా సోదరుడు. నాకు చిన్న వయసు నుంచే రెండు లక్షణాలున్నాయి. మొదటిది సృజన. నా చేతుల్తో వస్తువులు తయారు చెయ్యడమంటే చాలా ఇష్టం. మరోవైపు ఏ విషయాన్నైనా తార్కికంగా విశ్లేషించడం కూడా అలవాటు. "ఈ రెండు లక్షణాలు ఉన్నవారు డిజైనింగ్‌లో రాణిస్తారు" అంటూ నా సోదరుడు నన్ను ఈ దిశగా ప్రోత్సహించాడు" అని చెబుతారు రామ్‌కృప. అప్పటికే బిట్స్-పిలానీలో మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన ఆమె... ఐఐటి ముంబయిలోని డిసిఐ స్కూల్ ఆఫ్ డిజైన్ నుంచి ఇండస్ట్రియల్ డిజైన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. "కార్ల మీద, వాటి డిజైనింగ్ మీద అప్పుడే నాకు ఆసక్తి బాగా పెరిగింది. 1997లో 'మహీంద్రా అండ్ మహీంద్రా'లో ఇంటీరియర్ డిజైనర్‌గా నా ఉద్యోగ జీవితం మొదలైంది" అని గుర్తు చేసుకున్నారామె.

నిరూపించుకోవడానికి కష్టపడ్డాను...

కార్ల డిజైనింగ్ పూర్తిగా మగవారికే పరిమితమైన ప్రొఫెషన్‌గా భావించేవారు. తొలి రోజుల్లో తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి రామ్‌కృప ఎంతో శ్రమించాల్సి వచ్చింది. కానీ ఆమె ప్రతిభను కంపెనీ గుర్తించింది. బొలేరో, స్కార్పియో, జైలో ఇంటీరియర్ల రూపకల్పనలో... ఆచరణాత్మకతను, సౌందర్యాన్నీ ఆమె మేళవించిన తీరు కంపెనీని ఆకట్టుకుంది. 2005లో మహీంద్రా డిజైన్ డిపార్ట్‌మెంట్ అధిపతిగా ఆమెను నియమించింది. "అరవై మంది టీమ్‌కి సారథ్యం వహించే అవకాశం నాకు వచ్చినప్పుడు... మహిళలకు ఏదైనా చెయ్యగలిగే సామర్థ్యం ఉందనేది చూపించాలనుకున్నాను. ఒక ప్రీమియం ఎస్‌యూవీకి రూపకల్పన చెయ్యడం నా బాధ్యత. 2007లో ఎక్స్‌యువి 500 ప్రాజెక్ట్‌ను 'మహీంద్రా అండ్ మహీంద్రా' చేపట్టింది. దానికి నేను సారథ్యం వహించాను. వివిధ దేశాలకు చెందిన 1500మందితో ఒక సర్వే నిర్వహించాను. "ఎలాంటి ఎస్‌యూవీని మీరు కోరుకుంటున్నారు?" అని వారిని ప్రశ్నించి వివరాలు సేకరించాను. వాటి ప్రకారం కొన్ని మార్గదర్శకాలు నిర్దేశించుకున్నాను. నాలుగేళ్ళపాటు నేను, నా బృందం దాదాపు 500 డిజైన్లను రూపొందించాం. తుది డిజైన్ ఆమోదం పొందడానికి ముందు వరకూ మార్పు చేర్పులు చేస్తూనే ఉన్నాం. 2011లో ఆ కారు విడుదలయింది. ప్రపంచంలోనే ఏకైక మహిళా డిజైన్ చీఫ్‌గా... కారు డిజైన్ చేసి... నన్ను నేను నిరూపించుకున్నాను. ఆ కార్ల డీలర్ షిప్‌ల కోసం బుకింగ్స్ వెల్లువెత్తాయి. ఎక్స్‌యువీ 500 విజయవంతం కావడంతో... టీయూవీ 300, కేయూవీ 100 లాంటి ఆల్ఫాన్యూమరిక్ సిరీస్ కార్లు మరిన్ని డిజైన్ చేశాం" అని వివరించారు రామ్‌కృప. దీంతో 'క్వీన్ ఆఫ్ ఇండియన్ ఆటో డిజైనింగ్'గా ఆమె పేరు ఆటోమోటివ్ పరిశ్రమలో మార్మోగింది. 2019లో చీఫ్ డిజైనర్ స్థాయికి ఎదిగారు. ఆమె నాయకత్వంలో థార్, ఎక్స్‌యూవీ 700 లాంటి మోడల్స్ రూపొందాయి. స్కార్పియోను కూడా ఆమె పునరావిష్కరించారు.



ఒంటరిగా మొదలై...

"రాబోయే కాలం ఎలక్ట్రిక్ వాహనాలదే" అని నిశ్చయంగా చెబుతున్న రామ్‌కృప ఆ దిశగా తన దృష్టిని మళ్ళించారు. 2022లో 'మహీంద్రా అండ్ మహీంద్రా' నుంచి బయటకు వచ్చి, 'క్రక్స్ స్టూడియో' పేరిట సొంత కంపెనీ ఏర్పాటు చేశారు. అలాగే 'ఓలా ఎలక్ట్రిక్'లో హెడ్ ఆఫ్ డిజైన్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఆ కంపెనీ విడుదల చేస్తున్న ద్విచక్ర వాహనాలతోపాటు భవిష్యత్తులో రాబోయే ఫోర్ వీలర్ శ్రేణి డిజైనింగ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. "నేను ఎప్పుడూ ఉత్సాహవంతులైన యువతతో పని చెయ్యాలని కోరుకుంటాను. పని వాతావరణం ప్రోత్సాహకరంగా ఉండేలా చూసుకుంటాను. అందరి సలహాలు తీసుకుంటాను. మహిళా ఆటో డిజైనర్‌గా నా ప్రయాణం ఒంటరిగా మొదలైంది. పదేళ్ళలో.... దాదాపు అయిదుగురు మహిళా డిజైనర్లను నా టీమ్‌లో చేర్చుకున్నాను. వారిలో ప్రతిఒక్కరూ తమదైన విభాగంలో ప్రత్యేక నైపుణ్యం కలిగినవారే" అంటారు రామ్‌కృప. "డిజైన్ల విషయంలో నాకు కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. డిజైన్లు కస్టమర్ అవసరాలకు అనువుగా ఉన్నాయా? కూర్చొనేవారికి సౌకర్యంగా ఉంటోందా? వాటి పని తీరు ఎలా ఉంటుంది? ముఖ్యంగా డ్రైవింగ్ ఎంత సురక్షితంగా ఉంటుంది?... ఈ అంశాలను నేను ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటాను" అని చెబుతున్న రామ్‌కృప ఖాళీ సమయాల్లో ట్రెక్కింగ్, ట్రావెలింగ్ చేస్తారు. తన బజాజ్ అవేంజర్ మీద మనాలీ నుంచి శ్రీనగర్‌కు పర్యటించారు. రోజూ వ్యాయామం చేస్తారు. వర్కవుట్స్ సమయంలోనూ, ప్రయాణాలు చేసేటప్పుడూ ఆడియో బుక్స్ వింటారు. రాబోయే మార్పులను ముందుగా గుర్తించి, వాటికి తనను తాను సంసిద్ధం చేసుకోవడమే డిజైనర్‌గా ఆమె విజయరహస్యం అంటారు ఆటోమేటివ్ రంగ నిపుణులు, ఆమె సన్నిహితులు.

ఒలిం'పిక్స్'

ముద్దు.. ముచ్చట!



పారిస్ ఒలింపిక్స్‌లో ఆటలతో పాటు మరో 'చిత్రం' కూడా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. విశ్వక్రీడల ప్రారంభోత్సవంలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయల్ మాక్రాన్, ఆ దేశపు క్రీడల మంత్రి అమేలీ ఔడియా కాస్టెరాల ముద్దు ఫొటో ఫ్రాన్స్‌లోనే కాదు... ప్రపంచమంతా 'హాట్ టాపిక్' అయింది. లక్షల్లో కామెంట్స్... కోట్లల్లో వ్యూస్... అంతకుమించిన షేర్స్‌తో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది ఈ ఫొటో. పాశ్చాత్య సంస్కృతిలో హగ్.. కిస్... వింతేమీ కాదు. అలాంటప్పుడు వారి ముద్దు ముచ్చటపై ఎందుకంత చర్చ? ఎందుకంటే... ఆ చిత్రంలో కనిపించిన గాఢతే అంటున్నారు నెటిజనులు. మాక్రాన్‌ను హత్తుకుని, ఒక చేత్తో మెడను చుట్టేసి, మరో చేయిని ఆయన చేతిలో వేసి, అమేలీ ముద్దు పెట్టిన తీరు అభ్యంతరకరంగా ఉందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఆ సమయంలో పక్కనే ఉన్న ఫ్రెంచ్ ప్రధాని గాబ్రియల్ అట్టాల్ తన చూపును పక్కకు తిప్పుకున్నారు. 'మర్యాదపూర్వకమైన పెక్ హద్దులు దాటింది' అని సొంత దేశస్థులే విమర్శలు కురిపిస్తున్నారు.

వాగ్దానం నిలబెట్టుకోవాలని...

ఫ్రెంచ్ పారిశ్రామికవేత్త అయిన 46 ఏళ్ల అమేలీ ఒకప్పుడు ప్రొఫెషనల్ టెన్నిస్ క్రీడాకారిణి కూడా. క్రీడలు, ఒలింపిక్, పారాఒలింపిక్ గేమ్స్ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. గతంలో మాక్రాన్ ఆమెకు క్రీడలతో పాటు విద్యా శాఖ బాధ్యతలు కూడా అప్పగించారు. అయితే టీచర్లు లేరన్న కారణంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తన కూతుర్ని తీసుకువెళ్లి ప్రైవేటు విద్యా సంస్థలో చేర్పడంతో దుమారం రేగింది. దాంతో విద్యా శాఖా మంత్రిగా అమేలీని బాధ్యతల నుంచి తప్పించాల్సి వచ్చింది. ఇదిలావుంటే ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి వేదిక అయిన సీన్ నది కాలుష్యమయమైందని, అందులో ఇ-కొలీ ప్రమాదకర స్థాయికి చేరిందని ప్రపంచ మీడియా వరుస కథనాలు రాసింది. ఇది వేదిక సురక్షితమైనది కాదని పేర్కొంది. 'ఆ కథనాల్లో వాస్తవం లేదని నిరూపించడానికి గేమ్స్‌కు ముందు ఆ నదిలో ఈత కొడతా'నని అమేలీ నాడు ఉద్ఘాటించారు. చెప్పినట్టుగానే ఒలింపిక్స్ ప్రారంభానికి కొద్ది రోజుల ముందు ఆమె సీన్ నదిలో మునిగి చూపించారు. 'మేము మా వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాం' అంటూ బలమైన సందేశం పంపించారు.

ఫ్యాషన్

లవ్లీ లాంగ్ గౌన్స్

నిండుగా కనిపించడం కోసం చీర కట్టడం ఓల్డ్ ఫ్యాషన్ అనుకుంటే, బదులుగా లాంగ్ గౌన్స్ ఎంచుకోవచ్చు. రకరకాల మెటీరియల్స్‌లో, వేర్వేరు డిజైన్లలో దొరికే లాంగ్ గౌన్స్ అటు సంప్రదాయ వేడుకలకూ, ఇటు ఆధునిక ఫంక్షన్లకూ సూటవుతాయి. ప్రస్తుతం మార్కెట్లో దుమ్ము రేపుతున్న లేటెస్ట్ లాంగ్ గౌన్స్ మీద ఓ లుక్కేద్దాం!



భిన్నమైన మోడల్స్‌లో...

జార్జెట్, షిఫాన్, కాటన్, లెనిన్... ఇలా వేర్వేరు మెటీరియల్స్‌తో తయారయ్యే లాంగ్ గౌన్స్‌ను సందర్భానికి తగ్గట్టు ఎంచుకోవచ్చు. శాటిన్, కాటన్, సింథటిక్.. ఇలా వేర్వేరు లైనింగ్స్‌తో ఆకట్టుకునే డిజైన్లతో దొరికే లాంగ్ గౌన్స్‌లో మన ఒడ్డూ, పొడవుకు నప్పే గౌన్స్ ఎంచుకోవాలి. బక్కపలుచగా ఉండే అమ్మాయిలకు కాటన్ లాంగ్ గౌన్స్ బాగుంటే, ముద్దుగా బొద్దుగా ఉండే అమ్మాయిలకు జార్జెట్, షిఫాన్ లాంగ్ గౌన్స్ బాగుంటాయి. అలాగే బోల్డ్ లుక్ కావాలనుకునేవాళ్లు స్లీవ్‌లెస్, ఫ్రిల్స్ ఉన్న గౌన్ ఎంచుకోవచ్చు. ఫ్యాషనబుల్‌గా కనిపించాలనుకుంటే, సెక్విన్స్, మోటిఫ్స్, డోరీస్ ఉన్న లాంగ్ గౌన్ ఎంచుకోవచ్చు.



సందర్భానుసారంగా...

ఓవర్ కోట్, కాలర్స్, కార్డిగాన్ మోడల్ లాంగ్ గౌన్స్ రెట్టింపు ఆధునికంగా ఉంటాయి. టాప్, బాటమ్‌లా వేర్వేరు దుస్తులను కలిపి అతికించినట్టుండే లాంగ్ గౌన్స్ కూడా బాగుంటాయి. జరీ అంచు నారాయణ్ పేట చీరలనే లాంగ్ గౌన్స్‌గా కుట్టించే ఫ్యాషన్ కూడా చలామణీ అవుతోంది. ఇవి పెళ్లిళ్ల లాంటి వేడుకలకు ఎంతో బాగుంటాయి. అలాగే మెడ బోసిగా ఉందని అనిపిస్తే లాంగ్ గౌన్స్‌కు జోడీగా చున్నీలను కూడా వేసుకోవచ్చు. ఆధునికంగా కనిపించే లాంగ్ గౌన్స్‌కు విక్టోరియన్ జ్యువెలరీ, సంప్రదాయంగా కనిపించే లాంగ్ గౌన్స్‌కు గోల్డ్ జ్యువెలరీ బాగుంటాయి.



ఎల్ఐసీలో మరో 5% వాటా విక్రయం?

ఎఫ్‌పీఓ లేదా క్యూఐపీ ద్వారా విక్రయించే చాన్స్

ఎంపీఎస్ నిబంధనలు పూర్తి చేసేందుకే..



న్యూఢిల్లీ: భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఈక్విటీలో మరో 5 శాతం వాటా అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఫాలో ఆన్ ఆఫర్ (ఎఫ్‌పీఓ) లేదా క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషన్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా ఈ వాటాను విక్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ వాటా విక్రయం ఉంటుందని తెలుస్తోంది. ఇది కూడా భారత ఐపీఓ చరిత్రలో మరో బాహుబలి ఇష్యూ అవుతుందని మార్కెట్ వర్గాల అంచనా. మినిమమ్ పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) నిబంధనలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈ వాటా విక్రయం తలపెట్టినట్టు సమాచారం. 2027 మే 16లోగా ఎల్ఐసీ ఈక్విటీలో కనీసం 10 శాతం ఎంపీఎస్ పూర్తి చేసేందుకు సెబీ ఈ ఏడాది మే 14న అనుమతి ఇచ్చింది. ఈ నిబంధన పూర్తి చేసేందుకు ఎల్ఐసీ ఈక్విటీలో మరో ఐదు శాతం వాటా విక్రయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

మదుపరులకు చేదు అనుభవం

2022 మే నెలలో ఎల్ఐసీ ఈక్విటీలో 3.5 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా విక్రయించింది. ఈ బాహుబలి ఐపీఓ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.21,000 కోట్లు చేరాయి. అయితే ఈ భారీ ఐపీఓ మదుపరులకు లిస్టింగ్ రోజే చేదు అనుభవం మిగిల్చింది. ఒక్కో షేరును రూ.949 చొప్పున జారీ చేయగా, లిస్టింగ్ రోజే రూ.902కు పడిపోయింది. గత 52 వారాల్లో ఒక దశలో రూ.597.65 కనిష్ఠ స్థాయిని తాకింది. ఈ ఏడాది జనవరి 17న మాత్రమే ఎల్ఐసీ షేరు ఐపీఓ జారీ ధరను క్రాస్ చేసింది. మంగళవారం ఎల్ఐసీ షేరు 2.49% నష్టపోయి రూ.1,079.20 వద్ద క్లోజైంది. దీంతో మరో విడత జారీ చేసే ఎఫ్‌పీఓ మదుపరులను ఎంతగా ఆకర్షిస్తుందో వేచి చూడాల్సిందే.

రియల్టీ లాభాల పన్నుపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం



స్థిరాస్తి యజమానులకే ఎంచుకునే చాన్స్

న్యూఢిల్లీ: స్థిరాస్తుల (రియల్టీ) అమ్మకంపై వచ్చే లాభాలపై విధించే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ)పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇండెక్సేషన్ ప్రయోజనంతో కూడిన పాత విధానం ఎంచుకోవాలా? లేక ఇండెక్సేషన్ ప్రయోజనం లేని కొత్త విధానం ఎంచుకోవాలా? అనే విషయాన్ని స్థిరాస్తుల యజమానులకే వదిలి వేసింది. ఈ విధానంలో పన్ను భారం తక్కువగా ఉంటే, ఆ విధానాన్ని స్థిరాస్తుల యజమానులు ఎంచుకోవచ్చని తెలిపింది. పాత విధానం ఎంచుకుంటే, గత నెల 23వ తేదీకి ముందు అమ్మిన స్థిరాస్తుల దీర్ఘకాలిక లాభాలపై ఇండెక్సేషన్ ప్రయోజనంతో 20 శాతం ఎల్‌టీసీజీటీ చెల్లించాలి. అదే బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఇండెక్సేషన్ ప్రయోజనం లేని కొత్త విధానం ఎంచుకుంటే 12.5 శాతం ఎల్‌టీసీజీటీ చెల్లిస్తే సరిపోతుంది. కొత్త విధానంలో ఎల్‌టీసీజీటీ పైకి తక్కువగా కనిపిస్తున్నా, ఇండెక్సేషన్ ప్రయోజనం తీసివేయడం అధిక పన్ను భారానికి దారితీస్తుందని స్థిరాస్తుల యజమానుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఏ విధానంలో తక్కువ ఎల్‌టీసీజీటీ భారం ఉంటే, స్థిరాస్తుల అమ్మకందారులు ఆ విధానాన్ని ఎంచుకోవచ్చని అధికార వర్గాలు చెప్పాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దీనికి సంబంధించి బుధవారం పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు.

బిజినెస్

తగ్గిన గ్లాండ్ ఫార్మా లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా నికర లాభం 26 శాతం తగ్గి రూ.143.80 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.194.10 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ మాత్రం రూ.1,208.70 కోట్ల నుంచి రూ.1,401.70 కోట్లకు పెరిగింది. జూన్ త్రైమాసికంలో నికర లాభం తగ్గినప్పటికీ రెవెన్యూపరంగా మెరుగైన పనితీరును కనబరిచినట్లు గ్లాండ్ ఫార్మా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సీఈఓ శ్రీనివాస్ సాదు తెలిపారు.

ఎన్‌సీసీ లాభం రూ.210 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ రూ.5,558.33 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.209.92 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.4,406.72 కోట్లుగా ఉండగా లాభం రూ.173.54 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో కొత్తగా రూ.408 కోట్ల ఆర్డర్లను చేజిక్కించుకోవటంతో కంపెనీ ఆర్డర్ బుక్ రూ.52,626 కోట్లకు చేరుకుంది.

18న ఫాబా ఇన్నోవేషన్ సమ్మిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికవుతోంది. ఈ నెల 18న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూవోహెచ్)లో 'ఫాబా ఇన్నోవేషన్ క్లస్టర్ సదస్సు' జరగనుంది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంతో కలిసి 'ది ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఫాబా) ఈ సదస్సు నిర్వహిస్తోంది. ఈ సదస్సుకు 300 మంది వరకు ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని ఫాబా ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పీ రెడ్డన్న చెప్పారు. ఈ సదస్సుకు ముందు రోజు (17వ తేదీ) 'వేల్ ట్యాంక్ 2.0' పేరుతో బయోటెక్ స్టార్టప్స్ ప్రదర్శన ఉంటుందన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,710 ▼	63,900 ▼	87,500 ▼
ముంబై	69,182 ▲	63,371 ▲	79,158 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	430
వరంగల్	422	గోదావరి	426
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	75	విజయవాడ	85
వరంగల్	75	గుంటూరు	85
కరీంనగర్	75	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	75	చిత్తూరు	87
కర్నూలు	75	నెల్లూరు	87
విశాఖపట్నం	81	అనంతపురం	85
గోదావరి	85		

ఎస్‌బీఐ కొత్త ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

మూడేళ్ల కాలానికి నియమించిన కేంద్రం



న్యూఢిల్లీ:భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కొత్త ఛైర్మన్‌గా తెలంగాణ వ్యక్తి చల్లా శ్రీనివాసులు శెట్టిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం శెట్టి ఎస్‌బీఐ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28తో పదవీ కాలం ముగియనున్న ప్రస్తుత ఛైర్మన్ దినేశ్ ఖారా స్థానాన్ని శెట్టి భర్తీ చేస్తారు. శ్రీనివాసులు శెట్టిని ఎస్‌బీఐ ఛైర్మన్‌గా నియమించాలన్న ఆర్థిక సేవల డిపార్ట్‌మెంట్ ప్రతిపాదనను అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది కేబినెట్ ఆమోదించింది. అలాగే, రాణా అశుతోష్ కుమార్ సింగ్‌ను బ్యాంక్ కొత్త ఎండీగా నియమించింది. ప్రస్తుతం సింగ్ బ్యాంక్ డిప్యూటీ ఎండీగా ఉన్నారు. దేశంలో అతిపెద్ద బ్యాంకైన ఎస్‌బీఐలో ఛైర్మన్‌తో పాటు నలుగురు ఎండీలు ఉంటారు.

బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ టెక్నాలజీ

అభివృద్ధి చేసిన డీఆర్‌డీఓ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) సరికొత్త బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. పీబీఏటీ అనే బయోడీగ్రేడబుల్ పాలిమర్ సాయంతో డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ కే వీరబ్రహ్మం నాయకత్వంలోని బృందం ఈ సరికొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసింది. పెట్రోలియం ఉత్పత్తులు లేదా వృక్ష ఆధారిత నూనెల నుంచి ఈ పాలిమర్‌ను సేకరిస్తారు. ఈ పాలిమర్ ద్వారా తయారు చేసే బ్యాగులు మూడు నెలల్లో భూమిలో కుళ్లిపోతాయని వీరబ్రహ్మం చెప్పారు. దీనివల్ల పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదన్నారు. డీఆర్‌డీఓ ఈ టెక్నాలజీని ఇప్పటికే నలభైకి పైగా కంపెనీలకు బదిలీ చేసింది.

3 రోజుల్లో రూ.22 లక్షల కోట్లు ఆవిరి

భారీ లాభాల నుంచి స్వల్ప నష్టాల్లోకి సూచీలు.. సెన్సెక్స్ 166 పాయింట్లు డౌన్

24,000 దిగువ స్థాయికి నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. క్రితం సెషన్‌లో 2,222 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్.. ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో మంగళవారం మోస్తరు లాభాలతో ట్రేడింగ్‌ను ఆరంభించి ఒక దశలో 1,092 పాయింట్ల వరకు ఎగబాకింది. కానీ, భారీ లాభాలను ఎంతో సేపు నిలబెట్టుకోలేకపోయింది. ఆఖరి గంటలో బ్యాంకింగ్, టెలికాం రంగ షేర్లలో అమ్మకాలు ఊపందుకోవడంతో చివరికి సూచీ 166.33 పాయింట్ల నష్టంతో 78,593.07 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 327 పాయింట్ల వరకు పుంజుకున్నప్పటికీ.. క్రమంగా తగ్గుతూ వచ్చి నష్టాల్లోకి మళ్లించి. చివరికి 63.05 పాయింట్ల నష్టంతో 23,992.55 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 24,000 కీలక స్థాయిని చేజార్చుకుంది.

మధ్యాహ్నం ప్రారంభమైన యూరప్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం, అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు కొనసాగడం, ఆర్‌బీఐ పరపతి సమీక్షకు ముందు మదుపర్ల అప్రమత్తత ఇందుకు కారణమయ్యాయి. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 3,274.48 పాయింట్లు (3.99 శాతం) క్షీణించింది. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఈ మూడ్రోజుల్లో రూ.22.03 లక్షల కోట్లు తగ్గి రూ.439.60 లక్షల కోట్లకు (5.24 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 నష్టపోయాయి.



అకుమ్స్ డ్రగ్స్ షేరు 17% అప్

గతవారంలో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ను ముగించుకున్న అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్.. మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.679తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 6.77 శాతం ప్రీమియంతో రూ.725 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో మరింత పుంజుకుంది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 17.44 శాతం లాభంతో రూ.797.45 వద్ద స్థిరపడింది.

పసిడి పడింది..

బులియన్ ధరలు భారీగా తగ్గాయి. మంగళవారం ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,100 తగ్గి రూ.71,700కు దిగివచ్చింది. ఆభరణ వర్తకులు, రిటైల్ కొనుగోలుదారుల నుంచి గిరాకీ తగ్గడం ఇందుకు కారణమైంది. కిలో వెండి కూడా రూ.2,200 తగ్గుదలతో రూ.82,000కు పరిమితమైంది. వెండి ధరలు తగ్గడం వరుసగా ఇది నాలుగో రోజు. ఈ 4 రోజుల్లో కిలో వెండి రూ.4,200 తగ్గిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. హైదరాబాద్ మార్కెట్లో తులం మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.670 తగ్గి రూ.69,710కి జారుకోగా.. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గి రూ.87,500కు దిగివచ్చింది. రూపాయి మరింత బలహీనపడటంతో పాటు పండుగలు, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడం దేశీయంగా బులియన్ ధరలకు మద్దతివ్వవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ అన్నారు.



సూరత్ వజ్రాల పరిశ్రమకు మాంద్యం భయాలు

50,000 మంది ఉద్యోగులకు సెలవులు

సూరత్: గుజరాత్, సూరత్‌లోని డైమండ్ పాలిషింగ్ కంపెనీలను ఆర్థిక మాంద్యం భయాలు వెంటాడుతున్నాయి. కొన్ని సంస్థలపై ఇప్పటికే ఈ ప్రభావం కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ నుంచి సానపెట్టిన వజ్రాలకు డిమాండ్ పడిపోయింది. దీంతో కంపెనీల వద్ద పెద్ద మొత్తంలో సానపట్టిన వజ్రాల నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు కంపెనీలు ముందు జాగ్రత్త పడుతున్నాయి. ఇందులో భాగంగా ఉద్యోగులకు తాత్కాలికంగా సెలవులు ప్రకటిస్తున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద నేచురల్ డైమండ్స్ కంపెనీగా పేరొందిన కిరణ్ జెమ్స్ అనే కంపెనీ ఇప్పటికే 50,000 మంది ఉద్యోగులకు ఈ నెల 17 నుంచి 27 వరకు సెలవు ప్రకటించింది.

తప్పడం లేదు: మాంద్యం కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ ఛైర్మన్ వల్లభ్ బాయ్ లఖానీ చెప్పారు. ప్రస్తుతం ముడి వజ్రాల సరఫరా కూడా తగినంతగా లేదని తెలిపారు. ఈ సెలవుల కాలానికి కూడా ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తామన్నారు. సానపట్టిన వజ్రాల తయారీని హేతుబద్ధం చేసేందుకు ఈ నిర్ణయం ఉపకరిస్తుందన్నారు. మిగతా కంపెనీలు కూడా త్వరలోనే ఇదే బాట పడతాయని భావిస్తున్నారు. సూరత్‌లోని దాదాపు 4,000 వరకు ఉన్న చిన్న, పెద్ద డైమండ్ పాలిష్ యూనిట్లలో దాదాపు 10 లక్షల మంది పని చేస్తున్నారు. ఆర్థిక మాంద్యం ముదిరితే వీరిలో ఎక్కువ మంది రోడ్డున పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

15న 100 అన్న క్యాంటీన్లు ప్రారంభం

- 33 మున్సిపాలిటీల్లో ఏర్పాటుకు సిద్ధం కండి
- మున్సిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్రంలో వంద అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. సచివాలయంలోని తన చాంబర్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్న క్యాంటీన్ భవన నిర్మాణాల పనులు, మురుగు కాలువల్లో పూడికతీతతోపాటు పలు ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అన్న క్యాంటీన్ల భవన నిర్మాణ పనులు ఎంత మేరకు వచ్చాయి... కిచెన్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలు మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈనెల పదోతేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకుని వంద క్యాంటీన్లు అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. రాబోయే వారంరోజులపాటు మున్సిపల్ కమిషనర్లు అన్న క్యాంటీన్లపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని 33 మున్సిపాలిటీల్లో ఈ క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. మరో 83 క్యాంటీన్లు ఈనెలాఖరులోగా పూర్తి చేసేలా ముందుకెళ్లాలని మంత్రి ఆదేశించారు. మరో 20 క్యాంటీన్లు సెప్టెంబరు నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా అన్ని మున్సిపాలిటీ డ్రెయిన్‌లలో పూడిక తీయాలని కమిషనర్లను మంత్రి ఆదేశించారు. ఈ నెల 20వ తేదీలోగా పనులు పూర్తి చేయాలన్నారు. టిడ్కో ఇళ్లకు మౌలిక వసతుల కల్పనపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని మంత్రి నారాయణ సూచించారు. సీఆర్‌డీఏ పరిధిలోని టిడ్కో ఇళ్లకు మౌలిక వసతుల కల్పన బాధ్యతను సీఆర్‌డీఏకు అప్పగించినట్లు మంత్రి తెలిపారు.

త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు

ఇతర రాష్ట్రాల్లోని లోటుపాట్లను పరిశీలిస్తున్నాం: రాంప్రసాద్‌రెడ్డి



తిరుమల, తిరుపతి ఆర్టీసీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తమ విజయానికి కారణమైన రాష్ట్ర మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణాన్ని త్వరలో ప్రారంభిస్తామని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన.. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పథకాన్ని ఇప్పటికే అమలు చేస్తున్న తెలంగాణ, కర్ణాటకలో అధికారులు పర్యటించి లోటుపాట్లను పరిశీలిస్తున్నారని తెలిపారు.

గత ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్టీసీ ఉద్యోగులకు ఇబ్బందులు

గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఆర్టీసీ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. తిరుపతిలోని అలిపిరి డిపోను సందర్శించిన మంత్రి.. రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించి, మాట్లాడారు. ఇప్పటికే 400కొత్త బస్సులు రోడ్డెక్కాయని, మరో వెయ్యి బస్సులు సిద్ధమవుతున్నాయన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంతో అంటకాగిన అధికారులకు స్థానచలనం తప్పదని హెచ్చరించారు. నిబంధనలకు లోబడే బదిలీలు ఉంటాయన్నారు. యాత్రికుల భవిష్యత్తు సౌకర్యాలకనుగుణంగా తిరుపతిలో అధునాతన బస్సుస్టేషన్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో చిత్తూరు, కడప జిల్లాల నుంచి బెంగళూరుకు ఇసుక అక్రమ రవాణా జరిగేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క స్పూను ఇసుక కూడా పక్కరాష్ట్రాలకు తరలించలేని పరిస్థితులు కల్పించామని మంత్రి తెలిపారు. రాజకీయ ఎదుగుదల, సొంత సంస్థల అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకుంటే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదని మంత్రి హెచ్చరించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాజెక్టుల నిర్మాణం పేరిట రైతుల భూములపై ఆంక్షలు విధించి ముప్పతిప్పలు పెట్టారని ఆగ్రహించారు.

రావణాసురుడు, శిశుపాలుడి పాలన పోయింది

- ప్రజా సమస్యలను పట్టించుకోని జగన్: గోనె ప్రకాశరావు



అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రావణాసురుడు, శిశుపాలుడి పాలన పోయిందని మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు వ్యాఖ్యానించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును ఆయన కలిశారు. అనంతరం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రజా దర్బార్‌లు నిర్వహించి చంద్రబాబు, లోకేశ్ ప్రజలకు మంచి చేస్తున్నారన్నారు. తన సొంత బంధువులే తనకు తెలియదంటూ సీబీఐ కోర్టుకి అబద్ధాలు చెప్పిన జగన్ దుర్మార్గుడు, పిరికివాడని విమర్శించారు.

జగన్ చేసిన అప్పులను పునర్వ్యవస్థీకరించాలి

- ఏపీని కేంద్రమే ఆదుకోవాలి.. లోక్‌సభలో టీడీపీ ఎంపీ లావు



న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చేసిన అప్పులను పునర్వ్యవస్థీకరించాలని కేంద్రానికి టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనలో ఏపీ అప్పుల పాలైందని, ఈ రుణ భారం రాష్ట్రానికి గుదిబండలా తయారైందని అన్నారు. మంగళవారం ఆర్థిక బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన లోక్‌సభలో మాట్లాడారు. కష్టాల్లో ఉన్న ఏపీని కేంద్రమే ఆదుకోవాలని కోరారు. ఏపీలో రెవెన్యూ లోటు, అప్పుల భారం అధికంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిందని, ఈ ప్రతులను పార్లమెంట్ సభ్యులందరికీ అందజేస్తామని పేర్కొన్నారు. దేశంలో 70శాతం ఆక్వా ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయని తెలిపారు. పీఎం మత్స్య సంపద యోజన కింద ఆక్వా పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు. ఇతర సభ్యులు చెప్పినట్టు ఏపీకి ప్రత్యేక నిధులేమీ ఇవ్వడం లేదన్నారు. పూర్వోదయ పథకం కింద రాష్ట్రానికి రూ.62వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని తెలిపారు. '2019లో రాష్ట్రానికి రూ.3.75 లక్షల కోట్లు అప్పు ఉంటే, జగన్ పాలనలో 2024కి అది రూ.9.74 లక్షల కోట్లకు పెరిగింది. గత ఐదేళ్లలో వృద్ధిరేటు 13.5శాతం నుంచి 10.5శాతానికి పడిపోయింది. వ్యవసాయ రంగంలో వృద్ధి 16శాతం నుంచి 10 శాతానికి దిగజారింది. రాష్ట్రంలో తలసరి అప్పు రెట్టింపైంది. ఒక్కొక్కరిపై అప్పు రూ.74 వేల నుంచి రూ.1.44 లక్షలకు చేరింది. దీర్ఘకాలిక కేపిటల్ గెయిన్స్‌పై పన్ను విధించే విషయంలో పునరాలోచన చేయాలి. ఆరోగ్య బీమా పాలసీలపై విధిస్తున్న 18శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించాలి. టెక్స్‌టైల్ రంగాన్ని ఆదుకొనేందుకు పత్తి దిగుమతులపై సుంకాలు తగ్గించాలి' అని శ్రీకృష్ణదేవరాయలు కోరారు.

టీడీపీలోకి టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి మేనల్లుడు



నందికొట్కూరు, ఆగస్టు 6: టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి మేనల్లుడు నాగిరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం తర్తూరు గ్రామ సర్పంచ్ నాగిరెడ్డితో పాటు దాదాపు 150 కుటుంబాలు టీడీపీ కండువా కప్పుకున్నాయి. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరం కలిసి కట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు.

వివేకా హత్య కేసులో..

ఉమాశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏ-3గా ఉన్న గజ్జల ఉమాశంకర్‌రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసుకున్న పిటిషన్‌ను నాంపల్లి సీబీఐ కోర్టు కొట్టివేసింది. మంగళవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఈ హత్య కేసుతో తనకు సంబంధం లేదని.. బెయిల్ ఇవ్వాలని ఉమాశంకర్‌రెడ్డి గతంలోనూ పలుసార్లు పిటిషన్లు వేయగా.. కోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే.

ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ సీట్లకు ఎన్‌ఆర్‌ఐ కోటా కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఈనెల 9వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రరావు మంగళవారం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను స్వయంగా గానీ, లేదా పోస్టు ద్వారా గానీ వర్సిటీకి పంపించవచ్చన్నారు.

ట్రాన్స్‌కో లైన్లు వాడే సంస్థలకు టారిఫ్ ఖరారు!

- వచ్చే ఐదేళ్లలో రూ.10,692.98 కోట్లు వసూలు
- ట్రాన్స్‌కో వ్యయ నివేదికకు ఈఆర్‌సీ సమ్మతి

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ట్రాన్స్‌కో లైన్లను వినియోగించుకునే ప్రైవేటు విద్యుత్తు సంస్థలకు టారిఫ్‌లను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఖరారు చేసింది. ట్రాన్స్‌మిషన్ చార్జీల కింద నెలకు కిలోవాట్‌కు రూ.180.83 నుంచి రూ.208.67 వరకూ వసూలు చేసుకోవచ్చని తెలిపింది. 2024-25 నుంచి 2028-29 దాకా ఐదేళ్ల పాటు ఖర్చు చేయనున్న పెట్టుబడి వ్యయాలకు సంబంధించి ఈఆర్‌సీకి ట్రాన్స్‌కో ప్రతిపాదనలు పంపింది. వాటిపై ఈఆర్‌సీ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రానున్న ఐదేళ్లలో రూ.15,729.41 కోట్లను వ్యయం చేయనున్నట్టు ట్రాన్స్‌కో తన ప్రతిపాదనల్లో తెలిపింది. అందులో రూ.5036.43 కోట్లకు కోతవేసి రూ.10692.98 కోట్లను ఈఆర్‌సీ ఖరారుచేసింది. అదేవిధంగా డిస్కమ్‌లద్వారా ఓపెన్ యాక్సెస్ వినియోగదారులనుంచి ఐదేళ్లలో రూ.25,304.18 కోట్లను వాస్తవ ఆదాయ అవసరాల కింద వసూలు చేసుకుంటామంటూ ఈఆర్‌సీకి ట్రాన్స్‌కో ప్రతిపాదించింది. ఇందులో రూ.5,309.58 కోట్లను తగ్గించి, 19,994.60 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదముద్ర వేసింది. ఐదేళ్లలో సగటున 2.70శాతం మేర విద్యుత్తు ప్రవాహనష్టాలు ఉంటాయన్న ప్రతిపాదనలను ఈఆర్‌సీ యథాతథంగా ఆమోదించింది. అత్యవసర వేళల్లో పీక్ డిమాండ్ సగటున ఐదేళ్లలో 19.913 మెగావాట్ల డిమాండ్ ఉంటుందని ట్రాన్స్‌కో ప్రతిపాదించింది. ఇందులో సగటున ఏడాదికి 19.019 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉంటుందని ఈఆర్‌సీ అంగీకరించింది. కాగా, ప్రతినెలా ట్రాన్స్‌మిషన్ చార్జిల కింద ప్రైవేటు విద్యుత్ సంస్థల నుంచి నెలకు 2024-25లో రూ.180.83, 2025-26లో రూ.194.25, 2026-27లో 201.80, 2027-28లో 205.62, 2028-29లో 208.67 చొప్పున వసూలు చేసుకునేందుకు ఈఆర్‌సీ ఆమోద ముద్ర వేసింది. విద్యుత్ సంస్థల కోసం నిర్ణయించిన ఈ టారిఫ్‌ల ప్రభావం పరోక్షంగా భవిష్యత్తులో వినియోగదారులపై కూడా ఉండే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

విచ్చుకుంటున్న కొత్త రెక్కలు!

- కుప్పం,దగదర్తి, సాగర్, మూలపేటల్లో విమానాశ్రయాలు
- కక్షపూరితంగా నాడు ఆపేసిన ప్రాజెక్టుల్ని పట్టాలెక్కించాలి
- ఆగిపోయిన పోర్టులు, ఫిషింగ్ హార్బర్లనూ పూర్తి చేయాలి
- పెట్టుబడులు-మౌలిక సదుపాయాలశాఖపై సమీక్షలో చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా దగదర్తి, చిత్తూరు జిల్లా కుప్పం, పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లలో గతంలోనే ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టులు, ఎయిర్ స్ట్రిప్‌ల నిర్మాణంతోపాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని కూడా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటితోపాటు అనంతపురం జిల్లా తాడిపత్రి, కాకినాడ జిల్లా తుని ప్రాంతంలో కూడా ఎయిర్‌పోర్టులు, ఎయిర్‌స్ట్రిప్‌లు నిర్మించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో కొత్తగా 12 నుంచి 14 విమానాశ్రయాలను అందుబాటులోకి తీసుకురావాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో పెట్టుబడులు-మౌలిక సదుపాయాలశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని విమానాశ్రయాలు, ఓడరేవులు, జాతీయ రహదారులను అనుసంధానం చేయడం ద్వారా వేగవంతమైన అభివృద్ధిని సాధించడంతోపాటు పెద్దఎత్తున ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని ఎయిర్‌పోర్టుల ద్వారా సరుకు రవాణా చేసేలా ప్రాజెక్టులు రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు ఎయిర్‌పోర్టులో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలను తీసుకురావాలన్నారు.2014-19 మధ్య కాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపాదించిన విమానాశ్రయాల నిర్మాణానికి భూసేకరణ కూడా పూర్తయిందని తెలిపారు. వాటితోపాటు గతంలో ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులన్నింటినీ.. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి కొన్ని ప్రాజెక్టులను నిలిపివేసిందని, మరికొన్నింటిని రద్దు చేసేసి సంపదను సృష్టించే కేంద్రాలను దెబ్బతీసిందని విమర్శించారు. అర్థంతరంగా ఆగిపోయిన ఆ ప్రాజెక్టులన్నింటినీ మళ్లీ పట్టాలెక్కించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చేలా మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులను మళ్లీ గాడినపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు, ఏపీ మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వివిధ ప్రాజెక్టుల్లోని ఎస్‌పీవీలు (స్పెషల్ పర్పస్ వెహికల్స్), ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివాదాలకు తావు లేకుండా రాష్ట్రంలో చేపట్టిన అన్ని పోర్టులను, ఫిషింగ్ హార్బర్‌లను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఏపీ మారిటైం మాస్టర్ ప్లాన్‌తోపాటు మారిటైం పాలసీని తీసుకువస్తామని చెప్పారు. ఆనాడు సుదీర్ఘ కాలం కసరత్తు చేసి తలపెట్టిన ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో పోర్టుల నిర్మాణ పనులపైనా సీఎం సమీక్షించారు. గత ప్రభుత్వంలో ప్రారంభమై ఆగిపోయిన పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను పూర్తి చేయాలని నిర్ణయించారు. వీలైనంత త్వరగా ఆ పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రామాయపట్నం పోర్టు కాంట్రాక్టర్ విషయంలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా.. గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయలేమని చెప్పారు.

ఫైబర్‌నెట్‌లో డాక్యుమెంట్లు స్వాధీనం...

గత ప్రభుత్వంలో ఏపీ ఫైబర్‌నెట్‌లో జరిగిన అవకతవకలపై చంద్రబాబు ఆరా తీశారు. ఈ కార్పొరేషన్‌ను కడపకు చెందిన వైసీపీ కార్యకర్తలతో నింపేశారని, వారిలో సగం మందికిపైగా పనిచేయకుండానే జీతాలు తీసుకుంటున్నారనే అంశంపై చర్చ జరిగింది. ఫైబర్ నెట్ కనెక్షన్లకు లెక్కలు లేవని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఫైబర్‌నెట్ పేరు మీద రూ. 1500 కోట్లు రుణం తీసుకుని ఆ మొత్తాన్ని పక్కదారి పట్టించారని తెలిపారు. ఫైబర్‌నెట్ కనెక్షన్లు కూడా భారీగా తగ్గిపోయాయని, గతంలో 9 లక్షల కనెక్షన్లు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 5 లక్షలకు పడిపోయిందని అధికారులు వెల్లడించారు. పైగా ఫైబర్‌నెట్ వినియోగదారుల నుంచి నగదు రూపంలో చార్జీలు వసూలు చేయడం వల్ల భారీస్థాయిలో అవకతవకలు జరిగాయని వివరించారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. కనెక్షన్ల చార్జీల సొమ్మును కూడా దోచేశారా? అంటూ చంద్రబాబు అవాక్కయ్యారు. ఇప్పటివరకు సీజ్ చేసి ఉంచిన ఫైబర్‌నెట్ కార్యాలయాన్ని తెరిచి.. డాక్యుమెంట్లన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్‌ను జీఏడీ పరిధిలోకి, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌ను సమాచార, ప్రసారశాఖ పరిధిలోకి తీసుకురావాలని, అలాగే ఏపీ టవర్స్ కార్పొరేషన్‌ను ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్‌లో విలీనం చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కంటెంట్ కార్పొరేషన్, డ్రోన్ కార్పొరేషన్, ఏపీ టవర్స్ కార్పొరేషన్, గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌లను కూడా మళ్లీ గాడిలో పెట్టి వాటి సేవలను పునరుద్ధరించాలని చంద్రబాబు ఆదేశించారు.

రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీ

- ఆ సంస్థ గ్లోబల్ సీఈవో, గూగుల్ ఏపీఏసీ హెడ్‌తో సీఎం వర్చువల్ చర్చలు

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : యూట్యూబ్ అకాడమీ రాష్ట్రానికి వచ్చేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. యూట్యూబ్ గ్లోబల్ సీఈవో నీల్‌మోహన్, గూగుల్ ఏపీఏసీ హెడ్ సంజయ్ గుప్తాలతో సీఎం చంద్రబాబు మంగళవారం వర్చువల్‌గా చర్చలు జరిపారు. స్థానిక భాగస్వాముల సహకారంతో రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీని ఏర్పాటు చేసే అంశంపై వారితో చర్చించినట్లు ఎక్స్‌లో చంద్రబాబు వివరించారు.

'ఎన్టీఆర్ యూనివర్సిటీ' పేరు కోసం!

- సర్టిఫికెట్లకు దరఖాస్తు చేయని విద్యార్థులు
- ఎన్టీఆర్ పేరుతోనే తీసుకోవాలని నిర్ణయం

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని హెల్త్ యూనివర్సిటీకి వైఎస్ పేరు తొలగించి ఎన్టీఆర్ పేరు పెట్టిన విషయం తెలిసిందే. దీంతో సంబంధిత ఫైల్స్‌లో అధికారులు ఎన్టీఆర్ పేరును చేరుస్తున్నారు. దీంతో విద్యార్థులు ఎన్టీఆర్ పేరుతో ముద్రించిన సర్టిఫికెట్లు తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు. వర్సిటీ అధికారులు కూడా ఆఘమేఘాల మీద ఎన్టీఆర్ పేరుతో సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను తొలగించారు. కానీ, హెల్త్ యూనివర్సిటీలో మాత్రం వైఎస్ విగ్రహం అలానే ఉంది.

పోలవరానికి దారేది?

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ పోలవరం ప్రాజెక్టు పరిస్థితి, భవిష్యత్ పనులపై కీలక ప్రతిపాదనలు చేసింది. కేంద్ర ప్రభుత్వం వద్దువద్దని పదేపదే చెప్పినా... 2019లో జగన్ సర్కారు కాంట్రాక్టు సంస్థను మార్చేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో 'మేఘా' సంస్థకు పోలవరం పనులు అప్పగించింది. ఆ తర్వాత.. డయాఫ్రమ్‌వాల్ దెబ్బతినింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు సీపేజీకి గురయ్యాయి. నిర్మాణ దశలోనే గైడ్ బండ్ కుంగిపోయింది. ఇప్పుడు వీటన్నింటినీ సరిదిద్దాల్సి ఉంది. ఈ నేపథ్యంలో... ప్రస్తుత కాంట్రాక్టును సంస్థను మార్చి, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అనుభవమున్న సంస్థకు పనులు అప్పగించడంపై పరిశీలించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదించారు.

నష్టాన్ని కేంద్రానికి వివరించాలి...

డయాఫ్రం వాల్ నిర్మాణానికి కొత్తగా టెండర్లు పిలవాలా.. ప్రస్తుత నిర్మాణ సంస్థకే పనులు అప్పగించాలా అనేది తేల్చిచెప్పాలని కేంద్ర జల సంఘాన్ని కోరాలని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడిని, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను చంద్రబాబు ఆదేశించారు. ఇందుకోసం త్వరలోనే ఢిల్లీ వెళ్లాలని వారిద్దరికీ సూచించారు. పోలవరం నిర్మాణంలో జాప్యం జరిగేకొద్దీ ఎదురయ్యే అనర్థాలను తెలియజెప్పాలని.. అంచనా వ్యయం పెరగడం.. రాష్ట్రానికి జరిగే నష్టాన్ని కేంద్రానికి వివరించాలని స్పష్టం చేశారు. నిర్మాణ సంస్థ విషయంలో కేంద్రానిదే అంతిమ నిర్ణయమని, అయితే త్వరగా తేల్చిచెప్పాల్సిందిగా కోరాలని మంత్రికి, ప్రత్యేక సీఎస్‌కు సూచించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు వేగవంతం చేయాలని.. తద్వారా విశాఖకు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి గోదావరి జలాలను తరలించవచ్చని చెప్పారు. వంశధార-నాగావళి అనుసంధాన పనులను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో 75 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టులను ప్రాధాన్య పథకాలుగా పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రధాన జలాశయాలన్నీ నిండి ఉన్నందున సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు ప్రతినీటి బొట్టునూ ఒడిసిపట్టి.. ప్రతి ఎకరాకూ సాగునీరందించాలని స్పష్టం చేశారు. నీటి యాజమాన్య నిర్వహణలో ఇంజనీరింగ్ అధికారులు అలక్ష్యం వహిస్తే ఉపేక్షించవద్దని సూచించారు. పులిచింతల నుంచి కృష్ణా డెల్టాకు నీటి విడుదలలో జాప్యం చేసిన ఎస్‌ఈని ఈఎన్‌సీ కార్యాలయానికి సరెండర్ చేశామని మంత్రి రామానాయుడు చెప్పినప్పుడు.. ఇలాంటి వాటిని సహించబోమన్న సంకేతాలు పంపాలని ముఖ్యమంత్రి అన్నారు.

అనుసంధానంపై ప్రణాళికలు..

నదుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రబాబు సూచించారు. ఉత్తరాంధ్రలో వంశధార-నాగావళి నదుల అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధాన ప్రక్రియపై సమగ్ర అధ్యయనం చేయాలన్నారు. కాగా, రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లు, ఇరిగేషన్ ట్యాంకులు, తాగునీటి వనరుల యాజమాన్య నిర్వహణ బాధ్యత పూర్తిగా చీఫ్ ఇంజనీర్లదేనని జలవనరుల శాఖ స్పష్టంచేసింది. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరదతో.. శ్రీశైలం, నాగార్జున సాగర్ నిండడం.. వాటి గేట్లెత్తడంతో నీటి వనరులన్నిటినీ నింపేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఒక్క చుక్క నదీ జలం కూడా సముద్రం పాలయ్యేందుకు వీల్లేదని తేల్చిచెప్పింది. రిజర్వాయర్లను ఎప్పటిలోగా నింపాలో లక్ష్యాలను నిర్దేశించుకుంది. గోరకల్లును ఈ నెల 8వ తేదీ నాటికి, అవుకు-9 నుంచి 15లోగా.. గండికోట-18 నుంచి అక్టోబరు 11లోగా.. మైలవరం ప్రాజెక్టు-ఈ నెల 22 నుంచి వచ్చే నెల 8 లోగా.. చిత్రావతి-25 నుంచి వచ్చే నెల 16లోగా..పైడిపాలెం-ఈ నెల 25నుంచి వచ్చే నెల 12లోగా.. వామికొండ-ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 22లోగా.. సర్వారాయసాగర్‌ను ఈ నెల 30 నుంచి వచ్చే నెల 16లోగా నింపాలని నిర్ణయించారు. 35,961 చెరువులనూ నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 4,632 చెక్‌డ్యాములు, 8,283 ఊటకుంటలు, 12,915 రీచార్జ్ గుంతల నిర్మాణానికి జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

సీఎంకు జలవనరుల శాఖ ప్రజెంటేషన్..

పోలవరం ప్రాజెక్టులో మిగిన హెడ్‌వర్క్స్ పనులను ప్రస్తుత కాంట్రాక్టు సంస్థతోనే చేయించాలా.. లేదంటే కొత్త సంస్థకు అప్పగించాలో స్పష్టం చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు జలవనరుల శాఖ తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో తెలిపింది. 'కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం.. దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం నిర్మాణం.. ఎగువ దిగువ కాఫర్ డ్యాంల్లో సీపేజీని అరికట్టడం.. భవిష్యత్‌లో స్పిల్ చానల్‌కు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా గైడ్ బండ్ నిర్మాణం వంటి కీలకమైన పనులను.. పూర్వానుభవం కలిగిన.. బాధ్యతాయుతమైన నిర్మాణ సంస్థలకు అప్పగించాలన్న సూచనలు వస్తున్నాయి. ఇదే సమయంలో సాగునీటి ప్రాజెక్టుతో పాటు జలవిద్యుత్కేంద్రం పనులు కూడా పూర్తి చేయలేకపోయిన ప్రస్తుత కాంట్రాక్టు సంస్థ మేఘా ఇంజనీరింగ్‌ను కొనసాగించడం సరికాదన్న వాదనలూ వినిపిస్తున్నాయి' అని తెలిపింది.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

- 22 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- పులిచింతలలో 6 గేట్ల నుంచి నీరు దిగువకు



సాగర్ వద్ద పర్యాటకుల సందడి

వీపీసౌత్, నరసరావుపేట, విజయవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతుండడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి మంగళవారం 3,70,589 క్యూసెక్కుల మేర వరద వస్తుంటే.. 4,02,578 క్యూసెక్కులను దిగువన నాగార్జునసాగర్‌లోకి వదిలేస్తున్నారు. శ్రీశైలం నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 204.35 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం నుంచి వరద వస్తుండడంతో సాగర్‌లో 22 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,09,276 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 27,973 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 8,298 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,022 క్యూసెక్కులు వెరసి 3,55,369 క్యూసెక్కులు విడుదల అవుతోంది. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.30 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా.. 298.59 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాగర్ నుంచి వరద వస్తుండటంతో పులిచింతల ప్రాజెక్టు కూడా జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 3,70,632 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. సోమవారం అర్ధరాత్రే రెండు గేట్లు ఎత్తగా.. మంగళవారం ఉదయం మరో నాలుగు గేట్లను ఎత్తి మొత్తం 6 గేట్లద్వారా లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ నిల్వ సామర్థ్యం 3.07 టీఎంసీలు కాగా, ప్రస్తుతం.. 2.28 టీఎంసీల నిల్వ నమోదైంది.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 22 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో కృష్ణమ్మ పరవళ్లను తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తారు. కాగా, పోలవరం వద్ద కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఇదిలాఉండగా, రాష్ట్రంలో రుతుపవనాలు చురుగ్గా మారాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో ఎక్కువ చోట్ల, సీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మంగళవారం తిరుపతిలో అత్యధికంగా 36.1డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



మీడియాతో మాట్లాడుతున్న ఎన్‌జీజీవో సంఘం నేతలు

చంద్రశేఖరరెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో!

వైసీపీ హయాంలో మాటమాత్రం స్పందించలేదు

- వేతనాలు సరిగా ఇవ్వకపోయినా మాట్లాడలేదు
- ఏపీఎన్‌జీజీవో అధ్యక్షుడు శివారెడ్డి ఆగ్రహం

విజయవాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఏమీ చేయడం లేదని ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, ఆయన తన నోరు అదుపులో పెట్టుకోవాలని ఏపీ నాన్ గజిటెడ్ అండ్ గజిటెడ్ అధికారుల(ఏపీఎన్‌జీజీవో) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా కాకముందే సర్కారుపై ఆరోపణలు చేయటం సమంజసం కాదన్నారు. గత వైసీపీ హయాంలో ఉద్యోగులకు అన్యాయం జరిగినప్పుడు చంద్రశేఖరరెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఐదేళ్ల పాటు జగన్ ప్రభుత్వం వేతనాలు సరిగా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిన విషయాన్ని మరిచిపోయావా? జగన్‌తో ఎందుకు మాట్లాడలేదు. ఉద్యోగులకు అదనపు ప్రయోజనాలు కల్పించకపోగా ఉన్నవాటిని తొలగించినప్పుడు ఎందుకు మాట్లాడలేకపోయావు? ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ, పీఆర్సీలను జగన్ ప్రభుత్వం తగ్గించినపుడు స్వరం మూగబోయిందా? ఉద్యోగుల జీపీఎఫ్‌ను కూడా దారి మళ్లించి వాడేసుకున్నప్పుడు ఎందుకు ప్రశ్నించలేదు? గతంలో ఏ ప్రభుత్వం కూడా జగన్ సర్కారు తరహాలో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిన దాఖలాలు లేవు. ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు ఇస్తారో, ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి కల్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఠంచనుగా 1నే జీతాలు ఇస్తున్నారు. జగన్ పాలనలో ఉద్యోగులకు 2018 నుంచి డీఏ అలవెన్స్ ఇవ్వలేదు. ప్రతి ఉద్యోగికీ సగటున రూ.2-6 లక్షల వరకు ప్రభుత్వం బాకీ పెట్టింది. చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యలు ఉద్యోగులను కూటమి ప్రభుత్వానికి దూరం చేసేలా ఉన్నాయ్' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల తరఫున ప్రభుత్వ సలహాదారుగా ఉండి ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని దుయ్యబట్టారు.

మాయ మాటలతో మోసం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాము గత ప్రభుత్వం వద్దకు వెళితే.. సజ్జల రామకృష్ణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి మాయమాటలు చెప్పి మోసం చేశారని శివారెడ్డి తెలిపారు. అప్పటి సీఎస్ జవహర్ రెడ్డితో హామీ ఇప్పించి ఉద్యమాన్ని నిలుపుదల చేయించారని, ఆ తర్వాత ఎన్నికల కోడ్ నెపంతో ఆ హామీలను బుట్టదాఖలు చేశారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఇచ్చిన హామీలు సైతం నెరవేరలేదని తెలిపారు. చంద్రశేఖరరెడ్డి వైసీపీ నేతగా మాట్లాడితే తమకు అభ్యంతరం లేదని, ఉద్యోగసంఘం నేతగా చెప్పుకొంటూ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. సీపీఎస్ రద్దు అన్న జగన్ జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు ప్రకటించారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత ఉద్యోగులపై జీపీఎస్‌ను బలవంతంగా రుద్దవద్దని ఆదేశించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ ప్రభుత్వానికి ఉద్యోగ సంఘం, ఉద్యోగుల తరఫున తమ వంతు సహకారం అందిస్తామన్నారు. చంద్రశేఖరరెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.

చంద్రబాబుతో మేలు ఖాయం

అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడు మాట్లాడుతూ.. ఎన్జీవో సంఘం మాజీ నేతలు చేస్తున్న ప్రకటనలు ఉద్యోగులు, ప్రభుత్వం మధ్య దూరం పెంచేలా ఉన్నాయని తెలిపారు. కొంత సమయం ఇస్తే సీఎం చంద్రబాబు తన అనుభవంతో ఉద్యోగులకు మేలు చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఐఆర్ ఇవ్వడంతో పాటు, పే రివిజన్ కమిషన్ వెంటనే వేసేలా కమిషనర్‌ను నియమించాలని సీఎస్‌ను కోరినట్టు తెలిపారు.ఉద్యోగులు సంతృప్తిగా ఉన్న సమయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు.

జడ్ ప్లస్ భద్రత ఉన్నా... అభద్రత ఎందుకు జగన్?

» మంత్రి నారా లోకేశ్ ప్రశ్న

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'జడ్ ప్లస్ భద్రత ఉన్నా ఇంకా అభద్రత ఎందుకు జగన్?' అని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. 'జగన్‌కు ప్రస్తుతం 58 మందితో సెక్యూరిటీ, రెండు ఎస్కార్ట్ బృందాలు, పది మంది సాయుధ గార్డులతో భద్రత, కాన్వాయ్‌లో రెండు అత్యాధునిక లాండ్ క్రూయిజర్ బుల్లెట్ ప్రూఫ్ కార్లు. ఇవి సరిపోక ఇంకా 986 మందితో భద్రత ఎందుకు అడుగుతున్నారు' అని ఆయన మంగళవారం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

మాజీ సీఎంకు 980 మందితో భద్రత అవసరమా?

» ఇది ఒక ఊరిలో ఓటర్ల సంఖ్యంత: హోంమంత్రి అనిత

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు సరిపడా భద్రత కల్పిస్తున్నామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రికి 980 మందితో భద్రత అవసరమా అని ఆమె ప్రశ్నించారు. ఇది ఒక చిన్న గ్రామంలో ఓటర్ల సంఖ్యతో సమానమని తెలిపారు. మంగళవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌కు కావాల్సిన భద్రత ఇస్తున్నామని, ఎక్కడా తగ్గించలేదని తెలిపారు. సీఎంగా ఉన్నప్పుడు ఉన్నంత భద్రత కావాలంటే ఎలా ఇస్తామన్నారు. కోడికత్తి దాడి ఐదేళ్ల తర్వాత ఆయనకు గుర్తొచ్చిందా అని నిలదీశారు. సీఎంగా ఉన్నప్పుడు ఆ కేసును ఎందుకు పరిష్కరించుకోలేకపోయారని అనిత ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా కోసం, భద్రత కావాలని హైకోర్టులో పిటిషన్ వేయడం రాజకీయ లబ్ధి కోసమేనన్నారు. ప్రతిపక్ష హోదా కావాలంటే అసెంబ్లీలో పది శాతం సీట్లు ఉండాలనే విషయం జగన్‌కు తెలియదా అన్నారు. గత ఐదేళ్లలో ప్రజలను జగన్ పీడించుకుతిన్నారని, ఆయన బాధితులు పులివెందుల నుంచి ప్రజాదర్బార్‌కు పెద్దసంఖ్యలో వస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా జగన్ బాధితులు, వైసీపీ బాధితులు టీడీపీ కార్యాలయానికి క్యూ కడుతున్నారని చెప్పారు.

పీఎం, సీఎం స్థాయిలో జగన్‌కు భద్రత ఇవ్వలేరు

» రెడ్‌బుక్ పేరు వింటేనే వైసీపీ నేతల్లో వణుకు : మంత్రి కొల్లు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జగన్‌కు ఒక సీఎం, పీఎం స్థాయి భద్రత ఇవ్వడం సాధ్యం కాదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 'జగన్ ఇప్పుడు పులివెందుల ఎమ్మెల్యే మాత్రమే. ఒక ఎమ్మెల్యేకు మించి ప్రభుత్వం ఇప్పటికే ఆయనకు భద్రత ఇచ్చింది. ఇంకా ముఖ్యమంత్రి స్థాయిలో భద్రత కావాలని డిమాండ్ చేయడం సరికాదు. తనకు భద్రత పెంచాలని జగన్ అంటుంటే ఆయన నుంచి తమకు భద్రత కావాలని రాష్ట్ర ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాబందుల మాదిరిగా రాష్ట్రాన్ని ఐదేళ్లు పీక్కు తిన్న జగన్ అండ్ కో ఇప్పుడు చంద్రబాబు పాలనలో అభివృద్ధి దిశగా అడుగులు పడుతుంటే తట్టుకోలేకపోతున్నారు. ప్రభుత్వంపై బురద చల్లడానికి ఏ కారణం దొరుకుతుందా అని కాచుకొని కూర్చున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా శవం కనిపిస్తే గద్దలా వాలడానికి జగన్ వస్తున్నారు' అని కొల్లు విమర్శించారు. రెడ్‌బుక్ పేరు వింటేనే వైసీపీ నేతలు గజగజ వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. 'మేం కక్ష సాధింపుల జోలికి పోం. అదే సమయంలో పాపాలు చేసిన వైసీపీ నేతలు ఎక్కడ దాక్కున్నా తీసుకువచ్చి చట్టం ముందు బోనులో నిలబెట్టడానికి పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉంది' అని స్పష్టం చేశారు. 'గుడివాడ బూతుల నాని, గన్నవరం వంశీని మాజీ మంత్రి పేర్ని నాని దాచిపెట్టారని అనుమానాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో అక్రమ ఆస్తులు కొనడానికి వెళ్తే అక్కడి ప్రజలు తరిమారు. జగన్ పిచ్చికి బందరు పిచ్చోడు పేర్ని నాని తోడయ్యాడు. ఇలాగే పిచ్చి ప్రేలాపనలు పేలితే ప్రజలు ఆయనను నాలుగు పీకినా ఆశ్చర్యపడనక్కరలేదు' అని మంత్రి రవీంద్ర వ్యాఖ్యానించారు.

ఇదేం పేచీ?

(మొదటి పేజీ తరువాయి)

విస్తుపోతున్నారు. ఇంకా ముఖ్యమంత్రినే అనుకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

అధికారంలో ఉండగా....

జగన్ సీఎంగా ఉండగా తనతోపాటు కుటుంబ సభ్యుల భద్రత కోసం ఎస్ఎస్‌జీ పేరుతో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తాడేపల్లి, బెంగళూరు, ఇడుపులపాయ, హైదరాబాద్... ఇలా అన్ని చోట్లా కలిపి 986 మంది పోలీసులు విధుల్లో ఉండేవారు. ఇప్పుడు జగన్ మాజీ అయ్యారు. కనీసం ప్రతిపక్ష నేత హోదా కూడా లేదు. సాంకేతికంగా చూస్తే.. ఆయన పులివెందుల ఎమ్మెల్యే మాత్రమే! అయినా సరే కూటమి ప్రభుత్వం ఆయన భద్రతను నిర్లక్ష్యం చేయలేదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్‌కు ఏర్పాటు చేసిన 'జడ్ ప్లస్' సెక్యూరిటీనే పోలీసు శాఖ ఇప్పుడూ కొనసాగిస్తోంది. భద్రతను తగ్గించలేదు. భద్రతాపరంగా జడ్ ప్లస్ విభాగం అత్యధిక స్థాయి. అంతకు మించిన భద్రత మరెవరికీ కల్పించరు. ఈ కేటగిరీలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం 58 మంది భద్రతా సిబ్బందిని ఇస్తుంది. ఇప్పుడు కూడా జగన్‌కు ఇదే భద్రత కొనసాగుతోంది.

నాడు చంద్రబాబు కోరినా...

చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో అదనపు భద్రత కల్పించాలని కోరినా జగన్ సర్కారు పట్టించుకోలేదు. కనీసం అంతకుముందు తన వద్ద పనిచేసిన అధికారిని వ్యక్తిగత భద్రతా అధికారిగా ఇవ్వాలని చంద్రబాబు కోరినా ఇవ్వలేదు. 'వీఐపీ కోరిన వ్యక్తిని ఇవ్వకూడదు' అని నిబంధనల్లో ఉందంటూ మరో అధికారిని భద్రతా అధికారిగా ఇచ్చారు. ఇప్పుడు జగన్ అవన్నీ మర్చిపోయి తనకు జడ్ ప్లస్‌లో ఇచ్చినదానికంటే అదనంగా కావాలని డిమాండ్ చేస్తున్నారు. తనకు 136 మంది భద్రతా సిబ్బందిని ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. నిబంధనల ప్రకారం ఇచ్చేదాని కంటే అదనంగా ఇవ్వాలన్నది ఆయన డిమాండ్!

ఇదేం దబాయింపు...

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రధాన రాజకీయ పార్టీల నేతల్లో అందరికంటే చంద్రబాబుకు భద్రతాపరమైన ముప్పు ఎక్కువ. ఆయన మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్నారు. అలిపిరిలో దాడి కూడా జరిగింది. జగన్‌కు ఇలాంటి ముప్పేదీ లేదు. ఆయన మావోయిస్టుల హిట్‌లిస్ట్‌లో ఉన్నారన్న సమాచారం లేదు. అయినా సరే... నాకు ముప్పు ఉందంటూ జగన్ దబాయిస్తున్న తీరుపై పోలీసులు ఆశ్చర్యపోతున్నారు. దీనికి జగన్ రెండు సంఘటనలు చూపిస్తున్నారు. ఒకటి.. 2019 ఎన్నికల ముందు విశాఖ విమానాశ్రయంలో తనపై జరిగిన కోడికత్తి దాడి! తాజా ఎన్నికల ప్రచారంలో విజయవాడలో జరిగిన గులకరాయి దాడి! కోడి కత్తి దాడిని అప్పటి ఎన్నికల్లో బాగా వాడుకున్నారు. దాడి చేసిన యువకుడు జగన్ వీరాభిమాని అని... కేవలం జగన్‌కు సానుభూతి వస్తుందనే అత్యంత జాగ్రత్తగా, ఎలాంటి అపాయం కలుగకుండా భుజంపై కోడికత్తితో చిన్నగా గుచ్చాడని అప్పుడే రుజువైంది. అయినా సరే... 'హత్యాయత్నం' అంటూ విపరీత ప్రచారం చేశారు. తీరా సీఎం అయ్యాక ఆ కేసులో సాక్ష్యం ఇవ్వడానికి ఒక్కసారి కూడా కోర్టుకు వెళ్లలేదు. కోడికత్తి దాడిలో కుట్రకోణం లేదని ఎన్ఐఏ నిర్ధారించింది. ఇక... తాజా ఎన్నికల ముందు జరిగిన గులకరాయి దాడిపైనా అనేక అనుమానాలున్నాయి. జగన్‌కు తగిలిందని చెబుతున్న రాయి పోలీసులు ఎంత వెతికినా దొరకలేదు. రాయి వేశారంటున్న వారూ దొరకలేదు. జగన్ మాత్రం రోజుల తరబడి 'గాయానికి' ప్లాస్టర్‌తో ఎన్నికల సభల్లో పాల్గొన్నారు. ఇప్పుడు ఈ సంఘటనలను చూపించి అదనపు భద్రత కోరడం అసంబద్ధంగా ఉందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

కుటుంబం కోసం 'ప్రత్యేక దళం'

అధికారంలో ఉన్న సమయంలో తాను... తన కుటుంబ భద్రత కోసం జగన్మోహన్ రెడ్డి ఎవరూ ఊహించనన్ని నిర్ణయాలు తీసుకొన్నారు. తన కుటుంబం భద్రత కోసం ఏకంగా ఒక ప్రత్యేక భద్రతా దళాన్ని ఏర్పాటు చేశారు. తాము రాష్ట్రంలో, దేశంలో, విదేశాల్లో ఎక్కడున్నా సెక్యూరిటీ కల్పించాలన్నారు. జగన్ కుమార్తెలు విదేశాల్లో చదువుతుండటంతో ఎస్ఎస్‌జీ అధికారులు అక్కడకు వెళ్లి భద్రత కల్పించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఏ ముఖ్యమంత్రీ విదేశాల్లో తన కుటుంబ సభ్యులకు పోలీసు రక్షణ ఏర్పాట్లు చేసుకోలేదు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆయన పర్యటనలకు వెళ్లే దారిలో చెట్లుకొట్టేశారు. కిలోమీటర్ల కొద్దీ బారికేడ్లు పెట్టారు. పరదాలు కట్టారు. దీంతో 'ఇదేం పిచ్చి' అనే వ్యాఖ్యలు వినిపించాయి. ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి అయినప్పటికీ తన ధోరణి మార్చుకోకపోవడం గమనార్హం.

కోర్టు తలుపులు తడతాం!

కక్షలు తీర్చుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు: జగన్



విజయవాడ/అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హింసాత్మక పరిస్థితులను దేశం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు హైకోర్టు, సుప్రీంకోర్టుల తలుపులు తడతామని మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అల్లరిమూకల దాడిలో గాయపడి.. విజయవాడ సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ నేతలు గింజుపల్లి శ్రీనివాసరావు, డేరంగుల గోపి, దేవిశెట్టి రామకృష్ణను ఆయన మంగళవారం పరామర్శించారు. ప్రజల్లో భయాందోళన కలిగించడానికే దాడులు చేస్తున్నారని.. కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోవడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్నది తప్పుడు సంప్రదాయమని, ఈ ప్రభుత్వం చాలా వేగంగా తుడిచిపెట్టుకుపోతుందని జోస్యం చెప్పారు. మళ్లీ అధికారంలోకి వచ్చినప్పుడు తాను వద్దన్నా కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలకు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన ఎందుకు విధించకూడదు? త్వరలో గవర్నర్‌ను కలిసి పరిస్థితిని వివరిస్తామని, ఆయన చూసీచూడనట్లు వ్యవహరించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జగన్ శుక్రవారం నంద్యాల వెళ్తున్నారు. అక్కడ ఇటీవల హత్యకు గురైన వైసీపీ కార్యకర్త సుబ్బారాయుడి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. కాగా.. జగన్ బుధ, గురువారాల్లో విశాఖ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో భేటీ కానున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు సంపూర్ణంగా మద్దతివ్వాలని కోరనున్నారు. 800 మందికి పైగా స్థానిక ప్రజాప్రతినిధుల్లో వైసీపీకి 600 మందికి పైనే ఉన్నారు. వీరిలో పలువురు టీడీపీ కూటమి వైపు మొగ్గుచూపుతున్నట్లు పెద్దఎత్తున వార్తలు వస్తున్నాయి. తిరుగులేని బలం ఉన్న చోట కూడా ఓడితే తలవంపులు తప్పవని వైసీపీ వర్గాలు అంటున్నాయి.



మదనపల్లె సబ్‌కలెక్టరేట్ గేటు ఎదుట కూర్చొని దీనంగా చూస్తున్న ముసలవ్వ సుబ్బమ్మ

81ఏళ్ల అవ్వపై 50లక్షల పరువునష్టం దావా!

» వైసీపీ భూకబ్జాపై సిసోడియాకు అవ్వ ఫిర్యాదు

» పరువు తీసిందంటూ లాయరుతో నోటీసు ఇప్పించిన నేత

» న్యాయంకోసం మదనపల్లె సబ్ కలెక్టరేట్ వద్దకు..

మదనపల్లె టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం గేటు వద్ద దీనంగా కూర్చొని ఉన్న ఎనిమిది పదుల వయసున్న ఈ ముసలవ్వ పేరు సుబ్బమ్మ! చెవులు సరిగ్గా వినపడవు.. కనీసం మాటలు కూడా స్పష్టంగా మాట్లాడలేదు. అయినా ఈ అవ్వపై స్థానిక వైసీపీ నేత తన లాయర్‌తో రూ.50లక్షలకు పరువునష్టం దావా వేయించారు. దీంతో తన మనమడు నాగేశ్వర, మనుమరాలు లక్ష్మీదేవి సాయంతో మంగళవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు సుబ్బమ్మ వచ్చారు. వారు తెలిపిన కథనం ప్రకారం.. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం అమిలేపల్లె గ్రామం శ్రీనివాసపురానికి చెందిన రామయ్య భార్య సుబ్బమ్మకు అదే గ్రామంలో ఖాతా నంబర్ 716లో 3.15 ఎకరాల పట్టా భూమి ఉంది. ఆమె మనవడు నాగేశ్వర ఆ భూమిని ఇదే గ్రామానికి చెందిన ఎంపీపీ కుమారుడు, వైసీపీ నేత యోగేంద్ర వద్ద పాసుపుస్తకాలు కుదవ పెట్టి రూ.1.50లక్షలు అప్పు తీసుకున్నాడు. కొన్ని నెలల తరువాత అప్పుకు వడ్డీ వేసి రుణం తీర్చివేశాడు. అయినా, అవ్వ పేరిట ఉన్న పాసుపుస్తకాలను యేగేంద్ర ఇవ్వలేదు. సుబ్బమ్మ పేరిట ఉన్న పాసుపుస్తకాలను వేరొకరి పేరిట మ్యుటేషన్ చేయించేశారు. ఇటీవల మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్లు తగలబడిపోవడం, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల భూదందాలు ఆ సందర్భంగా చర్చకు రావడం తెలిసిందే. వారి బాధితుల నుంచి రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా సబ్‌కలెక్టరేట్ వద్ద రెండురోజుల పాటు వినతులు స్వీకరించగా, సుబ్బమ్మ సైతం ఫిర్యాదు అందించారు. అనంతరం అక్కడే న్యూస్ చానల్‌కు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో సోమవారం సుబ్బమ్మకు, లక్ష్మీదేవికి, నాగేశ్వర, మరో ఇద్దరికి లాయర్ నోటీసులు వచ్చాయి. తమ క్లైయింట్‌కు పరువునష్టం కలిగించే విధంగా ఆరోపణలు చేశారని, దీనికి రూ.50లక్షల పరువునష్టం చెల్లించాలనేది ఆ నోటీసుల సారాంశం!

ప్రతి తరగతికి ఒక టీచర్

» ఆ మేరకు సర్దుబాటు జరగాలి: మంత్రి లోకేశ్

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'పాఠశాల విద్యా రంగం దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా ఏపీ మోడల్‌ను రూపొందించాలి. కేవలం చదువులోనే కాకుండా విద్యార్థులను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రోత్సహించేలా మోడల్ ఉండాలి' అని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్యపై నిర్వహించి సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. 'పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో సమావేశాలు నిర్వహించాలి. కేజీబీవీల్లో బోధనా సిబ్బందిని పూర్తి పారదర్శకంగా, విద్యా ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలి. ప్రతి పాఠశాలలో ప్రతి తరగతికి కనీసం ఒక టీచర్ ఉండేలా టీచర్ల సర్దుబాటు చేయాలి. పాఠశాలలకు అక్రెడిటేషన్ కోసం ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేయాలి. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలి. ప్రతి విద్యార్థికి ఒక యునిక్ ఐడీ నంబరు ఇవ్వాలి. గురుపూజోత్సవం రోజున వంద మంది టీచర్లను సన్మానిస్తాం' అని లోకేశ్ అన్నారు. సమావేశంలో ఉన్నతాధికారులు కోన శశిధర్, విజయరామరాజు, కృతిక శుక్లా, బి.శ్రీనివాసరావు ఉన్నారు.

కేంద్రీయ భండార్‌కే ఆయుష్ ప్రింటింగ్ ఆర్డర్!

» మెటీరియల్ ప్రాసెస్‌లో ఉంది

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల వెల్లడి

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆయుష్ విభాగానికి సంబంధించిన ప్రింటింగ్ ఆర్డర్లను కేంద్రీయ భండార్‌కు ఇచ్చామని, ఒక్కొక్కటిగా ప్రాసెస్‌లో ఉన్నాయని అధికారులు వివరణ ఇచ్చారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఆయుష్‌లో అవినీతి ప్రింటింగ్' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ఆయుష్ విభాగం అధికారులు పొంతలేని వివరణ ఇచ్చారు. ఆయుష్ అధికారులు ఓపీ, ఐపీ షీట్స్ ఇతర ప్రింటింగ్ మెటీరియల్ పేరుతో కేంద్రీయ భండార్‌కు ఆర్డర్ ఇచ్చి అక్కడ నుంచి ఒక గ్రాఫిక్స్ కంపెనీకి వర్క్ ఇచ్చారనేది కథనం. పైగా మెటీరియల్ ఆస్పత్రులకు, ఆర్డీడీ కార్యాలయాలకు ఇప్పటి వరకు రాలేదని, రాకుండానే బిల్లులు చెల్లించేశారని కథనంలో 'ఆంధ్రజ్యోతి' స్పష్టం చేసింది. ఎస్‌హెచ్‌ఎంతో ఒప్పందం చేసుకున్న కేంద్రీయ భండార్‌కు ఆయుష్ విభాగం ఎలా ఆర్డర్ ఇస్తుందని, భండార్‌కు ఇంకా ఎప్పటి వరకు గడువు ఉందనే విషయాలు కథనంలో స్పష్టంగా ఉన్నాయి. వీటిలో ఒక్కదానికి కూడా ఆయుష్ అధికారులు సరైన సమాధానం చెప్పలేదు. పైగా మెటీరియల్ ఒక్కొక్కటిగా ప్రాసెస్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాసెస్‌లో ఉండడం అంటే మెటీరియల్ సప్లయ్ అయిందా? లేదా అన్న స్పష్టత ఇవ్వలేదు. పైగా ఆయుష్ ఉన్నతాధికారి చేసిన తప్పును యూనిట్ అధికారులపై నెట్టే ప్రయత్నం చేశారు. 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం కేవలం శాఖలో పనిచేస్తున్న అధికారుల పరువు తీయడానికేనని వివరణలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చేలా ఉందని వ్యాఖ్యానించారు. కనీసం ఏ అధికారి వివరణ ఇస్తున్నారో పేరు కానీ, సంతకం కానీ లేదు. ప్రింటింగ్ ఆర్డర్ ఇచ్చే విషయంలో అవినీతి జరిగిందని అందరికీ తెలిసిన విషయమే. మొత్తం వ్యవహారం వైసీపీ హయాంలో జరిగితే.. కొత్త ప్రభుత్వానికి చెడ్డ పేరు ఎలా వచ్చిందో అధికారులు వివరించాలి. మరోవైపు ఆయుష్ విభాగంలో కేంద్ర కార్యాలయంలో అనాధికారికంగా కొంత మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాల్లో విధులు నిర్వహించాల్సిన మహిళా డాక్టర్ ప్రధాన కార్యాలయంలోనే ఉంటారు. అలానే, రిటైరైన మరో అధికారి కూడా ఆయుష్ కార్యాలయంలోనే ఉంటున్నారు.

వలస సమస్యకు మతం రంగు!

బ్రిటన్‌లో హింసాకాండకు ఇదే కారణం.. ముగ్గురు బాలికల హత్యపై సోషల్ మీడియాలో వదంతులు

» ముస్లింలు లక్ష్యంగా దాడులు

» బ్రిటన్‌లో అంతర్యుద్ధం తప్పదు: మస్క్

బ్రిటన్‌లోని పలు నగరాల్లో చోటు చేసుకున్న హింసాకాండను చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. హింసాకాండకు.. ముగ్గురు బాలికల హత్యలే తక్షణ కారణంగా పైకి కనిపిస్తున్నప్పటికీ.. బ్రిటన్‌లోకి అక్రమ వలసలపై అక్కడి జనంలో పేరుకున్న అసంతృప్తి, కొన్ని సంస్థలు ఈ సమస్యలో మతం కోణాన్ని చొప్పించి ఉన్మాదాన్ని రెచ్చగొట్టటం, సోషల్ మీడియాలో అబద్ధాలను ప్రచారం చేయటం ఇలా.. బ్రిటన్‌లో హింసాకాండకు చాలా కారణాలున్నాయి.



మాంచెస్టర్‌లో నిరసనకారులను చెదరగొడుతున్న పోలీసులు

లండన్, ఆగస్టు 6: గత నెల 29వ తేదీన సౌత్‌పోర్ట్ అనే తీరప్రాంత పట్టణంలో 6-9 ఏళ్ల వయస్కులైన ముగ్గురు బాలికలు కత్తి పోట్లకు గురై ప్రాణాలు కోల్పోయారు. ఇదే ఘటనలో మరో 8 మంది పిల్లలు, ఇద్దరు పెద్దవాళ్లు గాయాలపాలయ్యారు. ఇదంతా ఓ 17 ఏళ్ల బాలుడు చేశాడు. అతడిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ ఘటనపై రాత్రికి రాత్రి వదంతులు వ్యాపించాయి. నిందితుడు ముస్లిం అని, బ్రిటన్‌కు వలసవచ్చిన కుటుంబానికి చెందిన వాడని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. మృతి చెందిన బాలికలకు సౌత్‌పోర్ట్ పట్టణంలో నివాళి అర్పించటానికి జనం గుమిగూడిన సమయంలో, వందలాదిమంది స్థానికంగా ఉన్న మసీదుపై రాళ్లు, ఇటుకలు, సీసాలతో దాడి చేశారు. ఈ దాడికి పాల్పడిన వారు 'ఇంగ్లిష్ డిఫెన్స్ లీగ్'కు చెందినవారు. ఇది బ్రిటన్‌లో 2009 నుంచి ముస్లిం వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఓ మతోన్మాద సంస్థ. ఇటువంటి అనేక రైటిస్ట్ సంస్థలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వదంతులను వ్యాపింపజేశాయి. రష్యాతో సంబంధం ఉందని భావిస్తున్న 'ఛానల్ 3 నౌ' అనే ఆన్‌లైన్ ఛానల్ కూడా వీటికి ఓ వేదికలా నిలిచింది. ఫలితంగా గంటల వ్యవధిలోనే లండన్, హార్ట్‌పూల్, మాంచెస్టర్, మిడిల్స్‌బరో, లివర్‌పూల్, బ్రిస్టల్, బెల్‌ఫాస్ట్, లీడ్స్, నాటింగ్‌హం తదితర నగరాల్లో నిరసనలు, విధ్వంసం మొదలయ్యాయి. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో విద్వేష ప్రచారాన్ని ఎదుర్కోవటానికి పోలీసులు.. హంతకుడు మైనర్ అయినప్పటికీ అతడి వివరాలు బయటపెట్టారు. హంతకుడి పేరు యాక్సెల్ ముగన్వా రుదకుబనా అని, 2006లో బ్రిటన్‌లోనే పుట్టాడని, అతడి తల్లిదండ్రులు రువాండా దేశ మూలాలున్న వారని తెలిపారు. దీంతో హింసాకాండ కొంత సద్దుమణిగింది.

దీర్ఘకాలిక సమస్య!

ఆఫ్రికా, యూరప్ తదితర దేశాల నుంచి బ్రిటన్‌లోకి అక్రమంగా వలస వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. వీరికి ప్రభుత్వం తాత్కాలికంగా హోటళ్లలో ఆశ్రయం కల్పిస్తోంది. దీని కోసం గత ఏడాదిలోనే 250 కోట్ల పౌండ్లు (దాదాపు రూ.27,000 కోట్లు) ఖర్చు చేశారు. దేశం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండగా, అక్రమవలసదారుల కోసం అంతంత నిధులు ఖర్చు చేయటం ఏమిటన్న అసంతృప్తి అక్కడి ప్రజల్లో ఉంది. ఈ సమస్య ఇటీవలి ఎన్నికల్లో ఒక ప్రధానాంశమైంది. రువాండా నుంచి పడవల్లో అక్రమంగా వచ్చే వారిని అనుమతించబోమని మాజీ ప్రధాని సునాక్ హామీ కూడా ఇచ్చారు. ఇదిలా ఉండగా, బ్రిటన్‌లో హింసాకాండను ఎంతమాత్రం సహించబోమంటూ ప్రధాని స్టార్మర్ హెచ్చరించారు. ఈ హింసాకాండపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. బ్రిటన్‌లో అంతర్యుద్ధం తప్పదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై స్టార్మర్‌తోపాటు బ్రిటన్‌లోని పలువురు రాజకీయ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇటువంటి వ్యాఖ్యలకు ఎటువంటి ఆధారం లేదు' అన్నారు. 'కొద్దిమంది దారిదోపిడీగాళ్లు చేసే పని బ్రిటన్ మొత్తాన్నీ ప్రతిబింబించదు. వారి కారణంగా చోటుచేసుకున్న చెత్తను బ్రిటన్ ప్రజానీకం తొలగిస్తోంది' అని స్టార్మర్ పేర్కొన్నారు.

భారత ఎంబసీ సూచన

బ్రిటన్ పర్యటనకు వచ్చిన భారత సందర్శకులు, ఆ దేశంలో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు స్థానిక అధికారులు జారీ చేస్తున్న సూచనలను గమనించాలని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన జారీ చేసింది. నిరసనలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లవద్దని పేర్కొంది. అవసరమైతే తమను సంప్రదించాలని పేర్కొంటూ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో ఫోన్‌నెంబర్లను వెల్లడించింది.

బిల్డింగ్, లే అవుట్ల అనుమతులకు సింగిల్ విండో!

» 15 రోజులలో అనుమతులు ఇవ్వండి

» మంత్రి నారాయణకు క్రెడాయ్, నారెడ్కో విజ్ఞప్తి

» 3 నెలల్లో సరళీకృతం చేస్తామన్న మంత్రి

విజయవాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్, లే అవుట్ల అనుమతుల మంజూరులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నివారించాలని కోరుతూ క్రెడాయ్, నారెడ్కో ప్రతినిధులు రాష్ట్ర మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో మంత్రితో వారు సమావేశమయ్యారు. భవనాల అనుమతుల కోసం ఇటీవల కాలంలో మునిసిపల్, సీఆర్‌డీఏల పరిధిలో దరఖాస్తు చేస్తుంటే వెంటనే అనుమతులు రావటం లేదని, తీవ్ర జాప్యం జరుగుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం మారటం వల్ల నిర్మాణరంగం ఊపందుకుంటోందని, ఇలాంటి సందర్భంలో సింగిల్ విండో విధానంలో అనుమతులు కావాల్సి ఉందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రణాళికా విభాగం అవినీతి కూపంగా మారిపోయిందని, ప్రస్తుత ప్రభుత్వం ఈ పరిస్థితులను మార్చి నిర్మాణాత్మక అభివృద్ధికి సహకరించటానికి సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవటం అవసరమని వివరించారు. కనీసం పదిహేను రోజుల్లో ప్లాన్ వచ్చే అవకాశం కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణాలు పూర్తయిన తర్వాత లేబర్ సెస్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఖాళీ స్థలాలు, లే అవుట్ల సమస్యల గురించి కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బిల్డర్ల సంఘాలతో జరిపిన చర్చలు, తీసుకోబోయే చర్యలను అనంతరం సీఆర్‌డీఏ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణ వివరించారు. క్రెడాయ్, నారెడ్కో ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని చెప్పారు. మూడు నెలల్లో అన్ని సేవలను సరళీకృతం చేస్తామని తెలిపారు. ప్రజలకు, బిల్డర్‌లకు ఇబ్బందులు లేకుండా చేయాలనేదే తమ ఆకాంక్ష అన్నారు. టౌన్‌ప్లానింగ్‌లో ఇబ్బందులను పరిష్కరించటానికి నెల్లూరులో ఇటీవల తాను ఒక డ్రైవ్ పెట్టానని, కొన్ని సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించామని తెలిపారు. ప్రతి మునిసిపాలిటీలో కూడా తానే స్వయంగా డ్రైవ్‌లలో పాల్గొంటానని చెప్పారు. ఇతర రాష్ట్రాలలో టౌన్‌ప్లానింగ్ ఎలా పనిచేస్తోందో పది రాష్ట్రాలలో పరిశీలన చేసి విధి విధానాలు రూపొందిస్తామన్నారు. నిబంధనలు పాటించని వారెవరైనా సరే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిబంధనల ప్రకారం కట్టడాలు ఉండాలని మొదటి నుంచీ చెబుతున్నామని, అనధికారికంగా వేసిన లే అవుట్లపై ప్రచారం చేస్తామని, ఫలానా సర్వే నంబర్ అనధికారికమని, రిజిస్ట్రేషన్ చేయవద్దని ప్రకటిస్తామని తెలిపారు. వీటిని అందరూ తెలుసుకోవటానికి వీలుగా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచుతామన్నారు. మూడు నెలల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తామని చెప్పారు. ఆన్‌లైన్‌లో అనుమతులన్నీ ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాట్‌లు కొనేముందు ప్రజలు కూడా ఒకసారి పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సీఐడీకి మదనపల్లె 'ఫైల్స్'!

» డీజీపీ తిరుమలరావు ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన మదనపల్లె ఫైళ్ల దహనం కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయంలోని 22-ఏ భూముల విభాగంలోనే ఫైళ్లను తగలబెట్టడం, సుమారు 2,400 ఫైళ్లు బుగ్గి కావడం.. ఇంకో 700 సగం వరకు కాలిపోవడం వెనుక మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు ఉన్నట్లు నిర్ధారించడం.. వారి ఇళ్లలో సోదాలు జరిపినప్పుడు కీలక ఫైళ్లు లభ్యం కావడం, ఈ ఘటనకు సంబంధించి గత ప్రభుత్వంలోని పెద్దల పాత్రపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తుండడం, భూబాధితులు వందల సంఖ్యలో ఫిర్యాదు చేసేందుకు ముందుకొస్తుండడం తదితర పరిణామాల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు కోసం సీఐడీకి అప్పగించారు. అసలు సూత్రధారులను అరెస్టు చేయడమే ఈ నిర్ణయం ప్రధానోద్దేశం. గతనెల 21న రాత్రి సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటనకు ముందు ఏం జరిగింది.. ఆ సమయంలో అక్కడ ఎవరెవరు ఉన్నారు.. ఫైర్ బ్రిగేడియర్లు మంటలు ఆర్పాక ఆర్డీవో తీసుకున్న చర్యలను పోలీసులు నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు ఆదేశాలతో డీజీపీ, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా వచ్చి పరిశీలించారు. ఫైళ్లకు మంటలు అంటుకోవడం షార్ట్‌సర్క్యూట్ వల్ల కాదని, కుట్రపూరితంగా జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. నాగపూర్ నుంచి నేషనల్ ఫోరెన్సిక్ నిపుణులు వచ్చి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పోలీసులు ఇద్దరు ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్‌తో పాటు సబ్‌కలెక్టరేట్ సిబ్బంది 32మందిని వేర్వేరుగా ప్రశ్నించారు. ఇంకో 15మంది అనుమానితులను విచారించారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో, పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి, అతడి బంధువు రామకృష్ణారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అనుచరుడు బాబ్జాన్ ఇళ్లలో సోదాలు చేసి కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. 8మందిపై కేసులు నమోదు చేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ప్రకటించారు. గతనెల 25, 26 తేదీల్లో మదనపల్లెలోనే మకాం వేసిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆర్‌పీ సిసోడియా.. భూవివాదాలు, కబ్జాలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా పెద్దిరెడ్డి కుటుంబీకులు, ఆయన అనుచరులు పెద్దఎత్తున భూకబ్జాలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సిసోడియా.. సోమవారం కలెక్టర్లు, ఎస్పీల సదస్సులోనూ ప్రస్తావించారు. కేసును సీఐడీకి బదిలీ చేసేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. గతనెల 21 నుంచి నిర్వహించిన దర్యాప్తు వివరాలను నివేదికల రూపంలో సిద్ధం చేసి సీఐడీ చీఫ్‌కు అందజేయనున్నారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు..

ఫైళ్ల దహనంపై ఆర్డీవో హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో నమోదైన 135/2024 కేసుకు అనుసంధానంగానమోదైన 8 కేసుల దర్యాప్తునకు సీఐడీ ప్రత్యేక బృందాలు రంగులోకి దిగనున్నాయి. ఒక్కో కేసులో రెండేసి టీంలు దర్యాప్తు చేయనున్నట్లు సమాచారం. ఈ ఘటనకు మూలాలు ఎక్కడ ఉన్నాయి.. సూత్రధారులు, పాత్రధారులెవరన్న కోణంలోనూ దర్యాప్తు చేయనున్నారు. సబ్‌కలెక్టరేట్ భవనాలు ఇప్పటికే పోలీసుల అధీనంలోనే ఉన్నాయి. లోపలకు ఎవరినీ అనుమతించకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐడీ అధికారులు మరోసారి ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఓ అంచనాకు రానున్నారు. ఇప్పటికే 8 మంది అనుమానితుల మొబైల్ కాల్ లిస్టు సేకరించారు.

మద్రాస్ ఐఐటీకి 228 కోట్లు

» పూర్వ విద్యార్థి కృష్ణ చివుకుల విరాళం.. సన్మానం

చెన్నై, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మద్రాస్ ఐఐటీ పూర్వ విద్యార్థి, ఇండో ఎంఐఎం ఫౌండర్, సీఈవో కృష్ణ చివుకుల తన ఉన్నతికి కారణమైన ఐఐటీ ఎంకు రూ.228కోట్ల భారీ విరాళాన్ని అందించారు. అమెరికాలో స్థిరపడిన, బాపట్లవాసి కృష్ణను మద్రాస్ ఐఐటీ నిర్వాహకులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ విలేకరులతో మాట్లాడారు. 'ఐఐటీ-మద్రాస్‌లో విద్యాభ్యాసం నేను ఉన్నత స్థితికి చేరుకునేలా, జీవితంలో చాలా సాధించగలిగేలా చేసింది. అలాంటి విద్యాసంస్థకు నా వంతుగా రూ.228 కోట్లను విరాళంగా ఇచ్చా. దేశంలోనే ఒక విద్యాసంస్థకు ఇప్పటివరకు అందించిన అతిపెద్ద విరాళాల్లో ఇదొకటి. మా కంపెనీని క్రమంగా ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరిస్తున్నాం. ఇప్పటికే చెన్నై, తిరుపతిలో మా కంపెనీ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. మరిన్ని రాష్ట్రాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం' అని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ అధికారులు

17న భారత్ గౌరవ్ టూరిస్టు ట్రైన్
11 రాత్రులు, 12 పగళ్లు జ్యోతిర్లింగాల యాత్ర

రైల్వే స్టేషన్ ఆగస్టు 6 : ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఈనెల 17న విజయవాడ నుంచి ఏడు జ్యోతిర్లింగాల దర్శనానికి భారత్ గౌరవ్ టూరిస్టు రైలును నడుపుతుంది. ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు మొత్తం 11 రాత్రులు, 12 పగళ్లు ఈ యాత్ర జరగనుంది. ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకాలోని నాగేశ్వర్, సోమనాథ్‌లోని సోమనాథ్, పూణేలోని భీమశంకర్, నాసిక్‌లోని త్రయంబకేశ్వర్, ఔరంగాబాద్‌లోని ఘ్రుష్ణేశ్వర్ దర్శనాలు ఉంటాయి. సికింద్రాబాద్ మీదుగా విజయవాడ నుంచి బయలుదేరే ఈ రైలుకు సంబంధించి మిగతా వివరాలు, బుకింగ్ కోసం 92810 30714, 92814 95848 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఐఆర్‌సీటీసీ టూరిజం వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ రైలులో ఎకానమీ, స్టాండర్డ్, కంఫర్ట్ కోచ్‌లుంటాయి. ఎకానమీ క్లాస్ స్లీపర్ కోచ్‌లో పెద్దలకు రూ.20,590, 5 నుంచి 11 సంవత్సరాల వయస్సు లోపల పిల్లలకు రూ.19,255, స్టాండర్డ్ త్రీ ఏసీలో పెద్దలకు రూ.33,015, పిల్లలకు రూ.31,440, కంఫర్ట్ 2 ఏసీలో పెద్దలకు రూ.43,355, పిల్లలకు రూ.41,465 చొప్పున చార్జీలు చెల్లించాలి. భోజనాలు, తదితర సర్వీసులు నిబంధనల మేరకు అందజేస్తారని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

వన్‌టౌన్, ఆగస్టు 6 : హాస్టల్ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలంటూ విజయవాడలోని కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, కోశాధికారి ఎం.సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు లోపించాయన్నారు. కనీసం మరుగుదొడ్లు, స్నానపుగదులు లేవన్నారు. తిరువూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న హాస్టల్‌ను వెంటనే మహిళలకు కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ , మెస్ చార్జీలను విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హాస్టల్ గదులను ఏర్పాటు చేయియాలన్నారు. విజయవాడ నగర అధ్యక్షుడు రంజిత్, కార్యదర్శి జగదీష్, సుధీర్, అయ్యప్ప, సురేష్, కార్తీక్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీలు చెల్లవు

గన్నవరం, ఆగస్టు 6 : కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీలు చెల్లవని హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎంఐఎస్ బండ్లమూడి ఆంజనేయప్రసాద్, సీఆర్‌పీలు సంకాబత్తుల వెంకట్, కాండ్రు మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మండల విద్యా శాఖలో ఒప్పంద ఉద్యోగులుగా గౌరవ వేతనంపై విధులు నిర్వహిస్తున్న ఆ ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సుదూర ప్రాంతానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసిన ఆదేశాలను కొట్టివేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. అధికారులు తాము ఎన్నికల సమయంలో వైసీపీకి ఓటు వేయమని ప్రచారం చేశామని, స్పందన మానసిక స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారని ఫిర్యాదులు అందాయని ఆ ఆరోపణలపై విచారణ అనంతరం చర్యలు తీసుకుంటూ మచిలీపట్నం, కోడూరు మండలాలకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు.


మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాచౌక్, ఆగస్టు 6: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ పథకాలను వారికి అందజేయాలన్నారు. కౌలు రైతులకు నాణ్యమైన విత్తనాలు, క్రిమి సంహారక మందులు సబ్సిడీపై అందించాలన్నారు. సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 9న జరిగే " క్విట్ కార్పొరేట్ ఇండియా " ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యక్షుడు ఇల్లా రామిరెడ్డి మాట్లాడుతూ పోలవరం ముంపు గ్రామాలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, ఉపాధ్యక్షులు యు.వీరబాబు, కె.మోహన్, సహాయ కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, షేక్ బాషా, సునీత , కోశాధికారి ఎస్.లలిత పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నేత చిన్నం సుశీల

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ధర్నాచౌక్, ఆగస్టు 6: గత ఇరవై ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో పని చేస్తున్న (కుక్, కామాటి, వాచ్‌మన్) ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏపీ సంక్షేమశాఖల సోషల్, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చిన్నం సుశీల కోరారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మాట్లాడారు. తాము అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నామని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారానికి ఒక సెలవు మంజూరుకు చర్యలు తీసుకోవాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.హరినారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను తొలగించిందన్నారు. రిటైర్‌మెంట్ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. రూ. 10 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలన్నారు. గౌరవాధ్యక్షుడు ఎస్.జ్ఞాన శేఖర్, బి.అప్పారావు, శ్యామ్ ప్రసాద్, పీవీ రమణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సెక్స్ వర్కర్లు, విటుడు అరెస్టు

పెనమలూరు, ఆగస్టు 6: తాడిగడప, యనమలకుదురు డొంకరోడ్డులో స్పా సెంటరు ముసుగులో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పెనమలూరు పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు మహిళలను, ఒక విటుడిని అదుపులోకి తీసుకొన్నారు. పోలీసులు దాడులతో నిర్వాహకులు పరారయ్యారు. ఈదాడిలో మూడు బైక్‌లు, ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. తాడిగడప యనమలకుదురు డొంకరోడ్డులోని సూరమ్మచెరువు సమీపంలోని రెండంతస్థుల భవనంలో స్పా ముసుగులో వ్యభిచార గృహం నడుస్తోందని పోలీసులకు సోమవారం సమాచారం అందింది. దీంతో మహిళా ఎస్సై ఉషారాణి తన సిబ్బందితో దాడులు చేశారు. గృహ నిర్వాహకులు పరారయ్యారు.. మహిళలను రెస్క్యూహోంకు తరలించనున్నట్లు సీఐ రామారావు తెలిపారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈవో రామారావు


ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్‌కు చిత్రపటం అందచేస్తున్న ఈ.వో

దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన

వన్‌టౌన్, ఆగస్టు 6 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఈఈ రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.కొండ దిగువన జరుగుతున్న అన్ని పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులకు నిర్వహిస్తున్న ఉచిత ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్క భక్తుడికి అమ్మవారి ప్రసాదం అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

దుర్గమ్మ సేవలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ...

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి పీయూష్ కుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.

నంద్యాల జిల్లా కలెక్టర్...

కనకదుర్గమ్మను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా మంగళవారం దర్శించుకున్నారు. ఈవోఆమెకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆమెకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, ఆశీస్సులు అందశారు.



ధర్మపథం వేదికపై...

ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీరామ సంగీత అకాడమీ జి.జానకిరామ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలోని బృందం పలు భక్తి గీతాలను ఆలపించింది. మొత్తం 15 కీర్తనలను బృందం హృదయాలకు హత్తుకునేటట్లుగా తమ గానంతో అలరించారు. ఆహుతుల హర్షధ్వానాలు అందుకున్నారు.


బొడ్డుబొమ్మ సెంటర్‌లో అనధికారికంగా రుసుము వసూలు చేస్తూన్న ప్రైవేట్ వ్యక్తి


వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న టిక్కెట్ రశీదులు

పార్కింగ్‌లో ప్రైవేట్ దోపిడీ

● కెనాల్ రోడ్డు, బొడ్డుబొమ్మ సెంటర్ వద్ద అనధికార రుసుం వసూలు

వన్‌టౌన్ : వన్‌టౌన్ కెనాల్ రోడ్డు, బొడ్డుబొమ్మ సెంటర్ వద్ద విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన వాహనాల పార్కింగ్‌లో ప్రైవేట్ వ్యక్తులు దుర్గగుడికి వచ్చే వాహనదారులు, వన్‌టౌన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే వాహనదారుల నుంచి అనధికారికంగా రుసుం వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారం పై కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ పరిధిలో ఉన్న పార్కింగ్ లీజు ఈ ఏడాది జూన్‌తో ముగిసింది. లీజు కాలపరిమితి ముగిసిన నాలుగు రోజుల వరకు కార్పొరేషన్ అధికారులు సిబ్బందిని నియమించి వాహనదారుల నుంచి రుసుం వసూలు చేశారు. కార్పొరేషన్ ధరల ప్రకారం 3 గంటల పాటు బైక్, మోటార్ సైకిల్‌కు రూ.10, కారుకు రూ.30 చొప్పున వసూలు చేశారు. అయితే పలువురు ప్రైవేటు వ్యక్తులు ఆ పార్కింగ్‌లో నిలుపదల చేసిన వాహనదారుల నుంచి శ్రీదుర్గామల్లేశ్వర వాహనముల పార్కింగ్ విజయవాడ రశీదు పేరుతో 3 గంటలకు కారుకు రూ.50, తుఫాన్, టాటా మేజిక్ వాహనాలకు రూ.100, హెవీ వెహికల్స్‌కు రూ.200లు అనధికారికంగా వసూలు చేస్తున్నారు. దీనిపై పలువురు వాహనదారులు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న పార్కింగ్‌లో ప్రైవేట్ వ్యక్తుల అనధికారికంగా భారీ రుసుం వసూలు చేయటం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రైవేటు వ్యక్తులతో కార్పొరేషన్ సంబంధిత విభాగ అధికారి లాలూచీ పడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అనధికార రుసుం వసూలుపై విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

చంద్రబాబు చిత్రపటానికి రేషన్ డీలర్ల పాలాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లీలామాధవరావు తదితరులు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చే ప్రకటన చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంగళవారం విజయవాడలోని డీలర్ల సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు దివి లీలా మాధవరావు నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాధవరావు విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ పేరుతో ఎండీయూ వాహనాలను తీసుకొచ్చి రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఎండీయూ ఆపరేటర్ల వెనుక వైసీపీ నాయకులే ఉండి వారి ద్వారా రేషన్ బియ్యం మాఫియాను విస్తరించారని ఆరోపించారు.


వైఎస్సార్ కాలనీలో ధర్మచక్రం చిత్రంలోని సన్నివేశం షూటింగ్

శరవేగంగా ధర్మచక్రం షూటింగ్

విజయవాడ కల్చరల్, ఆగస్టు 6 : ప్రజలు నమ్మి ఒక్క చాన్స్ ఇచ్చిన తప్పుకి జరిగిన పర్యవసానమే ధర్మచక్రం చిత్రమని దర్శకుడు పసుపులేటి వెంకట రమణ అన్నారు. విజయవాడలోని వైఎస్ఆర్ కాలనీలో మంగళవారం చిత్ర షూటింగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక సామాన్యుడు అసమాన్యుడిగా ఎలా మారాడు, రాముడు ఏమి తప్పు చేశాడని కాటికి కాపలాదారుడిగా మారాడని అన్నారు. నారా చంద్రుడు ఏమి తప్పు చేశాడని 53 రోజులు జైలు పాలయ్యాడనే ఈ చిత్ర సారాంశమన్నారు. గత 20 రోజులుగా రాజధాని అమరావతిని, విజయవాడ ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకొంటోందని అన్నారు. కొణిదల ఆర్ట్స్ సమర్పణలో మనోహర నాయుడు నిర్మాణంలో వీఆర్‌పీ క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రంలో ధనుంజయ్ మహారాష్ట్ర, కల్యాణ్ హైదరాబాద్, అరుణ్ విజయ్, వలపర్ల సురేష్ జర్నలిస్టు, దేవిక, కావ్య భాను, లక్కీ, నారగాని అజయ్, జాఫర్ తదితర తారాగణం నటించగా ఎడిటర్ నందమూరి హరి, సంగీతం శంకర మహదేవన్, డిజైన్ వెంకట్, పోస్ట్ ప్రొడక్షన్ చెన్నైలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు అత్యంత దుర్మార్గం

● ఈ తీర్పుపై అప్పీల్ చేస్తాం



దర్నాచౌక్, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దుర్మార్గమని, తీర్పు ఇచ్చిన రోజు ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ తీర్పును తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తామన్నారు. లక్షలాది మంది మాలలతో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను ఈ తీర్పుఅమలు చేయకుండా ఉద్యమించాలన్నారు. రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేసే కుట్రలో భాగమే ఈ తీర్పు అన్నారు. మాల, మాదిగలను విడదీసే కుట్రకు సీఎం చంద్రబాబు గత 30 ఏళ్ల కిందటే తెరతీశారని ఆరోపించారు. దళితులు రాజ్యాధికారం సాధించకుండా కుట్ర జరుగుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కనుసన్నల్లో వ్యవస్థలు పని చేస్తున్నాయని విమర్శించారు. మాల సామాజికవర్గం ప్రజలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ద్రోహం చేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలోని మాల ప్రజాప్రతినిధులు వర్గీకరణపై ఎందుకు నోరు మెదడటం లేదని ధ్వజమెత్తారు.

గాంధీజీ మహిళా కళాశాలలో చేనేత వస్త్రధారణ పోటీలు


విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

వన్‌టౌన్, ఆగస్టు 6 : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వన్‌టౌన్‌లోని గాంధీజీ మహిళా కళాశాలలో చేనేత వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వనితా శ్రీనివాసన్ ఆదేశాల మేరకు బీజేపీ రాష్ట్ర మోర్చా అధ్యక్షురాలు నిర్మలా కిషోర్ పిలుపు మేరకు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందచేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ముఖ్య అతిథిగా పాల్గొని చేనేత వస్త్రాల ప్రాధాన్యతను వివరించారు. కళాశాల చైర్మన్ కొత్తమాసు పిచ్చయ్య, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు యర్రా సునీత, బీజేపీ రాష్ట్ర నాయకురాళ్లు చిగురుపాటి లక్ష్మీసుజాత, రత్నకుమారి, విభాగ అధ్యక్షురాలు సాయిశాంతి, బుల్లబ్బాయి, రవి, తదితరులు పాల్గొన్నారు.


తీర్థు సమదేవ్ | సంపత్‌కుమార్ | యజ్ఞసాయి

నేషనల్ ఆక్వాటిక్ చాంప్‌లో ఎన్టీఆర్, కృష్ణా స్విమ్మర్లకు పతకాలు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 6 : ఒడిస్సా రాష్ట్రం కళింగ పట్నంలో మంగళవారం జరిగిన 40వ సబ్ జూనియర్, 50వ జూనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్, కృష్ణాజిల్లా స్విమ్మర్లు పతకాలతో సత్తా చాటారు. జూనియర్ విభాగంలో తీర్థు సమదేవ్ కాంస్యం, కృష్ణా స్విమ్మర్ జి.సంపత్ కుమార్ యాదవ్ రజతం, ఎన్టీఆర్ స్విమ్మర్ ఎం.యజ్ఞసాయి సబ్ జూనియర్ రజతం సాధించాడు. ఈ సందర్భంగా ఏపీఏ ట్రెజరర్ ఐ. రమేష్ స్విమ్మర్లను అభినందించారు.

పొట్టకూటి కోసం వచ్చి అల్లాడుతున్న హటియా నగర యువకుడు

● చేరదీసిన టీడీపీ నేత

పాయకాపురం, ఆగస్టు 6 : పొట్టకూటి కోసం తన స్నేహితులతో కలసి ఊరుకాని ఊరు వచ్చిన ఓ యువకుడు అనుకోని ఆపదలో పడ్డాడు. హటియా నగరానికి చెందిన యువకుడు మంగళవారం గంజాయి బ్యాచ్‌కు దొరికాడు. దాంతో ఆ యువకుడిని చావబాది అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, జేబులో నగదు లాక్కొని పంపించారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక అజిత్‌సింగ్‌నగర్ పైపులరోడ్డు వద్ద దిక్కుతోచని స్థితిలో తిరుగుతున్నాడు. టీడీపీ నేత దాసరి కనకారావు విషయం తెలుసుకొన్నాడు. జార్ఖండ్ రాష్ట్రం హటియా నగరానికి చెందిన సందీప్ ఎక్క(20) గత ఏడాది వివాహం జరిగింది. ఇంట్లో భార్య, తల్లిదండ్రులను పోషించుకునేందుకు సొంత ఊరిలో పనులులేక ముగ్గురు స్నేహితులతో కలసి చెన్నైకు వెళుతూ స్నేహితులతో విడిపోయి విజయవాడలో దిగిపోయాడు. గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేసి సెల్‌ఫోన్, నగదు లాక్కుని వెళ్లారని విషయాన్ని సందీప్ కనకారావుకు తెలిపాడు. కనకారావు కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా వారు నమ్మలేదు. తరువాత వీడియో కాల్ ద్వారా కుటుంబ సభ్యులకు సందీప్‌ను చూపడంతో తామే విజయవాడకు వస్తున్నామన్నారు.



వరప్రసాద్‌కు డీఆర్‌ఎం అభినందన

రైల్వే స్టేషన్ ఆగస్టు 6 : పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఇటీవల జరిగిన 16వ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ 2024-25 మాస్టర్స్ క్రేజీ వెయిట్ కేటగిరిలో విజయవాడ డివిజన్‌లో పర్సనల్ బ్రాంచ్ జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జె. వరప్రసాద్ ప్రతిభ చూపి 50 ప్లస్ వయస్సు విభాగంలో 85 కిలోల బరువును ఎత్తి మిస్టర్ ఆంధ్రాగా నిలిచారు. ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వరప్రసాద్‌ను డీఆర్‌ఎం నరేంద్ర ఎ. పాటిల్‌తోపాటు సీనియర్ డీపీవో కట్టా ఆనంద్ తదితరులు మంగళవారం అభినందించారు.

వేబ్రిడ్జికి విద్యుత్ కనెక్షన్ తొలగింపు

గండిగుంట (ఉయ్యూరు), ఆగస్టు 6 : గండిగుంట గ్రామ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న వేబ్రిడ్జికి విద్యుత్ కనెక్షన్‌ను సీఆర్డీఏ కమిషనర్ ఆదేశాలతో ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు పట్టణ అధికారులు తొలగించారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన సర్వీసురోడ్డు, కాటూరు రోడ్డును ఆనుకుని అండర్‌పాస్ సమీపాన సర్వే నంబరు 180/5లో నూకల నాగసుధీర్ కుమార్ నిరిస్తున్న వేబ్రిడ్జికి అధికారులు విద్యుత్ సర్వీసు ఇచ్చారు. ఏవిధమైన అనుమతులు లేనిచోట వేబ్రిడ్జికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని లక్ష్మణరెడ్డి సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణంలో ఉన్న వేబ్రిడ్జికి అనుమతి లేనందున విద్యుత్ సర్వీసు తొలగించాలని సీఆర్డీఏ కమిషనర్ విద్యుత్ శాఖ ఏఈ, ఏడీఈ, డీఈలకు జారీచేసిన ఆదేశాల మేరకు సర్వీసును విద్యుత్‌శాఖ అధికారులు తొలగించారు.

ఎస్టీ నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ

వన్‌టౌన్ ఆగస్టు 6 : మెగా డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని ఎస్సీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుడు ఆదేశాల మేరకు 100 మందికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ సృజన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 75 రోజుల నుంచి 90 రోజుల వరకు బస, బోర్డింగ్ సౌకర్యాలతో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల మూడో వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని కోచింగ్ సెంటర్ కమిటీ తనిఖీ చేసి సెలెక్టు చేస్తారన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాల నకళ్లతో దరఖాస్తును జతజేసి ఈనెల 7 నుంచి 12వ తేదీ లోపు ఏలూరు రోడ్డులోని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 96663 92500లో సంప్రదించాలన్నారు.

బంగ్లాదేశ్‌లో శాంతి ఏర్పాటుకు అందరూ సహకరించాలి

గవర్నర్‌పేట, ఆగస్టు 6 : బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులపై జమాఅతే ఇస్లామీ హింద్ సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో అశాంతిని పారదోలి శాంతిని నెలకొల్పేందుకు అక్కడి ప్రజలతో పాటు ప్రపంచ దేశాలు సహకరించాలని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫీఖ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రధానిగా సాగించిన విధానాల పరిణామాల వల్ల అక్కడ అనిశ్చితి, అశాంతి ఏర్పడిందని, వాటిని త్వరగా పరిష్కరించాలని అక్కడి అధికారులకు విజ్ఞప్తి చేశారు. బంగ్లా ప్రజలు శాంతియుతంగా ఉండాలని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని, బంగ్లా మధ్యంతర ప్రభుత్వాన్ని కోరారు. మైనారిటీలపై జరిగే హింసను ఆపాలని, శాంతి నెలకొల్పేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవం

వన్‌టౌన్, ఆగస్టు 6 : జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతున్నారని తెలిపారు. విజయవాడలో ఉదయం 7 గంటలకు మేరీ స్టెల్లా కళాశాల ప్రధాన ద్వారం నుండి వాక్ ఫర్ హ్యాండ్ లూమ్ కార్యక్రమం జరుగుతుందని, సర్వీసు రోడ్డు, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, పంట కాలువ రోడ్డు మీదుగా ఇండోర్ స్టేడియానికి చేరుతుందన్నారు. ఇండోర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటలకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన కార్యక్రమం ఉంటుందన్నారు.

జాతీయస్థాయి బీచ్ కబడ్డీకి రాష్ట్ర జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 6 : బీహార్ రాష్ట్రంలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగే సీనియర్ నేషనల్ బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పురుషుల, మహిళ జట్ల ఎంపికను పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. పి.సతీష్‌కుమార్(కడప), ఎం.భువన(విజయనగరం) జట్ల కెప్టెన్లుగా వహిస్తారన్నారు. ఏపీ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.వెంకటరెడ్డి, ఇంటర్నేషనల్ కబడ్డీ ప్లేయర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.అర్జునరావు జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు. పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

పురుషులు : పి.సతీష్‌కుమార్, జి.పవన్‌కుమార్, ఆర్.నవీన్‌కుమార్, వై.రాజశేఖర్‌రెడ్డి, కె.రవికుమార్, కె.కృష్ణంరాజులతో పాటు కోచ్‌గా ఎం.సుబ్బరాజు, మేనేజర్ వి.శ్రీనివాసులు ఎంపికయ్యారు.

మహిళా జట్టు : ఎం.భువన, ఎల్.డిల్లేశ్వరి, టి.అశ్విని, ఎస్.కె.హసీనా, వి.సూర్య కళ, కోచ్‌గా బి.సుకన్య, బి.సౌమ్య మేనేజర్‌గా ఎంపికయ్యారు.

ఇంధన సంస్థలు దివాలా?

- జగన్ హయాంలో ఆర్థిక సంస్థల నుంచి 65 వేల కోట్ల రుణాలు
- ఇప్పటికే రెండు నెలలుగా బకాయిలు చెల్లించని విద్యుత్తు సంస్థలు
- నేడు పీఎఫ్‌సీకి రూ.650 కోట్లు, ఆర్ఈసీకి రూ.850 కోట్లు కట్టాలి
- వరుసగా మూడో నెల వాయిదా చెల్లించకపోతే ఐపీ ప్రకటించే చాన్స్

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇంధన సంస్థలు దివాలా తీసే స్థితికి వెళ్లిపోతున్నాయి. జగన్ పాలనలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), ఇతర వాణిజ్య బ్యాంకుల నుంచి రూ.65వేల కోట్లకు పైగా విద్యుత్తు సంస్థలు రుణాలు తీసుకున్నాయి. గత ఐదేళ్లలో సబ్సిడీ మొత్తాలను కూడా ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో వీటి రోజువారీ నిర్వహణకూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు ఆర్థికపరమైన అంశాలపై ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేకపోయాయి. నెలవారీ ఆదాయం లేకపోవడం, కోడ్ అమలులో ఉన్న సమయంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం లేకపోవడంతో బకాయిలు చెల్లించడం కష్టంగా మారింది. ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు అసలు, వడ్డీ కలిపి నెలనెలా వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంది. వరుసగా 3నెలల పాటు వాయిదాలు చెల్లించకపోతే కేంద్రం మార్గదర్శకాల మేరకు విద్యుత్తు సంస్థలు దివాలా తీసినట్లు ఆర్థిక సంస్థలు ప్రకటిస్తాయి. కేంద్రం ఆధ్వర్యంలోని ప్రాప్తి పోర్టల్‌లో లెక్కల ప్రకారం... రాష్ట్రం తీసుకున్న రుణాలకు 2నెలలుగా వాయిదాలు చెల్లించడం లేదు. ఒక నెలలో రూ.2,304.84 కోట్లు, ఇంకో నెలలో రూ.2,058,72 కోట్లు చొప్పున మంగళవారం నాటికి రూ.4,363.56 కోట్ల మేర విద్యుత్తు సంస్థలు బకాయిపడ్డాయి. బుధవారం మరో వాయిదా చెల్లించకపోతే.. వరసగా 3నెలల పాటు వాయిదాలు చెల్లించనందున ఇంధన సంస్థలను దివాలా తీసినట్లు ప్రకటించే అవకాశాలున్నాయి. ప్రధానంగా బుధవారం పీఎఫ్‌సీకి రూ.650కోట్లు, ఆర్ఈసీకి 850కోట్లు చెల్లించాలి. దీనికోసం ఇంధన సంస్థల వద్ద నిధులు లేవు. గత ప్రభుత్వం ఎగవేసిన సబ్సిడీ మొత్తాలైనా సర్దుబాటు చేయాలంటూ ఇంధన సంస్థలు రాష్ట్ర ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నాయి. అయితే ఇప్పటికీ రాష్ట్రంలో అప్పులెన్నో తెలియక కూటమి ప్రభుత్వం తంటాలు పడుతోంది. బుధవారం నాటికి ఏదో ఒక నిర్ణయం తీసుకుంటే తప్ప విద్యుత్తు సంస్థల మనుగడ ప్రశ్నార్థకమేనని ఇంధన రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏపీని అప్పుల కుప్పగా మార్చిన జగన్: రఘురామ

న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్లలోనే ఏపీని అప్పుల కుప్పగా మార్చేశాడని ఉండి శాసన సభ్యుడు రఘురామకృష్ణరాజు తెలిపారు. అసలు ఎన్ని అప్పులు చేశాడో అంతుచిక్కడం లేదన్నారు. మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో శరవేగంగా ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 55 రోజుల్లోనే ఎన్నో పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. అమరావతికి కేంద్రం రూ.15 వేల కోట్లు ఇవ్వడం ఊపిరి పోసినట్టు అయ్యిందన్నారు. రాజధానిలో నిర్మాణ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అక్కడ గజం రూ.40 వేలకు చేరిందన్నారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ స్తబ్ధుగా మారిందన్నారు. మాజీ సీఎం జగన్‌పై తాను వేసిన కేసు బుధవారం విచారణకు వస్తుందని అన్నారు. జగన్‌ను అసెంబ్లీకి రావాలని కోరానని, వస్తానని మాకు మాటిచ్చారని, చెప్పినట్టే వస్తారని అనుకుంటున్నానని రఘురామరాజు అన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి: ఆర్ కృష్ణయ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఈ డిమాండ్లతో పార్లమెంటు నుంచి జంతర్ మంతర్ వరకు ప్రదర్శన చేశారు. జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో 70 కోట్ల మంది ఉన్న బీసీలకు మంత్రిత్వశాఖ లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్రం.. బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని 30 ఏళ్లుగా పోరాడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

విశ్వవిద్యాలయాల్లో మొక్కలు నాటండి: గవర్నర్

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'విశ్వవిద్యాలయాల్లో మొక్కలు నాటడానికి, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు అమలు చేయడానికి అవసరమైన సూచనలు జారీ చేయండి' అని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉన్నత విద్యాశాఖను ఆదేశించారు. మంగళవారం రాజ్‌భవన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ పనస మొక్కను, ప్రథమ మహిళ సమీరా నజీర్.. సంపంగి మొక్కను నాటారు.

హిందూ ఆలయాల పర్యవేక్షణకు కమిటీ వేయండి

- ఏపీ సీఎం చంద్రబాబుకు టి-ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో హిందూ దేవాలయాలలో కార్యకలాపాలను పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా బీజేపీ, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ కమిటీలో హిందు మతానికి చెందిన వ్యక్తులు, సంఘాలు మాత్రమే ఆలయ ప్రాంగణంలో వ్యాపారం లేదా ఏదైనా కార్యకలాపాలు నిర్వహించడానికి అనుమతించాలన్నారు. దేవాలయాల్లో, చుట్టుపక్కల ఇతర మతాలకు చెందిన వ్యక్తులు, సంఘాలు వ్యాపారాలు, కార్యకలాపాలు నిర్వహించకుండా నిషేధించాలని కోరారు.

మెడికల్ కాలేజీల్లో 10 శాతం ఈడబ్ల్యూఎస్

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం, ప్రయివేటు కాలేజీలతో పాటు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రతి కాలేజీ 10 శాతం ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలని ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. మైనార్టీ కాలేజీలకు మాత్రం మినహాయింపు ఇచ్చారు.

రిసోర్స్‌పర్సన్ల నుంచి రూ.వేలల్లో వసూళ్లు

- వైసీపీ మాజీ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

మడకశిర టౌన్, ఆగస్టు 6: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు డాక్టర్ తిప్పేస్వామిపై మెప్మా సంఘాల రీసోర్స్ పర్సన్‌లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ హయాంలో మడకశిర పరిధిలోని ఒక్కో రీసోర్స్ పర్సన్ నుంచి రూ.50 వేలు, రూ.లక్ష చొప్పున వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చిన తర్వాతే తమను రీసోర్స్‌పర్సన్‌లుగా కొనసాగేందుకు అనుమతిచ్చారని తెలిపారు.

పెద్దిరెడ్డిపై వేటు తప్పదు: రామచంద్ర యాదవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై వేటు తప్పదని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అమలాపురం మాజీ ఎంపీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ జీవీ హర్షకుమార్‌ను మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారు కొద్దిసేపు పోలవరం, వర్గీకరణ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం రామచంద్ర యాదవ్ విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి ఎన్నిక చెల్లదన్నారు. త్వరలోనే పెదిరెడ్డిపై వేటు తప్పదని అన్నారు. ఇక రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయని చెప్పారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి తమ బీసీ నేతలతో చర్చించి మద్దతు ఇస్తామన్నారు.

ఐదేళ్లలో విశాఖకు ఒకే ఒక్క పరిశ్రమ: కేంద్రం

ఎంవీపీ కాలనీ(విశాఖపట్నం), ఆగస్టు 6: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖకు కేవలం ఒకే ఒక్క పరిశ్రమ వచ్చిందని కేంద్రం తెలిపింది. ఎంపీ ఎం.శ్రీభరత్ లోక్‌సభలో మంగళవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమాధానం చెప్పారు. దివీస్ లేబొరేటరీస్ ఈవోయూ విభాగం 2021-22లో బల్క్ డ్రగ్, ఫార్మాస్యూటికల్స్ రంగంలో ఉత్పత్తిని ప్రారంభించిందని, అది మినహా కొత్త పరిశ్రమలేవీ విశాఖ జిల్లాకు రాలేదని స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రంలో కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు విరివిగా చేయించాల్సిన పరిస్థితి ఉందని కేంద్రానికి ఎంపీ శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు.

మైనార్టీలను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం: ఫరూక్

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మైనార్టీల సంక్షేమానికి తీవ్ర విఘాతం కలిగిందని, మైనార్టీలందరినీ జగన్ ప్రభుత్వం దగా చేసిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ విమర్శించారు. రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చంద్రబాబు సీఎంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనార్టీల సంక్షేమానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు.



జ్వర బాధితుల్లో చేయి వాపు (నమూనా చిత్రం)

ఊరూరా వింత జ్వరాలు..!

జ్వరంతోపాటు విపరీతమైన కీళ్ల నొప్పులు.. బాధితుల్లో పాదాలు, చేతులు వాపులు
జ్వరం తగ్గినా వదలని కీళ్ల నొప్పులు.. గుంటూరు జిల్లాలో ప్రబలుతున్న జ్వరాలు
చికున్ గున్యా కాదంటున్న డీఎంహెచ్‌వో .. ఆర్బో వైరస్ కావచ్చంటున్న వైద్యులు

గుంటూరు (మెడికల్), ఆగస్టు 6: తీవ్రమైన జ్వరం.. దానికితోడు కీళ్ల నొప్పులు, పాదాలు, చేతుల వాపు.. అడుగుతీసి అడుగు వేయలేని స్థితి, చేతి వేళ్లను కూడా ముడవలేని పరిస్థితి.. ఇవన్నీ చికెన్ గున్యా లక్షణాలు కదా అంటే.. వైద్యులు మాత్రం కాదని చెబుతున్నారు. ఆర్బో తరగతికి చెందిన వైరస్ ఈ వింత జ్వరాలకు కారణమని వైద్య వర్గాలు భావిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో ఇప్పుడు ఈ వింత జ్వరాలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాచర్ల, పల్నాడు ప్రాంతాల్లో ఊళ్లకు ఊళ్లు ఈ జ్వరాల బారిన పడుతున్నాయి. ఇది వైరల్ ఫీవర్ కావడంతో ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడినా.. అది ఇంటిల్లిపాదికీ పాకుతోంది. బాధితుల్లో జ్వరం, కీళ్ల నొప్పులు, పాదాలు, చేతుల వాపు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. జ్వరం మూడు, నాలుగు రోజుల్లోనే తగ్గుతున్నా.. కీళ్ల నొప్పులు మాత్రం వదలడం లేదు. ఎక్కువ మందిలో 4-6 వారాల పాటు కీళ్ల నొప్పులు వేధిస్తున్నట్టు చెబుతున్నారు. జ్వర ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఇవి చికున్ గన్యా జ్వరాలను తలపిస్తున్నా.. వైద్య పరీక్షల్లో నిర్ధారణ కావడం లేదు. ఈ వింత జ్వరాలపై గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీని వివరణ కోరగా.. వీటిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రోగులు మూడు రోజుల్లోనే కోలుకుంటున్నారని తెలిపారు. తీవ్రమైన సమస్యలేమీ లేవన్నారు. రోగుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షిస్తే, అవి చిగున్ గున్యా కాదని తేలిందని చెప్పారు. వైరస్ నిర్ధారణ కోసం నమూనాలను పుణెలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపాలని భావిస్తున్నారు.

ఆరు వారాల పాటు కీళ్లనొప్పులు

జ్వరంతోపాటు కీళ్ల నొప్పులు, కాళ్ల చేతులు వాపులు కనిపిస్తుండడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ మంది గుంటూరు నగరంలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. 'ఈ వైరల్ ఫీవర్లు ప్రమాదకరం కాదు. లక్షణాలను బట్టి చికిత్స అందిస్తే తగ్గిపోతుంది' అని సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ వైవీఎస్ ప్రభాకర్ తెలిపారు. కొంత మందిలో జ్వరం తగ్గాక రెండు వారాలకు పైగా కీళ్ల నొప్పులు ఉంటే వారికి తక్కువ మోతాదులో స్టెరాయిడ్స్ ఇస్తే ఉపశమనం లభిస్తున్నట్టు పల్మనాలజిస్ట్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆరు వారాల్లో కీళ్ల నొప్పులు పూర్తిగా తగ్గిపోతున్నట్టు ఆయన తెలిపారు.

అడ్డంగా దొరికిన 'సీఎఫ్‌వో'

- సొంత కంపెనీలకు అధికారిక పనులు
- నిబంధనలకు విరుద్ధంగా లక్షల్లో ఆర్జన
- పట్టణ 'మౌలిక' సంస్థ అధికారి అత్యాశ
- ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెల్లడైన అక్రమాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ పట్టణ మౌలిక సదుపాయాలు, ఆస్తుల నిర్వహణ సంస్థ(ఏపీయూఐఏఎంఎల్) అక్రమార్కుల అడ్డాగా మారింది. రూ.10 లక్షల జీతం డ్రా చేసి, ఐఏఎస్ అధికారులను సైతం ఆశ్చర్యపడేలా చేసిన ఆ సంస్థ సీఈవోను తప్పించిన కొద్ది రోజుల్లోనే ఆ విభాగంలో పనిచేసే చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్(సీఎఫ్‌వో) అక్రమాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తమ కుటుంబ సభ్యులతో కొన్ని సూట్‌కేస్ కంపెనీలు ఏర్పాటు చేసుకుని, వాటికి పలు పనులు అప్పగించి.. సొమ్ము చేసుకున్న వ్యవహారం బట్టబయలైంది. ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో పలు విషయాలు బహిర్గతమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఆడిట్ నివేదికను బుట్టదాఖలు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొందరు సదరు ఆడిట్ నివేదకను వెలుగులోకి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయినప్పటికీ నివేదికలోని పలు కీలక విషయాలు తాజాగా వెలుగు చూశాయి. ప్రభుత్వ శాఖలు, సంస్థలకు వివిధ సేవలందించే పట్టణ మౌలిక సదుపాయాల సంస్థలో కీలకమైన సీఎఫ్‌వో సొంత సంస్థలకు కీలక ప్రాజెక్టులు అప్పగించి, ఫీజుల రూపంలో రూ.లక్షలను జేబులో వేసుకున్నారు. రాష్ట్ర వేర్‌హౌస్ సంస్థకు సంబంధించిన ఆదాయ పన్ను రిఫండ్ పనులను సీఎఫ్‌వో ఏకంగా తన భార్య పేరుతో ఉన్న క్రిస్కోసైన్ సొల్యూషన్ కంపెనీకి అప్పగించినట్లు ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. సంస్థలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు ఇలాంటి పనులు అప్పగించడం నిబంధనలకు విరుద్ధం. అయినా సదరు అధికారి దీనిని పట్టించుకోలేదు.

- రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ 2014-15, 2015-16, 2020-21లో ఫైల్ చేసిన ఐటీ రిటర్న్స్‌పై రూ.60 కోట్ల వరకు రిఫండ్స్ రావాల్సి ఉందని, జాప్యమైనందున సంస్థ తరఫున దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసి రీఫండ్ తెప్పించాలని 2022, మార్చిలో పట్టణ మౌలిక సంస్థను గిడ్డంగుల సంస్థ కోరింది. 2014-15లో ఫైల్ చేసిన ఐటీ రిటర్న్స్‌పై రూ.4,26, 17,813 ఆదాయ పన్ను వెనక్కి తెప్పించినందుకు ఆ సంస్థ రాష్ట్ర పట్టణ పెట్టుబడుల సంస్థకు 5 శాతం అంటే రూ.21,30,890 ఫీజుగా 2022, జూన్ 7న చెల్లించింది. ఈ మొత్తంలో మళ్లీ రూ.17.50 లక్షలను క్రిస్కోసైన్ సొల్యూషన్ సంస్థకి ఫీజు కింద పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ జమ చేసింది.
- పట్టణ మౌలిక సదుపాయాల సంస్థలో ఐటీ రిటర్న్స్‌పై రిఫండ్ తెప్పించే నైపుణ్యం ఉన్న ఉద్యోగులకు కొదవ లేకున్నా.. ఈ ప్రాజెక్టుని క్రిస్కోసైన్ సొల్యూషన్ సంస్థకి అప్పగించారు. దీనిపై ఫోరెన్సిక్ ఆడిట్‌లో అధికారుల అసలు వ్యవహారం బయటపడింది. క్రిస్కోసైన్ సంస్థ అడ్రస్, పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ సీఎఫ్‌వో ఇంటి అడ్రస్ ఒక్కటే కావడం గమనార్హం. రెండూ విజయవాడ, కరెన్సీ నగర్‌లో ఒకే డోర్ నెంబర్‌తో ఉన్నాయి. ఫైనాన్స్ అధికారి సూట్ కేసు సంస్థను సృష్టించి కీలక ప్రాజెక్టులు క్రిస్కోసైన్‌కి అప్పగించి సంస్థకు చెందాల్సిన ఆదాయాన్ని జేబులో వేసుకున్నట్లు స్పష్టమైంది.
- క్రిస్కో సంస్థకు ప్రాజెక్టు టెండర్ అప్పగించే విషయంలో పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ అధికారులు నిబంధనలు ఉల్లంఘించినట్లుగా ఫోరెన్సిక్ ఆడిట్‌లో గుర్తించారు. 2013 కంపెనీ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరిపినట్లు కూడా తేలింది. క్రిస్కోసైన్ సంస్థ, పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై వివరాలు సేకరించేందుకు ఫోరెన్సిక్ ఆడిట్ బృందం ప్రయత్నించినా వారు సహకరించలేదని నివేదికలో పేర్కొన్నారు.



ముళ్లకంపలతో అడవిగా మారిన అమరావతి రాజధాని ప్రాంతం.. మధ్యలో భవనాలు

అమరావతిలో ముళ్ల కంపల తొలగింపు నేటి నుంచే!

- సచివాలయం వెనుక ఎన్ 9 రోడ్డు నుంచి పనులు ప్రారంభం
- రూ.36.50 కోట్ల వ్యయం.. పనులు చేపడుతున్న ఎన్‌సీసీఎల్

విజయవాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణ పనులకు తొలి అడుగు పడింది. కిందటి వైసీపీ ప్రభుత్వ విధ్వంసానికి బలి అయిన అమరావతి రాజధానిని మళ్లీ గాడిన పెట్టేందుకు వీలుగా టీడీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలలో భాగంగా బుధవారం తొలి అడుగుగా కంప చెట్లు, పిచ్చిచెట్లు, తుమ్మ చెట్ల తొలగింపు ప్రారంభమౌతోంది. అమరావతి రాజధాని అంతా గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాపానికి శాపంగా పిచ్చిచెట్లు, ముళ్ల చెట్లతో అడవిలా మారిపోయింది. వీటిని తొలగించటానికి సీఆర్‌డీఏ అధికారులు రూ.36.50 కోట్లతో టెండర్లు పిలవాల్సి వచ్చింది. టెండర్లను ఇటీవలే ఖరారు చేశారు. ఎన్‌సీసీఎల్ సంస్థ ఈ టెండర్లను దక్కించుకుంది. బుధవారం ఉదయం 8 గంటలకు ఎన్‌సీసీఎల్ సంస్థ పిచ్చి, తుమ్మ చెట్ల తొలగింపు చేపట్టనుంది. సెక్రటేరియట్ వెనుక వైపున ఎన్ 9 రోడ్డు నుంచి ఈ పనులు ప్రారంభించనున్నారు. మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఈ పనులను ప్రారంభిస్తారు. ఈ పనులపై మంత్రి నారాయణ మంగళవారం సీఆర్‌డీఏ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జంగిల్ క్లియరెన్స్‌ను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని, రాజధాని క్యాపిటల్ పరిధిలోని మొత్తం 99 డివిజన్లలో ఒకేసారి పనులు మొదలుపెట్టనున్నట్టు చెప్పారు. నెల రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేస్తామన్నారు.

నువ్వే నమ్మకపోతే ఎలా నాన్నా?

- తండ్రి మందలించాడని మనస్తాపం
- మాచర్లలో ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

నంద్యాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ధైర్యం అవుతాడనుకున్న తండ్రి అపార్థం చేసుకున్నాడు. తప్పు చేయలేదన్నా వినకుండా మందలించాడు. కన్నతండ్రే నమ్మకపోతే ఇక ప్రపంచం ఏంఅర్థం చేసుకుంటుందని భావించిన ఆ కూతురు మనస్తాపం చెందింది. తన చావే సమస్యను పరిష్కరిస్తుందన్న ఉద్దేశంతో 'నేను ఏ తప్పూ చేయలేదు నాన్నా. నువ్వే నమ్మకపోతే ఎలా?' అని ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకుంది. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన జక్కి గౌరప్ప, రామేశ్వరి దంపతుల కుమార్తె రేణుక ఎల్లమ్మ(22) పల్నాడు జిల్లా మాచర్లలోని ప్రైవేటు కళాశాలకు చెందిన వసతి భవనంలో ఉంటూ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. అదే కళాశాలకు చెందిన విద్యార్థి ఆదివారం రేణుకకు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో ఆ విద్యార్థి ఆమె తండ్రికి ఫోన్ చేశాడు. కోపగించుకున్న రేణుక తండ్రి కూతురికి ఫోన్ చేసి 'అబ్బాయిలతో ఫోన్‌లో మాట్లాడాల్సిన పనేముంటుంది. అసలు విషయం కళాశాలకు వచ్చి తేలుస్తా' అని మందలించాడు. దీంతో భయపడిపోయిన రేణుక తాను ఏ తప్పూ చేయలేదని ఉత్తరం రాసి వసతి గృహంలోని ఓ గదిలో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుంది. ఫ్యానుకు వేలాడుతున్న రేణుకను చూసిన ఆమె స్నేహితులు గట్టిగా కేకలు వేశారు. అప్పటికే వసతి గృహానికి వచ్చిన రేణుక తల్లిదండ్రులు కూతురి మృతదేహాన్ని చూసి బోరుమన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నివిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



లోకేశ్‌ను కలిసి సమస్యలు చెప్పుకొనేందుకు ప్రజా దర్బార్‌కు వచ్చిన జనం, వృద్ధ దంపతుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్



జనసేన కార్యాలయంలో మహిళ సమస్యలు వింటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వర్గీకరణపై సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం

- న్యాయమూర్తుల ఎంపికలో క్రీమీలేయర్ ఉందా?: చింతా మోహన్

న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం. దేశ సమగ్రతను, అఖండతను దెబ్బతీసేలా ఉంది. దేశ పౌరుడిగా సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నా' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. మంగళవారం ఢిల్లీ ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సుప్రీంకోర్టులోని న్యాయమూర్తులు సంపన్నులు. వారికి పేదరికం, కులాల గురించి తెలుసా? వారు ఎప్పుడైనా దళితవాడల్లో పర్యటించారా? దేశంలో 1,000 ఉపకులాలు ఉన్నాయి. వర్గీకరణ ఎలా చేస్తారు? వర్గీకరణపై కమిషన్ వెయ్యాలి. అసలు.. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపికలో క్రీమీలేయర్ ఉందా? సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులు ఉంటే వారిలో దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉన్నది ఐదుగురే. మిగిలినవారంతా ఉత్తరాదికి చెందిన వారే. కేవలం ఢిల్లీ, ముంబై నుంచే 10మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఇదేనా క్రీమీలేయర్? ఇదేనా వర్గీకరణ అంటే? దేశ సమైక్యతను దెబ్బతీసేలా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకోకూడదు. ఆయన రిజర్వేషన్ల జోలికి వెళ్లారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనాకు పట్టి గతే పట్టకుండా చూసుకోవాలి' అని చింతా మోహన్ హెచ్చరించారు.

దేవుడిపై విశ్వాసం లేకుంటే విమర్శలు దేనికి?

- హేతువాది కదిరే కృష్ణయ్యకు తెలంగాణ హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దేవుడిపై విశ్వాసం లేకపోతే నిశ్శబ్దంగా ఉండకుండా ఇతర పౌరుల విశ్వాసాలపై విమర్శలు చేయడం ఎందుకు? అని హైకోర్టు ప్రశ్నించింది. ఇలాంటివి వివాదాలుగా తలెత్తకుండా చూసుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి సుప్రభాతంపై ఓ సభలో అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ హేతువాది కదిరే కృష్ణయ్యపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బెదిరింపులు వస్తున్నందున తనకు భద్రత కల్పించాలని కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషన్ తరఫున సీనియర్ న్యాయవాది వీ రఘునాథ్ వాదనలు వినిపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఇలాంటి వివాదాలు తలెత్తకుండా పిటిషనర్‌కు సలహా ఇవ్వాలని సూచించింది.

ఈవో సర్వీసు వ్యవహారాన్ని మీరు ప్రశ్నించలేరు

- ప్రైవేటు వ్యక్తికి స్పష్టం చేసిన హైకోర్టు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖలో పనిచేసే ఉద్యోగి సర్వీసుకు సంబంధించి ఆ శాఖతో సంబంధం లేని ప్రైవేటు వ్యక్తి ప్రశ్నించలేరని హైకోర్టు తేల్చి చెప్పింది. దేవదాయశాఖ పరిధిలోని ప్రొద్దుటూరు శ్రీ కృష్ణగీత ఆశ్రమం ఈవో శంకర బాలాజీకి కడప జిల్లా దేవదాయ సహాయ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదని స్పష్టం చేసింది. పిటిషనర్ శ్రీ కృష్ణగీత ఆశ్రమంలో ఏ హోదాలోనూ విధులు నిర్వర్తించడం లేదని గుర్తుచేసింది. లీజు హక్కులు, చెల్లింపులు విషయంలో ఏమైనా అభ్యంతరం ఉంటే సంబంధిత వేదికను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. సుప్రీంకోర్టు తీర్పును ఉదహరిస్తూ... పిటిషనర్‌కు ప్రస్తుత పిటిషన్ వేసే అర్హత లేదంది. వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ ఇటీవల తీర్పు ఇచ్చింది. ఆశ్రమం స్థలాన్ని లీజుకు తీసుకొని కళాశాల నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ ఎం సురేశ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం... లీజు బకాయిల విషయంలో దేవదాయశాఖ, పిటిషనర్ మధ్య సివిల్ వివాదం నడుస్తోందని గుర్తుచేసింది.

రెండు రాష్ట్రాల ప్రజల సఖ్యతే ప్రగతికి మార్గం

- ఏపీ క్యాబ్ డ్రైవర్లను అడ్డుకోవడం సరికాదు: పవన్ కల్యాణ్

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య సఖ్యతే ప్రగతికి మార్గం. ఏపీలో రాజధాని పనులు మొదలైతే స్థానిక డ్రైవర్లకు ఉపాధి మెరుగవుతుంది. అప్పటి వరకూ సాటి డ్రైవర్లపై మానవత దృక్పథంతో వ్యవహరించండి' అని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ క్యాబ్ డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు క్యాబ్ డ్రైవర్లు ఆయనను కలిశారు. 'ఆల్ ఇండియా పర్మిట్‌తో, తెలంగాణ టెంపరరీ పర్మిట్ కట్టుకుని క్యాబ్స్ నడుపుతున్న ఏపీ డ్రైవర్లను హైదరాబాద్‌లోని స్థానిక డ్రైవర్ల అడ్డుకొంటున్నారు. ఫలితలంగా 2వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జూన్ రెండుతో ఉమ్మడి రాష్ట్ర పరిధి అయిపోయిందంటూ ఇబ్బంది పెడుతున్నారు' అని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై పవన్ స్పందిస్తూ 'ఉమ్మడి రాజధాని గడువు కాలం అయిపోగానే ఏపీ క్యాబ్‌లు హైదరాబాద్‌లో ఉండకూడదని అడ్డుకోవడం సబబు కాదు. కార్మికులు కలసికట్టుగా ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకుంటాం' అని అన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన బాలిక రిషిత నరాల బలహీనతతో బాధపడుతోంది. ఆమె వివరాలు నమోదు చేసుకుని వైద్య నిపుణులు, సంబంధిత శాఖతో మాట్లాడాలని కార్యాలయ అధికారులకు సూచించారు.

విశాఖలో తీవ్ర కాలుష్యం

విశాఖపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'విశాఖలో కాలుష్యం సమస్య చాలా ఎక్కువగా ఉంది. దేశంలోనే వాయు, జల కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరం విశాఖపట్నం' అని పవన్ కల్యాణ్ అన్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు వైసీపీ కార్పొరేటర్లు మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, విశాఖ నగర కార్పొరేటర్లుగా అందరిపై కాలుష్య నియంత్రణ బాధ్యత ఉందన్నారు. విశాఖలో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో రియల్ ఎస్టేట్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, అన్నింటినీ పరిశీలించి న్యాయం చేద్దామని భరోసా ఇచ్చారు.

'బీమా'పై జీఎస్టీ తొలగించండి

ప్రజలను దోచుకోవడం ఆపండి.. పార్లమెంటు మెట్లపై ఇండియా నిరసన



న్యూఢిల్లీ, ఆగస్టు 6: ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై విధించిన 18% జీఎస్టీని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి పార్టీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. మంగళవారం పార్లమెంటు మకర ద్వారానికి ఉన్న మెట్లపై కూర్చుని తృణమూల్, కాంగ్రెస్, ఆప్, ఎన్సీపీ(ఎస్పీ) సహా పలు పార్టీలకు చెందిన ఎంపీలు మోదీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ట్యాక్స్ టెర్రరిజం' పేరిట ప్లకార్డులను ప్రదర్శించారు. బీమా ప్రీమియంలపై ఏకంగా 18% జీఎస్టీ విధించాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. జీఎస్టీని గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌గా అభివర్ణించారు. "తమ ఆరోగ్య సమస్యల విషయంలో ఎవరిపైనా ఆధారపడకూడదని భావించే లక్షలాది మంది ప్రజలు రూపాయి రూపాయి కూడబెట్టి బీమా ప్రీమియంలు చెల్లిస్తున్నారు. మోదీ ప్రభుత్వం మాత్రం వీరిని కూడా వదలకుండా ఏటా రూ.24 వేల కోట్లను పన్నుల రూపంలో దండుకుంటోంది" అని రాహుల్ విమర్శించారు.

బాలుడి కస్టడీపై హైకోర్టు తీర్పు నిలిపివేత

న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) నాలుగున్నరేళ్ల బాలుడిని విదేశాలకు తీసుకెళ్లేందుకు తండ్రికి అనుమతిస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని సుప్రీంకోర్టు మంగళవారం నిలిపివేసింది. అమెరికా పౌరుడైన శ్రీనివాస్, ఆయన సతీమణి లలితాకుమారికి జన్మించిన ఈ బాలుడిని తొలుత తండ్రికి అప్పగించాలని హైకోర్టు ఆదేశించింది. అయితే పరస్పర విభేదాల వల్ల ఆ బాలుడిని 2023 మార్చిలో ఇండియాకు తీసుకువచ్చిన తల్లి లలితాకుమారి తనకు శాన్‌ఫ్రాన్సిస్కోలోని కన్సులేట్ జనరల్‌లో ఉద్యోగం వచ్చిందని, అమెరికా పౌరసత్వానికి దరఖాస్తు చేసుకున్నానని కోర్టుకు తెలిపింది. తన కుమారుడిని మంచి స్కూలులో చదివించగలనని, బాలుడిని తండ్రి తరచూ కలుసుకునేందుకు సహకరిస్తానని చెప్పడంతో సుప్రీం తల్లి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని హైకోర్టు ఆదేశాల్ని నిలిపివేసింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకూ బాలుడిని తల్లి కస్టడీలోనే ఉంచాలని న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ ఆదేశించింది.

ఇరాన్‌కు రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్

మాస్కో, బీరూట్ ఆగస్టు 6: మధ్య ప్రాశ్చ్యంలో ప్రాంతీయ యుద్ధం సంభవించే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో ఇరాన్‌కు రష్యా అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను సరఫరా చేయడం ప్రారంభించింది. వాటితో పాటు రాడార్లను పంపించింది. హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హనియేహ్‌ను టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ హత్య చేసినందుకు ప్రతీకారం తీసుకోవాలని ఇరాన్ భావిస్తున్న నేపథ్యంలో రష్యా అందిస్తున్న సహకారానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఇదిలా ఉండగా, ఫౌద్ షకూర్, హనియే జంట హత్యలకు ప్రతీకారం తీసుకుంటామని ప్రకటించిన హిజ్బుల్లా ఇరాన్ సాయంతో ఇజ్రాయెల్ సైన్యంపై మంగళవారం క్షిపణుల వర్షం కురిపించింది.

ముర్ముకు ఫిజీ అత్యున్నత పౌర పురస్కారం

సువా, ఆగస్టు 6: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విశిష్ట గౌరవం దక్కింది. ఫిజీ దేశంలో పర్యటిస్తున్న ఆమెకు ఆ దేశ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'ది కంపెనీయన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'ని అందజేసింది. అధ్యక్షుడు రటు విలియమే కటొనివెరే మంగళవారం ఆమెకు ప్రదానం చేశారు.



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 7 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

ఇఫ్లూలో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు



హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. షిల్లాంగ్, లఖ్‌నవూ ప్రాంతీయ క్యాంపస్‌లలో కూడా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. సీయూఈటీ యూజీ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఏటా నిర్దేశిత కోర్సులు పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. ఏడాది కోర్సు పూర్తిచేసి యూజీ సర్టిఫికెట్, రెండేళ్ల కోర్సు పూర్తిచేసి యూజీ డిప్లొమా, మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఏ డిగ్రీ, నాలుగేళ్లు చదివి బీఏ ఆనర్స్/రీసెర్చ్ డిగ్రీ పొందవచ్చు.

హైదరాబాద్ క్యాంపస్‌లో సబ్జెక్టులు-సీట్లు: ఇంగ్లీష్‌లో 40; అరబిక్, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, కొరియన్, పర్షియన్, రష్యన్, స్పానిష్, ఇటాలియన్, పర్ఫార్మెన్స్ ఆర్ట్స్-హ్యూమానిటీస్, డిజిటల్ కమ్యూనికేషన్ సబ్జెక్టులలో ఒక్కోదానిలో 20 సీట్లు ఉన్నాయి.

షిల్లాంగ్ క్యాంపస్‌లో సబ్జెక్టులు-సీట్లు: ఇంగ్లీష్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ సబ్జెక్టులలో ఒక్కోదానిలో 20 సీట్లు ఉన్నాయి.

లఖ్‌నవూ క్యాంపస్‌లో సబ్జెక్టులు-సీట్లు: ఇక్కడ ఇంగ్లీష్‌లో 20 సీట్లు ఉన్నాయి.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. సీయూఈటీ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.550; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275; దివ్యాంగులకు రూ.110
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్(ఫార్మర్స్ కోటా) కింద బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీ ఈఏపీ సెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



కాలేజీలు-సీట్లు

- బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌నకు సంబంధించి డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-బాపట్లలో 27 సీట్లు; కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-మడకశిరలో 20 సీట్లు ఉన్నాయి.
- బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు సంబంధించి డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-బాపట్లలో 21 సీట్లు; కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-పులివెందులలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత

- గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.
- **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- 'పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు.

స్పాట్ అడ్మిషన్స్: అభ్యర్థులు ఆగస్టు 19న డిప్లొమా బ్లాక్‌లో రిపోర్ట్ చేయాలి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదిన్నర వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. మధ్యాహ్నం పదకొండు నుంచి పన్నెండున్నర వరకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. సాయంత్రం రెండు గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. తరవాత కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.

- **మొదటి సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **కాషన్ డిపాజిట్:** రూ.5000 ✦ **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1200
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.700; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.350
- **స్పాట్ అడ్మిషన్స్ తేదీ:** ఆగస్టు 19
- **అభ్యర్థులు తమవెంట తీసుకురావాల్సిన పత్రాలు:** పదోతరగతి, డిప్లొమా సర్టిఫికెట్లు; టీసీ; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; రెండు ఫొటోలు; మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, వికలాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రం, ఫీజులకు సంబంధించిన డీడీలు/యూపీఐ
- **వేదిక:** రూమ్ నెంబర్ 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037.
- **వెబ్‌సైట్:** www.citdindia.org

బెంగళూరు ఐఐఎంలో డాక్టోరల్ ప్రోగ్రామ్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ) - డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్/ఐఐఎంబీ టెస్ట్ స్కోర్ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ఐఐఎంబీ టెస్ట్‌ను రెండు విడతల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేసుకోవచ్చు.



స్పెషలైజేషన్‌లు: డెసిషన్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎకనామిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ

అర్హత: ఏదేని స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/రెండేళ్ల పీజీ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. బీకాంతోపాటు ద్వితీయ శ్రేణి మార్కులతో సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; ప్రథమశ్రేణి మార్కులతో నాలుగేళ్ల ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. స్పెషలైజేషన్‌ను అనుసరించి 2025 జనవరి 24 నాటికి జీమ్యాట్/జీఆర్ఈ/క్యాట్/గేట్/జేఆర్ఎఫ్ నెట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే ఐఐఎంబీ నిర్వహించే టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జాతీయ పరీక్ష వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు ఒక స్పెషలైజేషన్‌కు అప్లయ్ చేస్తే రూ.1000, రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేస్తే రూ.1500 చెల్లించాలి. ఐఐఎంబీ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒక స్పెషలైజేషన్‌కు అప్లయ్ చేస్తే రూ.2200; రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేస్తే రూ.2700 చెల్లించాలి.
- **దరఖాస్తు విండో ఓపెన్:** 2025 జనవరి 24 వరకు
- **ఐఐఎంబీ టెస్ట్ తేదీలు:** 2024 నవంబరు 17, 2025 ఫిబ్రవరి 2
- **ఇంటర్వ్యూలు:** 2025 మార్చి 13, 14, 15
- **వేదిక:** బెంగళూరు క్యాంపస్ ❖ **వెబ్‌సైట్:** iimb.ac.in

SCHOLARSHIP ALERT

Bharti Airtel

Description: Bharti Airtel Foundation invites applications from deserving students enrolled in technology or engineering undergraduate and integrated courses (up to 5 years) at the top 50 NIRF (engineering) institutions across India. The program is designed to support students from diverse socio-economic backgrounds, with focus on girls, to help them become future technology leaders.

Eligibility: For the Bharti Airtel Scholarship Program 2024-25, students should meet the following eligibility criteria:

- Confirmed admission in the first year (starting with the 2024 cohort) of the UG/5 year integrated courses in fields of Electronics & Communication, Telecom, Information Technology, Computer Sciences, Data Sciences, Aerospace and Emerging Technologies (AI, IoT, AR/VR, Machine Learning, Robotics) at the top 50 NIRF Engineering institutions across India. (Basis the latest list available).
- Must be a citizen and resident of India
- Family annual income from all sources should not exceed INR 8.5 Lakh
- Applicants should not be recipients of any other scholarship or grants for the same purposes supported by Bharti Airtel Foundation.

NOTE: Girl students are encouraged to apply.

Prizes & Rewards: Scholarships are for the full duration of the UG courses including integrated courses of up to 5 years (subject to meeting the renewal criteria).

- Each scholarship covers 100% of annual fees as per the fee structure of the respective institute/universities.
- The hostel and mess fees shall be given to all eligible students who apply for it
- For students staying in PG/outside hostel, the support shall be extended as per the Hostel/Mess charges of the institute
- A laptop will be provided in the first year of the course
- Once the Bharti Scholars graduate and are subsequently gainfully employed, they will undertake to voluntarily extend financial support to at least one student at a school or college level at any point of time, to the extent they can.

NOTE: Refundable and security deposits are not covered under the Bharti Airtel Scholarship 2024-25. Students are responsible for these payments and their refunds.

Last Date to Apply: 31-08-2024

Application mode: Online application only

Short Url: ww.b4s.in/aj/BHRSP1

Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 10-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ASPI2

Raman Kant Munjal



Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 20-08-2024

Application mode: Online applications only

Short Url: ww.b4s.in/aj/RMKSP4

buddy4study.com

వివిధ



నిజాయితీ

రామ కృష్ణా పురంలో శేషయ్య, భూషయ్య అనే ఇద్దరు వ్యాపారులు ఉండేవారు వారిద్దరి మధ్య వ్యాపారపరంగా పోటీ ఎక్కువ ఉండటం వల్ల ఇద్దరూ ప్రత్యర్థుల లాగా ఎదుటి వారిని అధిగమించాలనే ఆలోచనల్లో ఉండేవారు. ఒక రోజు శేషయ్య తన దుకాణంలో కూర్చుని లెక్కలు రాసుకుంటూ ఉండగా అతని దగ్గరికి తిరుపతి అనే యువకుడు వచ్చి గుమాస్తా ఉద్యోగం కావాలని అడిగాడు. ఆ యువకుడిని అంతకు ముందే ఎక్కడో చూసినట్లుగా అనిపించి, ఏమోయ్ నువ్వు ఇంతకు ముందు భూషయ్య కొట్టులో పనిచేసినట్టు ఉన్నావు కదూ అని అడిగాడు శేషయ్య. దానికి తిరుపతి అవునండీ అక్కడ జీతం చాలడం లేదనిపించి పని మానేశాను అని చెప్పాడు తిరుపతి. దానికి శేషయ్య రేపు ఇక్కడ కూడా జీతం చాలడంలేదు అనిపిస్తే ఏం చేస్తావు? అని అడిగాడు. నేను చేసే పనికి జీతం తక్కువనిపిస్తే మిమ్మల్ని పెంచమని అడగడంలో తప్పు లేదు కదండీ అన్నాడు తిరుపతి. 'మరి నీకు ఉద్యోగమిస్తే, నాకు ఏదైనా ప్రత్యేక ప్రయోజనం ఉంటుందా? అంటే భూషయ్య వ్యాపార రహస్యాలు నాకు చెబుతావా?' అని అడిగాడు శేషయ్య. దానికి తిరుపతి 'అయ్యో రామా అది మాత్రం చేయనండీ. అలా చేస్తే రేపు నా వ్యాపార రహస్యాలు కూడా మరో చోట చెప్పవని నమ్మకం ఏమిటి అని మీరునన్ను అనుమానిస్తారు కాబట్టి ఒక యజమాని విషయాలు మరొకరితో అసలే చెప్పను' అన్నాడు తిరుపతి. ఆ మాటలకు సంతోషించిన శేషయ్య 'నీకు మంచి తెలివి తేటలే కాక నిజాయితీ కూడా ఉన్నట్లు తోస్తున్నది. రేపు ఉదయం నుంచే నువ్వు పనిలో చేరవచ్చు' అన్నాడు.

సరైన నీడ ఏది?



5 తేడాలను కనుక్కోండి





ఎన్ని కుక్కలు, పిల్లులు ఉన్నాయి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 377

		3	
		4	
	1		
	3		

సుడోకు - 376 సమాధానం

2	4	5	6	3	1
1	6	3	5	2	4
6	3	2	1	4	5
4	5	1	2	6	3
3	1	6	4	5	2
5	2	4	3	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.